

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గౌతమ్ అదానీకి సెబీ క్లీన్‌చిట్

అదానీ గ్రూప్, రాజేశ్ అదానీలకు కూడా..

ఇన్‌సైడర్ ట్రేడింగ్ అబద్ధం

హిండెన్‌బర్గ్ ఆరోపణలకు ఆధారాల్లేవని తేల్చిన సెబీ

11

శుక్రవారం | 19-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 172 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి రా.11.37 తదుపరి చతుర్దశి, నక్షత్రం:ఆశ్లేష ఉ.7.06 తదుపరి మఖ, వర్జ్యం: రా.7.36-9.16, దుర్ముహూర్తం: ఉ.8.31-9.20, మ.12.32-1.21, అమృతఘడియలు: శేషం ఉ. 7.16 వరకు, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.07, సూర్యాస్తమయం: 6.10 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అందరూ పేదలే!

రాష్ట్ర జనాభా 3.50 కోట్లు.. తెల్ల రేషన్‌కార్డుల లబ్ధిదారులు 3.25 కోట్ల మంది!

రాష్ట్రంలో మొత్తం 1,01,22,324 కార్డులు



- కొత్తగా 2.50 లక్షల కార్డులు ఇవ్వనున్న సర్కారు
- అప్పుడు 3.35 కోట్లకు చేరనున్న లబ్ధిదారుల సంఖ్య!
- అంటే దారిద్ర్య రేఖకు పైన ఉండేది 15 లక్షల మందే!!
- 10 లక్షల మంది ఉద్యోగుల కుటుంబాలు ఏమయ్యాయి?
- పెన్షనర్లు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు, మిల్లర్లు ఎక్కడ?
- రాష్ట్రంలో 25లక్షల కార్లు.. వారిలో కార్డుల్లేని కుటుంబాలెన్ని?
- ప్రైవేటు ఉద్యోగులు, వైద్యులు, వృత్తి నిపుణులు ఏమయ్యారు?
- అనర్హులకూ ఆహారభద్రత కార్డులు.. పొంతన లేని లెక్కలు!

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అందరూ పేదలే..! అవును మీరు చదివింది నిజమే!! మన రాష్ట్ర జనాభా అక్షరాలా 3.50 కోట్లు! తెల్లరేషన్ కార్డులున్న లబ్ధిదారుల సంఖ్య ప్రస్తుతం 3.25 కోట్లు..!! మరో 2.50 లక్షల రేషన్‌కార్డులు జారీచేసేందుకు పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. అంటే లబ్ధిదారుల సంఖ్య మరో 10 లక్షలు పెరిగి.. తెల్ల రేషన్‌కార్డు లబ్ధిదారుల సంఖ్య 3.35 కోట్లకు చేరుతుంది!! రాష్ట్ర జనాభా 3.50 కోట్లు కాగా.. అందులో 3.35 కోట్ల మంది పేదలే..! కేవలం 15 లక్షల మందే దారిద్ర్య రేఖకు ఎగువన ఉంటారన్నమాట!! రాష్ట్రంలో ఉన్న తెల్లరేషన్ కార్డులు, జనాభా లెక్కలను పోల్చి చూస్తే.. ఈ విస్తుగొలిపే విషయం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ అనేది ఎన్నికల హామీగా మారిపోయింది. అధికారంలోకి రాగానే రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల్లో ప్రచారం చేసుకుంటోంది. ప్రతి ప్రభుత్వం ఎన్నో కొన్ని రేషన్ కార్డులు జారీ చేస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో తెల్లకార్డుల పంపిణీ జరిగింది. తెలంగాణ ఏర్పడ్డాక కూడా జరుగుతోంది. కుటుంబాల సంఖ్య, జనాభా పెరుగుతున్న కొద్దీ సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య కూడా

మిగతా 13వ పేజీలో...



భారత్.. సంపన్నుల ఫ్యాక్టరీ

దేశంలో పెరుగుతున్న మిలియనీర్లు

- 8.5 కోట్లకుపైగా ఆస్తి కలిగిన 8.71 లక్షల కుటుంబాలు
- 2021తో పోలిస్తే 90 శాతం పెరుగుదల
- ముంబై, ఢిల్లీ, బెంగళూరుల్లోనే ఎక్కువ
- బంగారం, షేర్లు, భూములపై పెట్టుబడులు
- బెంజ్ హురూన్ ఇండియా వెల్త్ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: మన దేశంలో సంపన్నుల సంఖ్య ఏటేటా భారీగా పెరుగుతోంది. మిలియనీర్లను తయారు చేసే ఫ్యాక్టరీగా భారత్ మారుతోంది. ఈ విషయం మెర్సిడెస్ బెంజ్ హురూన్ ఇండియా వెల్త్ రిపోర్టు- 2025 స్పష్టం చేసింది. దేశంలో లక్ష్మీ పుత్రులు విలాస వస్తువులను కొనుగోలు చేస్తున్నారని, పలు రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారని, ప్రపంచాన్నే ప్రభావితం చేస్తున్నారని ఆ నివేదిక వివరించింది. ఆ నివేదిక ప్రకారం.. 8.5 కోట్లకు (1 మిలియన్ డాలర్లు)పైబడి ఆస్తి కలిగిన మిలియనీర్ల కుటుంబాలు ప్రస్తుతం దేశంలో 8.71 లక్షలు ఉన్నాయి. 2021తో పోలిస్తే ఆ సంఖ్య 90 శాతం పెరిగింది. అప్పట్లో మొత్తం దేశంలోని కుటుంబాల్లో ఈ మిలియనీర్ల

మిగతా 2వ పేజీలో...

పెట్టుబడుల కోసం ఢిల్లీకి!

నేడు పబ్లిక్ అఫైర్స్ ఫోరం వార్షిక సదస్సులో పాల్గొననున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



- కార్ల్స్‌బర్గ్, అమెజాన్, కార్నైల్, గోద్రెజ్, ఉబర్ ప్రతినిధులతో సమావేశాలు
- న్యూజెర్సీ గవర్నర్ మర్ఫీ, డబ్ల్యూఈఎఫ్ అధ్యక్షుడు బ్రెండేతో సీఎం భేటీ
- రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్న కార్ల్స్‌బర్గ్

13



కుమరం భీం జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది

150 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి

మహారాష్ట్రను ఒప్పించేందుకు నెలాఖర్లో వెళ్లనున్న అధికారులు

- 165 బదులు 80 టీఎంసీల తరలింపునకే తాజాగా ప్రతిపాదనలు
- సాధ్యాసాధ్యాల నివేదిక తయారీకి అధికారుల ముమ్మర కసరత్తు
- గత సర్కారు హయాంలో ఆగిన పనుల పునరుద్ధరణకు సంకల్పం

హైదరాబాద్, ఆసిఫాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా నిలిచిపోయిన పనులన్నిటినీ పునరుద్ధరించాలని రేవంత్ ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించడంతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు, ఉమ్మడి

మిగతా 3వ పేజీలో...



ఓట్ల దొంగలకు సీఈసీ రక్ష!

- కర్ణాటకలోని ఆళంద అసెంబ్లీ నియోజకవర్గంలో ఆన్‌లైన్ ద్వారా కాంగ్రెస్ ఓట్ల తొలగింపు
- వివరాల కోసం కర్ణాటక సీఐడీ 18 నెలల్లో 18 లేఖలు రాసినా ఈసీ సమాచారం ఇవ్వలేదు: రాహుల్ గాంధీ
- త్వరలో 'మాస్టర్‌మైండ్'ను బయటపెడతానని వెల్లడి
- ఆన్‌లైన్లో ఎవరూ ఓట్లు తొలగించలేరు: ఈసీ

న్యూఢిల్లీ/బెంగళూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తన దాడిని ఇంకా తీవ్రతరం చేశారు. ఈదఫా ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై నేరుగా దాడికి దిగారు. ఓట్ల దొంగలకు ఆయన అండగా ఉన్నారని.. ప్రజాస్వామ్య

మిగతా 2వ పేజీలో...

ఆ ఇద్దరు మంత్రుల మధ్య కోల్డ్ వార్!

- అటవీ అధికారులతో ఓ మంత్రి సమీక్ష నిర్వహించడంపై ఆ శాఖ మంత్రి ఆగ్రహం
- తనకు తెలియకుండా ఎలా నిర్వహిస్తారని ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు
- తన నియోజకవర్గ సమస్యలపైనే సమీక్ష జరిపానన్న మరో మంత్రి



హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇద్దరు మంత్రుల మధ్య కోల్డ్ వార్ కొనసాగుతోంది. అటవీశాఖ అధికారులతో ఓ మంత్రి సమీక్ష నిర్వహించడం దీనికి దారితీసింది. తనకు తెలియకుండా తన శాఖ అధికారులతో మరో మంత్రి సమీక్ష జరపడం ఏమిటని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర అసహనంతో ఉన్నట్టు తెలిసింది. ఉత్తర తెలంగాణకు చెందిన మంత్రి తన నియోజవర్గంలోని అటవీ భూముల మీదుగా వెళుతున్న రహదారులకు అటవీ క్లియరెన్స్, పోడు భూముల సమస్యలపై అటవీ శాఖ అధికారులతో కొన్నిరోజుల క్రితం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. పీసీసీఎఫ్ సువర్ణ, ఆ సమీక్ష నిర్వహించిన మంత్రికి చెందిన జిల్లా కలెక్టర్, అటవీ శాఖ అధికారులు ఆ సమావేశంలో పాల్గొన్నారు. ఈ విషయం

మిగతా 13వ పేజీలో...



ఉల్లి కిలో

కర్నూలు మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న ఉల్లి

50 పైసలు!

ఏపీలో బహిరంగ వేలంలో పలికిన ధర

- క్వింటా రూ.1,200కు సేకరించిన ప్రభుత్వం
- కర్నూలు మార్కెట్‌లో వేలంపాట నిర్వహణ
- క్వింటాకు కనిష్ఠ ధర రూ.50.. గరిష్ఠంగా రూ.400
- బయట మార్కెట్‌లో వందకు 4 కేజీలు అమ్మకం

కర్నూలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): "కొనేటప్పుడు చింత పండు రేటు.. అమ్మేటప్పుడు బంగారం రేటు.." అనే సామెత ఏపీలో ఉల్లి వ్యాపారులకు అతికినట్టు సరిపోతుందేమో! రాయలసీమ జిల్లాల్లో ఉల్లి ధరలు పతనం కావడంతో రైతులను ఆదుకునేందుకు క్వింటాకు రూ.1200 చెల్లించి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించిన కూటమి ప్రభుత్వం వాటికి కర్నూలు మార్కెట్‌లో గురువారం వేలంపాట నిర్వహించగా... క్వింటా ఉల్లిని కనిష్ఠంగా రూ.50కి కొనుగోలు చేశారు. అంటే.. కిలో 50 పైసలన్నమాట..! గరిష్ఠంగా

మిగతా 3వ పేజీలో...

డ్రగ్స్ అడ్డా భారత్

అక్రమంగా తయారీ,రవాణాకు స్థావరం

- మరోసారి విషం చిమ్మిన డొనాల్డ్ ట్రంప్
- చైనా, పాక్ సహా 23 దేశాలతో జాబితా
- ప్రాణాంతక 'ఫెంటానిల్' పాపం చైనాదే
- కాంగ్రెస్‌కు నివేదిక ఇచ్చిన అధ్యక్షుడు



వాషింగ్టన్, సెప్టెంబరు 18 : ప్రతీకార సుంకాలు విధించినా లొంగని భారత్‌పై విష ప్రచారాన్ని అమెరికా ముమ్మరం చేసింది. అక్రమంగా డ్రగ్స్ ఉత్పత్తి, రవాణాకు భారత్ అడ్డాగా మారిందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. కాంగ్రెస్‌కు తాజాగా సమర్పించిన ప్రెసిడెన్షియల్ డిటర్మినేషన్ రిపోర్టులో ఆయన ఆ ఆరోపణలు చేశారు. అమెరికా పౌరుల ప్రాణాలకు ముప్పుగా మారిన సింథటిక్ డ్రగ్ 'ఫెంటానిల్' ఉత్పత్తికి వాడే రసాయనాలను పెద్దఎత్తున సమకూరుస్తుందంటూ చైనాపై ట్రంప్ విరుచుకుపడ్డారు. డ్రగ్స్ అక్రమ రవాణాను

మిగతా 2వ పేజీలో...

సంగారెడ్డి జైలులో సైకో ఖైదీలు

అలవాటుపడ్డ గంజాయి దొరక్క వీరంగం

14

అన్ని మతాలనూ **గౌరవిస్తా!** సీజేఐ గవాయ్

2



మాలో ఒకరిపై దాడి చేస్తే.. మా ఇద్దరిపై చేసినట్టే!

పాక్-సౌదీ మధ్య 'నాటో' తరహా రక్షణ ఒప్పందం

- ఖతార్‌లో ఇటీవల జరిగిన ముస్లిం దేశాల భేటీలో 'ఇస్లామిక్ నాటో' ఏర్పాటుకు పలు దేశాల ఒత్తిడి
- ఆ భేటీ జరిగిన 2 రోజులకే పాక్-సౌదీ ఒప్పందం
- మన దేశంపై కలిగే ప్రభావాలను పరిశీలిస్తున్నాం: భారత్
- ఇది మోదీ మరో దౌత్య వైఫల్యమే.. కాంగ్రెస్ విమర్శలు

2



రియాద్‌లో సౌదీ యువరాజు సల్మాన్‌తో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్



నిజాముద్దీన్ (ఫైల్)

అమెరికాలో పోలీసు కాల్పుల్లో పాలమూరువాసి మృతి

- రూమ్‌మేట్స్ గొడవ..
- ఆయుధాలతో పరస్పరం దాడులు
- నిలువరించే యత్నంలో పోలీసుల కాల్పులు
- మృతుడు కాలిఫోర్నియాలో గూగుల్ ఉద్యోగి

14

ఇక ఏటా అతి భారీ వర్షాలే!

2

- గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులే కారణం
- వాతావరణ సగటు ఉష్ణోగ్రతలు పెరుగుదల
- గాలిలో తేమ నిలుపుకొనే సామర్థ్యం అధికమై క్యుములోనింబస్ మేఘాలు.. తరచు క్లౌడ్ బరస్ట్‌లు
- సౌదీ వంటి ఎడారి ప్రాంతాల్లోనూ వరదలు
- బద్దలవుతున్న అధిక వర్షపాతం రికార్డులు
- హైదరాబాద్‌లో పగలు ఎండ.. సాయంత్రం భారీ వర్షం
- రాష్ట్రంలో మరో 2-3 రోజులు భారీ వానలు

14

బంగ్లాదేశీ చొరబాటుదారులను కాపాడేందుకే రాహుల్ యాత్ర

» ఓట్ చోరీ యాత్రపై కేంద్ర మంత్రి అమిత్ షా

పట్నా, సెప్టెంబరు 18: కర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపు అంశంలో ఎన్నికల సంఘాన్ని తప్పుబడుతూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించారు. తప్పుడు కథనాలను ప్రచారం చేయడం కాంగ్రెస్‌కు అలవాటైపోయిందని మండిపడ్డారు. బంగ్లాదేశీ చొరబాటుదారులను కాపాడేందుకే ఓట్ చోరీ పేరిట రాహుల్ గాంధీ బిహార్‌లో యాత్ర చేపట్టారని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. త్వరలో ఎన్నికలు జరగనున్న బిహార్ పర్యటనలో ఉన్న అమిత్ షా.. స్థానిక బీజేపీ నేతలతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా షా మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ చేపట్టిన యాత్ర మంచి విద్య, ఉద్యోగాలు, విద్యుత్, రహదారులు కోసం కాదని, బంగ్లాదేశ్ చొరబాటుదారులను రక్షించేందుకని ఆరోపించారు. చొరబాటుదారులకు ఓటు హక్కు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలా ? అంటూ ఆయన ప్రశ్నించారు.

నేపాల్‌లో శాంతి పునరుద్ధరణకు మద్దతు

» సుశీలా కార్కీకి ప్రధాని మోదీ హామీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: నేపాల్‌లో శాంతి స్థాపనకు, స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి చేసే ప్రయత్నాలకు భారత్ అండగా ఉంటుందని ప్రధాని మోదీ ప్రకటించారు. నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కార్కీతో మోదీ గురువారం ఫోన్‌లో సంభాషించారు. తమ సంభాషణ వివరాల్ని మోదీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఇటీవల ఆ దేశంలో చెలరేగిన హింసాత్మక ఘర్షణల్లో మరణించిన వారికి సంతాపం వ్యక్తం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా శుక్రవారం నేపాల్ జాతీయ దినోత్సవం సందర్భంగా నేపాల్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

హసీనా ఓటు హక్కు నిలిపివేత

ఢాకా, సెప్టెంబరు 18: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఓటు హక్కును ఆ దేశ ఎన్నికల కమిషన్(ఈసీ) నిలిపివేసింది. ఈసీ కార్యదర్శి అఖ్తర్ అహ్మద్ బుధవారం ఢాకాలోని నిర్వాచన్ భవన్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. ఆమె జాతీయ గుర్తింపు కార్డులను లాక్ చేశామని, దీంతో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆమె ఓటు వేయలేరని అహ్మద్ తెలిపారు. కాగా, హసీనా చెల్లెలు షేక్ రెహానా, కుమారుడు సజీబ్ వాజెద్, కుమార్తె సైమా వాజెద్ పుతుల్‌ల ఎన్ఐడీలను కూడా ఈసీ లాక్ చేసినట్లు వార్తలు వచ్చాయి.

శశికళ కేసు.. హైదరాబాద్‌లో ఈడీ సోదాలు

హైదరాబాద్, చెన్నై, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకును రూ.200 కోట్ల మేర మోసగించిన కేసుకు సంబంధించి తమిళనాడు మాజీ సీఎం జయలలితకు సహచరి అయిన వీకే శశికళ బినామీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దృష్టి సారించింది. 2022లో సీబీఐ నమోదు చేసిన ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై దర్యాప్తు చేపట్టిన ఈడీ.. చెన్నై, హైదరాబాద్‌ల్లో గురువారం సోదాలు నిర్వహించింది. శశికళకు బినామీ అని ఆరోపణలు ఎదుర్కొంటున్న మార్గ్ గ్రూపు అధినేత జి.రామకృష్ణారెడ్డి(జీఆర్‌కే రెడ్డి) లక్ష్యంగా ఈడీ బృందాలు గురువారం దాడులు చేశాయి. హైదరాబాద్‌లోని శామీర్‌పేట, పంజాగుట్ట ప్రాంతాల్లో జీఆర్‌కే రెడ్డికి చెందిన ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ బృందాలు సోదాలు చేశాయి. చెన్నైలోని సైదాపేట శ్రీనగర్ ప్రాంతంలోని రామకృష్ణారెడ్డి ఇంట్లో, తిరువాన్మియూరు, కోడంబాక్కం, వెస్ట్ మాంబళం సహా ఆరు ప్రాంతాల్లో కూడా ఈడీ బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ఈ సోదాల్లో బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన కొన్ని పత్రాలు, జీఆర్‌కే రెడ్డి, ఆయన సంస్థలు కొనుగోలు చేసిన ఆస్తులకు సంబంధించిన రికార్డులను ఈడీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మిడ్‌వెస్ట్ గోల్డ్, మెడ్‌ప్లస్ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో జీఆర్‌కే రెడ్డికి రూ.2,800 కోట్లకు పైగా విలువైన షేర్లు ఉన్న నేపథ్యంలో ఆ వివరాలను కూడా అధికారులు పరిశీలించినట్లు సమాచారం. శశికళ బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని ఆ డబ్బును జీఆర్‌కే రెడ్డికి చెందిన సంస్థలకు మళ్లించగా.. ఆ సొమ్ముతో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. చెన్నైలో పలు రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు చేపట్టిన జీఆర్‌కే రెడ్డి.. జయలలిత అధికారంలో ఉన్నప్పుడు ఆమె తరఫున హైదరాబాద్‌లో ఆస్తులు కొనుగోలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. జయలలిత మరణం తర్వాత ఆమె సహచరి శశికళ తరఫున జీఆర్‌కే రెడ్డి పని చేస్తున్నారనే సమాచారంతోనే ఈడీ ఆయనపై దృష్టి పెట్టినట్లు సమాచారం.

అన్ని మతాలనూ గౌరవిస్తా!

» నా వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

» 'విష్ణుమూర్తిని ప్రార్థించండి' వ్యాఖ్యలపై సీజేఐ వివరణ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: అన్ని మతాలనూ తాను గౌరవిస్తానని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని ఖజురహో ఆలయాల సముదాయంలో ఉన్న విష్ణుమూర్తి విగ్రహం పునరుద్ధరణపై దాఖలైన ఓ పిటిషన్ మీద తాను చేసిన వ్యాఖ్యలను సోషల్ మీడియాలో కొందరు తప్పుడుగా ప్రచారం చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే, మతాలన్నింటి పట్లా తనకు గౌరవభావం ఉందని ఆయన గురువారం ఉద్ఘాటించారు. యునెస్కో వారసత్వ సంపదలో భాగమైన ఖజురహోలోని దెబ్బతిన్న విష్ణుమూర్తి విగ్రహాన్ని పునర్‌నిర్మించి, తిరిగి ప్రతిష్ఠించాలని కోరుతూ ఇటీవల ఓ వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. ఇది భారతీయ పురావస్తు సంస్థ(ఏఎస్ఐ) పరిధిలో ఉన్న ఆలయమని, కాబట్టి, ఆ సంస్థను సంప్రదించమని పేర్కొంటూ సీజేఐ ఈ పిటిషన్‌ను తోసిపుచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ఇది పూర్తిగా ప్రచారం కోసం వేసిన వ్యాజ్యం. మీరు విష్ణుమూర్తి భక్తులని అంటున్నారు కాబట్టి, ఆ విష్ణువునే ప్రార్థించండి' అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో వ్యతిరేకత వ్యక్తమైంది. కాగా, ఈ అంశంపై వీహెచ్‌పీ జాతీయాధ్యక్షుడు అలోక్ కుమార్ మాట్లాడుతూ, సీజేఐ వ్యాఖ్యలు హిందూమత విశ్వాసాల్ని అవమానించే విధంగా ఉన్నాయని, ఇటువంటి వ్యాఖ్యలు చేయకుండా ఉంటే మంచిదని పేర్కొన్నారు.

అనిల్ అంబానీ, రాణా కపూర్‌లపై సీబీఐ చార్జిషీటు

» రూ.2,796 కోట్ల బ్యాంకు నిధులను దుర్వినియోగం చేసినట్టు ఆరోపణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: అనిల్ ధీరూబాయ్ అంబానీ (ఏడీఏ) గ్రూపు ఛైర్మన్ అనిల్ అంబానీ, యస్ బ్యాంకు మాజీ సీఈఓ రాణా కపూర్‌లపై సీబీఐ గురువారం ముంబయి ప్రత్యేక కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసింది. ఇద్దరూ కుమ్మక్కయి రూ.2,796 కోట్ల బ్యాంకు నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించింది. రాణా కపూర్ భార్య బిందు కపూర్, కుమార్తెలు రాధా కపూర్, రోషిణీ కపూర్‌లపై కూడా అభియోగ పత్రాలను సమర్పించింది. అనిల్ అంబానీ గ్రూపు పరిశ్రమలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలిసినప్పటికీ, వాటిపై ఆర్థిక సంస్థలు కన్నేసి ఉంచినప్పటికీ యస్ బ్యాంకు తరఫున భారీగా పెట్టుబడులు పెట్టినట్టు ఆరోపించింది. ఈ విషయంలో సీఈఓగా రాణా కపూర్ తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని పేర్కొంది. ప్రతి ఫలంగా రాణా కపూర్ కుటుంబ సభ్యుల కంపెనీల్లో అనిల్ అంబానీ గ్రూపు కంపెనీలు పెట్టుబడులు పెట్టాయని తెలిపింది. ఇదంతా నీకిది-నాకిది తరహాలో సాగిందని ఆరోపించింది. నష్టాల్లో ఉన్నాయని తెలిసినా అనిల్ అంబానీ కంపెనీలకు చెందిన బాండ్లను, డిబెంచర్లను యస్ బ్యాంకు కొనుగోలు చేసిందని తెలిపింది. వీటిపై మెచ్యూరిటీ డేట్‌ను స్పష్టంగా పేర్కొనలేదని, ఆర్థిక సంక్షోభం వస్తే వాటిని పూర్తిగా మాఫీ చేయడమో, వాటాలుగా మార్చడమో చేయాల్సి ఉంటుందని వివరించింది. ఇదంతా మోసపూరితంగా జరిగిందని ఆరోపించింది.

ఇక ఏటా అతి భారీ వర్షాలే!

తరచుగా కుండపోత వానలకు అవకాశం.. గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులే కారణం



దేశంలో, రాష్ట్రంలో ఈసారి ఎన్నడూ లేనట్టుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అదీ ఉన్నట్టుండి కుండపోత (క్లౌడ్ బరస్ట్) వానలు పడుతున్నాయి. ఒకట్రెండు గంటల్లోనే పది, పదిహేను సెంటీమీటర్ల వర్షపాతంతో వరదలు వస్తున్నాయి. హిమాలయాలు, కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం, బురద వరదలు వంటివి అతలాకుతలం చేస్తున్నాయి. గత రెండు నెలల్లో తెలంగాణ సహా దేశవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఇలా కుండపోత వానలు పడ్డాయి. మన రాష్ట్రంలోని కొన్నిప్రాంతాల్లో రెండేళ్లుగా అధిక వర్షపాతం రికార్డులు బద్దలయ్యాయి. ములుగు జిల్లా ఏటూరునాగారంలో 2023 జూలై 27న ఏకంగా 64 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఇటీవల కామారెడ్డి జిల్లాలో ఏకంగా 55 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఈసారి ఆగస్టు చివరినుంచి ఇప్పటివరకు చాలా ప్రాంతాల్లో 10-20 సెం.మీ వర్షపాతాలు నమోదవుతూనే ఉన్నాయి. ఈసారే కాదు.. ప్రతి ఏటా అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్లోబల్ వార్మింగ్, కాలుష్యం వల్ల ఏర్పడుతున్న వాతావరణ మార్పుల ప్రభావమే ఇది అని స్పష్టం చేస్తున్నారు.

ఎడారుల్లోనూ వరదలు..

వాతావరణ మార్పుల ప్రభావం చాలా తీవ్రంగా ఉంటోంది. పొడి ప్రాంతాలు పచ్చబడుతూ, పచ్చని ప్రాంతాలు మరింత చిత్తడిగా మారుతూ ఉంటే.. మరోవైపు మంచు కురిసే చోట ఎండలు మంటరేపుతున్నాయి. వందల ఏళ్లుగా ఎడారులుగా ఉన్న ప్రాంతాల్లో ఇటీవలికాలంలో భారీ వర్షాలు, వరదలు వస్తున్నాయి. గడ్డి, మొక్కలు పెరుగుతూ పచ్చబడుతున్నాయి. గత వందేళ్లలో ఎన్నడూ లేనట్టుగా గత ఏడాది సెప్టెంబరులో సహరా ఎడారిలో అతిభారీ వర్షాలు కురిసి, వరదలు వచ్చాయి. ఎడారి దేశం సౌదీ అరేబియాలో కొన్నేళ్లుగా భారీవర్షాలు పడుతూ, ఎడారి ప్రాంతం పచ్చగా మారుతోంది. ఇక ఈ ఏడాది జనవరి తొలి వారంలో, గత నెల 29న ఆ దేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలతో వరదలు రావడం గమనార్హం. ఇక సాధారణంగా వర్షాలు పడే ప్రాంతాల్లో.. కొన్నేళ్లుగా అతి భారీ, కుండపోత వానలు కురుస్తున్నాయి. తీవ్రమైన వరదలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా భారత్, పాక్, బంగ్లాదేశ్ సహా ఇతర దక్షిణాసియా దేశాల్లో వర్షపాతం, కుండపోత వానల తీవ్రత పెరిగిపోయింది.

గాలి వేడెక్కి... నీటి ఆవిరి పెరిగిపోయి..

గ్లోబల్ వార్మింగ్‌తో సముద్రాల ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఆ వేడితో ఆవిరయ్యే నీటి శాతం పెరుగుతోంది. మరోవైపు గాలి కూడా వేడెక్కి నీటి ఆవిరిని నిలుపుకొనే సామర్థ్యం మరింత ఎక్కువవుతోంది. అలా ఎక్కువ తేమతో కూడిన గాలులు అతి భారీ వర్షాలకు కారణమవుతున్నాయి. ప్రధానంగా పర్వత ప్రాంతాల్లో, అల్పపీడనాలు నెలకొనే ప్రాంతాల్లో.. దట్టమైన క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి కుండపోత వానలు పడుతున్నాయి. ప్రస్తుతం హిందూ మహాసముద్రం, అరేబియా సముద్రం మీదుగా వీస్తున్న రుతుపవనాల్లో అధిక తేమ కారణంగానే దక్షిణాసియా ప్రాంతంలో అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ నిపుణులు తేల్చారు.

పశ్చిమాసియా నుంచి వీస్తున్న గాలులతో..

పశ్చిమాసియా ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా తరచూ అల్పపీడన పరిస్థితులు ఏర్పడుతున్నాయని.. అక్కడినుంచి తూర్పువైపు వీస్తున్న గాలులు.. ఇక్కడ నైరుతి రుతుపవనాలతో కలుస్తున్నాయని యూకేలోని వర్సిటీ ఆఫ్ రీడింగ్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త అక్షయ్ దేవరాస్ వెల్లడించారు. దీనితో భిన్నమైన వాతావరణ పరిస్థితి ఏర్పడి ఉత్తరాది రాష్ట్రాల్లో అతిభారీ వర్షాలు పడుతున్నాయని, దక్షిణాదిపైనా ప్రభావం ఉంటోందని తెలిపారు.

- సెంట్రల్ డెస్క్

నైరుతి రుతుపవనాల్లో మార్పులు

వందల ఏళ్లుగా పరిశీలిస్తున్నా కూడా ఏటా జూన్ నుంచి సెప్టెంబరు వరకు నైరుతి రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా ఒక క్రమానుగతంగా వానలు కురిసేవి. కానీ కొన్నేళ్లుగా పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రావడం లేదా మరింత ముందుగానే రావడం, కొన్ని రోజుల పాటు వరుసగా భారీ వర్షాలు కురవడం తర్వాత 20-25 రోజుల పాటు వానల జాడే లేకుండా పోవడం (డ్రైస్పెల్), పైగా ఈ సమయంలో సాధారణంగా అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవడం పరిపాటిగా మారింది. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

పదేళ్లుగా పెరిగిపోతున్న క్లౌడ్ బరస్ట్ ఘటనలు

- ఏదైనా పరిమిత ప్రాంతంలో గంటలో 10 సెంటీమీటర్లు, అంతకన్నా ఎక్కువ వర్షం పడితే క్లౌడ్ బరస్ట్ అంటారు. మన దేశంలో పదేళ్లుగా క్లౌడ్ బరస్ట్ ఘటనలు బాగా పెరిగాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.
- ఈ ఏడాది జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్ తదితర హిమాలయ రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో క్లౌడ్ బరస్ట్, ఆకస్మిక వరదల ఘటనలు జరిగాయి. వందలాది మంది మరణించారు. హిమాలయాల్లోని మంచు ప్రాంతాలు, హిమానీ నదాలపై భారీ వర్షం కురవడంతో.. ఈ నీటితో పాటు మంచు కూడా వేగంగా కరిగి ఆకస్మిక వరదలకు కారణం అవుతోందని గ్రాజ్ యూనివర్సిటీ శాస్త్రవేత్త జేకబ్ స్టైనర్ తెలిపారు.
- ప్రస్తుత నైరుతి సీజన్‌కు సంబంధించి సెప్టెంబర్ 17 వరకు దేశంలో కురవాల్సిన సాధారణ వర్షపాతం 80.6 సెం.మీ.కాగా, ఈసారి 86.9 సెం.మీ. (8% అదనం) కురిసింది.
- ఉత్తరాది రాష్ట్రాల్లో 32% అదనంగా, దక్షిణ, మధ్య భారత రాష్ట్రాల్లో 11% అదనంగా వానలు కురిశాయి. కానీ ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమబెంగాల్, ఒడిశా తదితర తూర్పు రాష్ట్రాల్లో 18% లోటు నమోదైంది.

మాలో ఒకరిపై దాడి చేస్తే.. మా ఇద్దరిపై చేసినట్టే!

» పాక్-సౌదీ మధ్య 'నాటో' తరహా రక్షణ ఒప్పందం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: నాటో దేశాల్లో ఏ దేశంపై అయినా దాడి జరిగితే.. అది తమ కూటమి మొత్తంపై జరిగిన దాడిగా భావించి నాటో దేశాలు దాని రక్షణకు ముందుకు వస్తాయి! 'వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందం' పేరిట.. అదే తరహా ఒప్పందాన్ని ఇప్పుడు పాకిస్థాన్- సౌదీ అరేబియా కుదుర్చుకున్నాయి. దాని ప్రకారం.. ఆ రెండు దేశాల్లో ఏ దేశంపై ఇతర దేశాలు దాడికి దిగినా రెండూ కలిసి యుద్ధం చేస్తాయి. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ రియాద్ పర్యటన సందర్భంగా ఈ ఒప్పందం కుదిరింది. షెహబాజ్ షరీఫ్- సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ దీనిపై సంతకం చేశారు. ఆ సమయంలో పాక్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిఫ్ మునీర్, పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్, రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ అక్కడే ఉన్నారు. అనంతరం ఇరుదేశాలూ కలిసి దీనిపై ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. రెండు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని విస్తరించడం, తమ రెండు దేశాల్లో ఏ దేశంపై దాడి జరిగినా ఉమ్మడిగా ఎదుర్కోవడమే ఈ ఒప్పందం ఉద్దేశమని ఆ ప్రకటనలో పేర్కొన్నాయి. కాగా.. పాక్-సౌదీ నడుమ ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న చర్చల ఫలితమే ఈ ఒప్పందం అని సౌదీ అరేబియాకు చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ ఒప్పందం.. ఇటీవలికాలంలో జరిగిన ఎలాంటి ఘర్షణకూ ప్రతిస్పందన కాదని ఆయన పేర్కొన్నారు.

పరిశీలిస్తున్నాం..

పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య దశాబ్దాలుగా చిరకాలంగా కొనసాగుతున్న రక్షణ సహకారాన్ని అధికారికం చేసే ఒప్పందం ఒకటి పరిశీలనలో ఉందన్న విషయం భారత ప్రభుత్వానికి తెలుసని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఈ ఒప్పందం వల్ల కలిగే వ్యూహాత్మక, భద్రతా ప్రభావాలను భారత ప్రభుత్వం సమీక్షిస్తుందని ఆయన పేర్కొన్నారు. కాగా, పాకిస్థాన్‌తో ఈ ఒప్పందం కుదిరినప్పటికీ.. న్యూఢిల్లీతో తమ సంబంధాలు మరింత బలోపేతమవుతాయని సౌదీ సీనియర్ అధికారి ఒకరు పునరుద్ఘాటించారు. కాగా, ఈ ఒప్పందం నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాని మోదీని తీవ్రంగా విమర్శించింది. "ఇది మన దేశ భద్రతకు ఆందోళన కలిగించే విషయం. ప్రధాని మోదీ విస్తృతంగా ప్రచారం చేసుకునే వ్యక్తిత్వ ఆధారిత దౌత్యానికి ఇది మరో ఎదురుదెబ్బగా కాంగ్రెస్ భావిస్తోంది" అని ఆ పార్టీ సీనియర్ నేత జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో విమర్శించారు.

'ఇస్లామిక్ నాటో'కు బీజం?

ఖతార్ రాజధాని దోహాలోని హమాస్ నేతలే లక్ష్యంగా ఈ నెల 9న ఇజ్రాయెల్ దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడి నేపథ్యంలో.. అరబ్‌లీగ్, ఇస్లామిక్ సహకార సంస్థ (ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కో-ఆపరేషన్(ఓఐసీ)లో సభ్యత్వం ఉన్న దాదాపు 40 దేశాల అధినేతలు సెప్టెంబరు 15న ఖతార్ నిర్వహించిన అత్యవసర సమావేశానికి హాజరయ్యారు. ఆ భేటీలో ఈజిప్టు, ఇరాన్, ఇరాక్, పాకిస్థాన్ తదితర దేశాలు 'అరబ్ నాటో' ఏర్పాటుకు ఒత్తిడి చేశాయి. ఆ భేటీ అయిన కొద్దిరోజులకే పాక్-సౌదీ నడుమ ఈ ఒప్పందం కుదరడం గమనార్హం. ఈ ఒప్పందం వల్ల భారత్‌కు ఎప్పటికైనా ప్రమాదం ఉంటుంది. ఒక్కసారి ఊహించండి.. పాక్ తన కుటిల బుద్ధితో భారత్‌పై నేరుగా దాడికి పాల్పడకుండా ఉగ్రవాదుల ద్వారా దాడులు చేయిస్తే.. దానికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' తరహా చర్య చేపట్టినప్పుడు.. పాక్‌కు మద్దతుగా సౌదీ రంగంలోకి దిగితే? తన వద్ద ఉన్న ఎఫ్-15 యుద్ధవిమానాలు, యూరోఫైటర్ టైఫూన్లను పాక్‌కు సాయంగా పంపిస్తే? ఈ ఒప్పందంవల్ల అలా జరిగేప్రమాదం ఉంది. అయితే.. పాక్ దృష్టి భారత్‌పై ఉండొచ్చుగానీ.. సౌదీ అసలు లక్ష్యం ఇజ్రాయెల్ అని రక్షణరంగ విశ్లేషకులు కొందరు అభిప్రాయపడుతున్నారు.

లోకం తీరు



'డ్రగ్స్' అడ్డా భారత్

(మొదటిపేజీ తరువాయి)

అడ్డుకోలేకపోతున్నాయంటూ అఫ్ఘానిస్థాన్, బొలీవియా, మయన్మార్, కొలంబియా, వెనెజువెలాలపై ఆయన ధ్వజమెత్తారు. పాకిస్థాన్ పేరు కూడా ప్రస్తావించిన ఆయన ఈ జాబితాలో మొత్తం 23 దేశాలు ఉన్నాయన్నారు. అమెరికాలోకి అక్రమంగా వస్తున్న డ్రగ్స్‌ను తయారుచేస్తున్న ప్రధాన కేంద్రాలుగాను లేక రవాణా స్థావరాలుగాను ఈ దేశాలు పనిచేస్తున్నాయని ఆయన విమర్శించారు. డ్రగ్స్‌ను తయారుచేస్తున్న సంస్థలతోపాటు, వాటి అక్రమ రవాణాకు ఈ సంస్థలు వాడుకుంటున్న దేశాలూ ఇందుకు బాధ్యత వహించాల్సిందేనని స్పష్టం చేశారు. "23 దేశాలను జాబితాలో పెట్టడంలో భౌగోళిక, ఆర్థిక, వాణిజ్య కారణాలను పరిగణనలోకి తీసుకున్నాం. ఇందులో ఏదో ఒక కారణం వల్ల డ్రగ్స్ తయారీకి, అందుకు అవసరమైన రసాయనాల సేకరణకు, ఉత్పత్తిచేసిన డ్రగ్స్ అక్రమ రవాణాకు ఈ దేశాలు స్థావరాలుగా మారాయి" అంటూ అమెరికా విదేశాంగ శాఖ వర్గాలను ఉటంకిస్తూ ఓ ఇంగ్లిష్ పత్రిక కథనం ప్రచురించింది.

భారతీయ వ్యాపారులపై అమెరికా వేటు

సింథటిక్ డ్రగ్ ఫెంటానిల్‌ను తయారీచేసి అమెరికాకు అక్రమంగా రవాణాచేసిన వ్యవహారంలో భారతీయ కార్పొరేట్లు, వ్యాపారులపై ఆ దేశం వేటు వేసింది. వారికి, వారి కుటుంబాలకు వీసాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. భవిష్యత్తులోనూ అమెరికాలోకి వారి ప్రవేశాలను నిరోధిస్తామని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది. సింథటిక్ డ్రగ్స్ నుంచి అమెరికాను రక్షించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. దీనిపై ఇప్పటి వరకు భారత్ స్పందించలేదు. అయితే, ఏదో కారణం చూపించి భారతీయులకు వీసాలను నియంత్రించడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. అక్రమ వలసదారులకు సహకరిస్తున్నారంటూ ఈ ఏడాది మేలో పలు ట్రావెల్ ఏజెన్సీల ఓనర్లు, నిర్వాహకుల వీసాలపై అమెరికా నియంత్రణ విధించింది.

మోదీతో మంచి సంబంధాలున్నాయ్

» నేను ఇండియాకు చాలా దగ్గర: ట్రంప్

వాషింగ్టన్, సెప్టెంబరు 18: భారత ప్రధాని నరేంద్ర మోదీతో తనకు స్నేహ సంబంధాలు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. బుధవారం మోదీకి ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు చెప్పగా, గురువారం సామాజిక మాధ్యమాల్లో మరో పోస్టు పెట్టారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పినందుకు ట్రంప్‌నకు కృతజ్ఞతలు చెబుతూ మోదీ పోస్టు పెట్టారు. దానిపై స్పందించిన ట్రంప్... వాషింగ్టన్, ఢిల్లీల మధ్య చాలా మంచి సంబంధాలు ఉన్నాయని, మోదీతో తనకు వ్యక్తిగత సాన్నిహిత్యం ఉందని తెలిపారు. "నేను ఇండియాకు చాలా దగ్గర. భారత ప్రధాన మంత్రికి కూడా చాలా దగ్గర. నిన్నే ఆయనతో మాట్లాడా. పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పా. మా మధ్య చాలా మంచి సంబంధాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య వాణిజ్యపర ఘర్షణలు నెలకొన్న నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

భారత్.. సంపన్నుల ఫ్యాక్టరీ

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబాలు 0.17 శాతంగా (4,58,000) ఉండేవి. ఇప్పుడు ఆ సంఖ్య 0.31 శాతానికి (8,71,000) ఎగబాకింది. సంపన్నుల రాజధానిగా ముంబై తన ఖ్యాతిని నిలబెట్టుకుంది. మొత్తం మహారాష్ట్రలో 1.78 లక్షల కుటుంబాలు మిలియనీర్లు కాగా, ఒక్క ముంబైలోనే 1.42 లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఇక ఢిల్లీలో 79,800, తమిళనాడులో 72,600, కర్ణాటకలో 68,800, గుజరాత్‌లో 68,300 కుటుంబాలు భోగభాగ్యాలతో తులతూగుతున్నాయి. మిలియనీర్లు ఎక్కువగా ఉన్న టాప్ 10 రాష్ట్రాల్లోనే మొత్తం 79 శాతం మంది ఈ ఐశ్వర్యవంతులు నివసిస్తున్నారు. ఇక నగరాల్లో ముంబై, ఢిల్లీ, బెంగళూరు ఆధిపత్యం కొనసాగిస్తున్నాయి. అహ్మదాబాద్, హైదరాబాద్, పుణె వంటి నగరాలు కూడా వాటితో పోటీ పడుతున్నాయి. అయితే దేశంలో మిలియనీర్ల సంఖ్య జోరుగా పెరుగుతుండగా, బిలియనీర్ల సంఖ్య పెరుగుదల మాత్రం నత్తనడకన కొనసాగుతోంది. 2017-25 మధ్య మిలియనీర్ కుటుంబాలు 445% పెరిగాయి. కానీ రూ.100 కోట్లు పైబడి సంపద ఉన్న బిలియనీర్లు కేవలం 5%మాత్రమే పెరిగారు. దేశంలో విస్తృతంగా సంపదపెరిగి మిలియనీర్ల సంఖ్య దూసుకెళుతున్నా బిలియనీర్ల క్లబ్ మాత్రం ప్రత్యేకతను కొనసాగిస్తోందని నివేదిక అభిప్రాయపడింది.

సంపన్నులు ఏం కొంటున్నారు..

- 150 మంది మిలియనీర్ల కుటుంబాలను పరిశీలించి వారి పెట్టుబడులు, కొనుగోళ్లపై మెర్సిడెజ్ బెంజ్ హురూన్ లగ్జరీ కన్స్యూమర్ సర్వే 2025 పలు ఆసక్తికర విషయాలు వెల్లడించింది.
- వారి పెట్టుబడుల్లో స్టాక్ మార్కెట్, రియల్ ఎస్టేట్, బంగారం తొలి స్థానాల్లో ఉన్నాయి.
- ప్రైవేట్ బ్యాంకుల్లో హెచ్‌డీఎఫ్‌సీ, అంతర్జాతీయ బ్యాంకుల్లో సిటీబ్యాంకుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.
- వాచ్‌ల్లో రోలెక్స్ బంగారం షాపుల్లో తనిష్క్, హోటళ్లలో తాజ్, వినియోగ వస్తువుల్లో గూచీ, లూయి విట్టన్‌లకు ఓటేస్తున్నారు.

ఓట్ల దొంగలకు సీఈసీ రక్ష!

(మొదటిపేజీ తరువాయి)



వినాశకులను కాపాడుతున్నారని ఆరోపించారు. కర్ణాటకలోని ఆళంద అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ ఓటర్లను టార్గెట్ చేశారని.. తమ పార్టీ అనుకూల పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్లను ఆన్‌లైన్లో తొలగించారని చెప్పారు. రాహుల్ గురువారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. 2023లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆళంద నియోజకవర్గంలో తమ పార్టీ ఓటర్లను తొలగించే ప్రయత్నాలు జరిగాయని తెలిపారు. దీనిపై దర్యాప్తు కోసం ఆ రాష్ట్ర సీఐడీ కోరిన సమాచారం వారంలోగా ఇవ్వాలని అల్టిమేటం ఇచ్చా రు. లేకపోతే రాజ్యాంగం హత్యలో సీఈసీ కూడా భాగస్వామి అయినట్లేనని స్పష్టంచేశారు. కొందరు దేశవ్యాప్తంగా ఓ పద్ధతి ప్రకారం లక్షల కొద్దీ ఓటర్లను తొలగిస్తున్నారని తెలిపారు. ఓ సాఫ్ట్‌వేర్ ద్వారా ఇది చేస్తున్నారని.. దీనిపై కర్ణాటకలో దర్యాప్తు జరుగుతోందన్నారు. 'ఎక్కడి నుంచి ఓట్ల తొలగింపు దరఖాస్తులు వచ్చాయో డెస్టినేషన్ ఐపీ, ఓటీపీ వివరాలను చెప్పాలని కర్ణాటక సీఐడీ 18 నెలల్లో ఈసీకి 18 లేఖలు రాసింది. కానీ ఈ ఆపరేషన్‌తో అంతా బయటపడుతుందని కమిషన్ ఆ వివరాలు ఇవ్వడం లేదు. ఇదంతా ఎవరు చేస్తున్నారో దానికి తెలుసు. అలాగే ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి మహారాష్ట్ర రాజురా అసెంబ్లీ స్థానంలో అదనపు ఓట్లు నమోదుచేశారు. ఆ వ్యవస్థనే అంతటా ఉపయోగిస్తున్నారు. కర్ణాటక, మహారాష్ట్రల్లో వాడుతున్నారు. హరియాణా, ఉత్తర ప్రదేశ్‌లో వాడారు. అందుకు మా వద్ద ఆధారాలున్నాయి. దేశంలో ప్రతి యువకుడూ ఇది తెలుసుకోవాలి. మీ భవిష్యత్‌తో వారేం చేస్తున్నారో తెలియాలి. ఓట్ల చోరీపై మా పరిశోధన, ప్రజెంటేషన్లు ఇవ్వడానికి రెండు, మూడు నెలలు పడుతుంది. ఇవన్నీ పూర్తయ్యాక ఒక రాష్ట్రం తర్వాత మరొక రాష్ట్రాన్ని, లోక్‌సభ ఎన్నికలను తస్కరించారని నిస్సందేహంగా మీకే అర్థమవుతుంది. సత్యాన్ని అన్వేషించి ప్రజలకు చూపించడమే నా కర్తవ్యం' అని వివరించారు.

పథకం ప్రకారమే ఆపరేషన్

ఆళందలో కాంగ్రెస్ పటిష్ఠంగా ఉన్న పది పోలింగ్ కేంద్రాల్లో ఓట్ల తొలగింపులు జరిగాయని రాహుల్ చెప్పారు. 2018లో ఈ పదింటిలో 8 చోట్ల కాంగ్రెస్ గెలిచింది. ఓట్లు తీసేయడం కాకతాళీయం కాదు. పథకం ప్రకారం జరిగిన ఆపరేషన్. ఈరోజు నేను చెబుతున్న వివరాలు.. ఎన్నికలను ఎలా రిగ్గింగ్ చేస్తున్నారో ఈ దేశ యువతకు చాటే క్రమంలో మరో మైలురాయి. జ్ఞానేశ్‌కుమార్ గురించి తీవ్రమైన అంశం చెబుతున్నాను. సీఈసీ ఓట్ల దొంగలను కాపాడుతున్నారు. నేను ప్రతిపక్ష నేతను. ఆషామాషీగా చెప్పడం లేదు. వంద శాతం రుజువులు లేకుండా ఏదీ చెప్పను. జ్ఞానేశ్‌కుమార్.. మీ విధి మీరు విధించాలన్నదే మా డిమాండ్. మీరు భారత సీఈసీ. కర్ణాటక సీఐడీకి సాక్ష్యాధారాలు అందించాలి' అని డిమాండ్ చేశారు.

ఈసీ వర్గాల నుంచి మాకు సమాచారం..

ఎన్నికల కమిషన్ అంతర్గత వర్గాల నుంచి కూడా తమకు సమాచారం, సహకారం అందుతోందని రాహుల్ చెప్పారు. అయితే ఈ నిజాలు తాను చెప్పిన హైడ్రోజన్ బాంబు కాదని.. ఆ బాంబు లాంటి వివరాలను త్వరలోనే బయటపెడతానని తెలిపారు. దీనివెనుక మాస్టర్‌మైండ్ ఎవరని విలేకరులు ప్రశ్నించగా.. అది కూడా ప్రజల ముందుంచుతానని.. ఈ వాస్తవాల హైడ్రోజన్ బాంబు బహిర్గతం చేశాక సర్వం వెల్లడవుతుందని రాహుల్ బదులిచ్చారు.

ఆన్‌లైన్లో ఓటు తొలగించలేరు: ఈసీ

న్యూఢిల్లీ: ఆన్‌లైన్లో ఓట్లు తొలగించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలను ఈసీ తోసిపుచ్చింది. ఎవరూ ఇలా తొలగించలేరని, జ్ఞానేశ్ కుమార్‌పై ఆయన వ్యాఖ్యలు అవాస్తవం.. నిరాధారమని తేల్చిచెప్పింది. వాదన వినిపించుకునే అవకాశం బాధిత వ్యక్తి ఇవ్వకుండా.. ఓటు తొలగించే అవకాశం ఉండదని పేర్కొంది.

అలజడి సృష్టికే ఆరోపణలు: బీజేపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై రాహుల్‌గాంధీ ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. చొరబాటుదారులే ఆయనకు పెద్ద పీట వేస్తారని.. దేశంలో అలజడి, గందరగోళం సృష్టించాలని చూస్తున్నారని ఆ పార్టీ నేత, కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ ధ్వజమెత్తారు. 'రాజ్యాంగబద్ధ సంస్థ ఎన్నికల కమిషన్‌పై ఆయన పదే పదే చేస్తున్న ఆరోపణలు.. ప్రజాస్వామ్యంపై ఆయనకు విశ్వాసం లేదని చాటుతున్నాయి. నేపాల్, బంగ్లాదేశ్‌లలో మాదిరిగా భారత్‌లోనూ అలజడి, సంక్షోభం సృష్టించాలని ప్రయత్నిస్తున్నారు. చొరబాటుదార్లకే అగ్ర స్థానమనే రాజకీయాలే ఆయన ఏకైక ఎజెండా' అని దుయ్యబట్టారు. ఆళందలో ఓట్ల తొలగింపునకు దరఖాస్తులు వచ్చిన ఐపీ అడ్రస్‌లు, మొబైల్ ఫోన్ల సమాచారాన్ని కమిషన్ సీఐడీకి అందజేసిందని.. కానీ పోలీసులు చర్యలూ తీసుకోలేదన్నారు.

ఆరోగ్యశ్రీలో 'కార్పొరేట్'కు ఇచ్చే నిధులతో

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయొచ్చు

» బిల్లులు ఇవ్వడం లేదన్న ప్రైవేటు ఆస్పత్రుల వాదన సమంజసం కాదు

» కవిత రాజీనామాపై నిర్ణయం తీసుకోలేదు: గుత్తా సుఖేందర్ రెడ్డి



నల్లగొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆరోగ్యశ్రీ పథకం కింద కార్పొరేట్ ఆస్పత్రులకు ఇచ్చే నిధులతో ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేస్తే రాష్ట్ర ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. ఆరోగ్యశ్రీ కింద వెచ్చించే నిధులతో ఆస్పత్రుల్లో వైద్యులకు వేతనాలు పెంచాలని, ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. గురువారం నల్లగొండలో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం 27 నెలల్లో రూ.1770 కోట్లు చెల్లించిందని, అయినప్పటికీ బిల్లులు ఇవ్వడం లేదని ప్రైవేట్ ఆస్పత్రులు పేర్కొనడం సమంజసం కాదన్నారు. జిల్లా కేంద్రాల్లోని అన్ని ఆస్పత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల విషయంలో ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రభుత్వాన్ని ఒత్తిడికి లోనుచేశాయన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయడంద్వారా రీయింబర్స్‌మెంట్ ఇబ్బందులను తగ్గించవచ్చని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పిస్తున్నా పిల్లలు ఉండడం లేదన్నారు. తన స్వగ్రామం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్లలోని ఉన్నత పాఠశాలలో 66 మంది, అక్కడున్న హాస్టల్‌లో 33 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాజీనామా ఆమోదంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ఆమె వ్యక్తిగతంగానూ రాజీనామా ఆమోదించాలని కోరారని, కానీ భావోద్వేగ సందర్భాల్లో రాసినలేఖగా భావించి మరోసారి ఆలోచించుకోవాలని సూచించినట్లు తెలిపారు.

అక్టోబర్‌లో బీసీ రాజ్యాధికార సమితి ప్లీనరీ

» వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ నాయకులను పోటీకి దించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడానికి అక్టోబర్‌లో పార్టీ సర్వసభ్య సమావేశం, ప్లీనరీలను నిర్వహించనున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ తెలిపారు. రెండేళ్లుగా రాష్ట్రంలోని 33 జిల్లాల్లో బీసీ రాజ్యాధికార సమితి విస్తృత స్థాయిలో సమావేశాలు, సభలు ఏర్పాటుచేసి, బీసీల్లో రాజ్యాధికార భావనను బలంగా రగిలించిందని అన్నారు. దశాబ్దం పాటు సాగిన బీసీ రాజ్యాధికార సమితి పోరాటాలు జాతీయ పార్టీల విధానాలపై గణనీయమైన మార్పులు తెచ్చాయని, సామాజిక న్యాయం అనివార్యమని అన్ని పార్టీలు గుర్తించడంలో తాము ప్రముఖ పాత్ర పోషించామని తెలిపారు.



కర్నూలు మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న ఉల్లి

ఉల్లి కిలో 50 పైసలు!

(మొదటి పేజీ తరువాయి)

క్వింటా రూ.400 పలికింది. ఎక్కువ శాతం రూ.100 లోపే కొనుగోలు చేశారు. బహిరంగ వేలంలో పాల్గొన్న వ్యాపారులు ముందే కుమ్మక్కై ఇలా అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి 6,057 టన్నులు (60,570 క్వింటాళ్లు) ప్రభుత్వం సేకరించింది. అందులో 3,707 టన్నులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని రైతు బజార్లకు సరఫరా చేయగా.. మరో 2,350 టన్నుల ఉల్లి బస్తాలు కర్నూలు మార్కెట్‌లోనే గుట్టలుగా పేరుకుపోయాయి. దీంతో రైతులు అమ్మకానికి తెచ్చిన ఉల్లిని కనీసం టెండరుకు ఉంచేందుకు స్థలం కూడా లేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లిగడ్డలకు కర్నూలు మార్కెట్ యార్డు స్పెషల్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో క్వింటా కనిష్ఠంగా రూ.50 నుంచి గరిష్ఠంగా రూ.400వరకూ ధర పలికింది. ఎక్కువశాతం క్వింటా రూ.100 పలికంది. ఇలా మొత్తం 492 టన్నులు (4,920 క్వింటాళ్లు) మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేశారు. వ్యాపారులు వ్యూహం ప్రకారమే వేలంలో పోటీ పడకపోవడంతో వచ్చినకాడికి ఇచ్చేయాల్సి వచ్చింది. దీంతో మార్క్‌ఫెడ్‌కు కిలోకు రూపాయి కూడా రాలేదు. కాగా, ఇదే ఉల్లిని వ్యాపారులు బయట కిలో రూ.10-20కు పైగా విక్రయిస్తున్నారు. కర్నూలులో బహిరంగ మార్కెట్‌లో 4కిలోలు రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. కాగా, ప్రభుత్వం సేకరించిన 200 టన్నులు ఉల్లి ప్లాట్‌ఫాం, గోదాముల్లోనే కుళ్లిపోతోందని అధికారులు తెలిపారు.

మరో రెండు మీటర్లు!

(మొదటి పేజీ తరువాయి)

రంగారెడ్డి జిల్లాలో 2.47 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే పనులను పునః ప్రారంభించనుంది. ఈ రెండు జిల్లాల ఆయకట్టు ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టులో ఉండేది. ప్రాజెక్టుల రీ-ఇంజనీరింగ్‌లో భాగంగా గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజె క్టును చేపట్టడంతో తుమ్మిడిహెట్టి బ్యారేజీతోపాటు ఉమ్మడి ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల ఆయకట్టు మాయమైంది. కాళేశ్వరం బ్యారేజీలు విఫలమవడంతో రేవంత్ సర్కారు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పునరుద్ధరించాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. అక్కడ 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మించాలని కసరత్తు చేస్తోంది. దీనిపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పలు దఫాలుగా అధికారులతో సమీక్ష చేపట్టారు. బ్యారేజీ నిర్మాణం, ముంపు, నీటి లభ్యత తదితరాలపై చర్చించారు. తాజాగా ఈ ప్రాజెక్టు పునరుద్ధరణలో భాగంగా ప్రాణహిత-చేవెళ్ల డీపీఆర్‌ను సవరించాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. ఆ మేరకు ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)కు అధికారులు తుది రూపు ఇస్తున్నారు. అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కలవనున్నారు. నిజానికి, 148 మీటర్ల ఎత్తుతోనే బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర గతంలో సమ్మతి తెలిపింది. కానీ, బ్యారేజీని 150 మీటర్ల ఎత్తుతో కట్టాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆ ప్రకారమే బ్యారేజీ కట్టడానికి వీలుగా మహారాష్ట్ర సర్కారును ఒప్పించేందుకు అవసరమైన కసరత్తును కూడా ముమ్మరం చేసింది. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు 2013 భూసేకరణ చట్టం లేదా మెరుగైన ప్రక్రియ ద్వారా పరిహారం అందించాలని భావిస్తోంది. అనంతరం నెలాఖరులోపు అధికారులు మహారాష్ట్ర పర్యటనకు వెళ్లనున్నారు.



వైఎస్సార్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం (ఫైల్)

ఆగిన పనులన్నీ పునరుద్ధరణ

ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో తలగా భావించే తుమ్మిడిహెట్టి బ్యారేజీ, మెడగా భావించే ఆదిలాబాద్‌లోని 2 లక్షల ఎకరాలు, తోకగా భావించే రంగారెడ్డి జిల్లాలోని 2.47 లక్షల ఎకరాలను గత ప్రభుత్వం పక్కనపెట్టిన విషయం తెలిసిందే. దాంతో లింక్-1లో భాగమైన ప్యాకేజీ-1 నుంచి ప్యాకేజీ-5 దాకా ఆగిపోయిన పనులను పునరుద్ధరించాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది. ఇందులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని నిర్మిస్తుంది. ఆదిలాబాద్ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు నీరందించడానికి వీలుగా డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలను పూర్తి చేస్తుంది. రంగారెడ్డి జిల్లాలోని పరిగి, చేవెళ్ల, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లోని 2.47 లక్షల ఎకరాలకు నీరందించే పనులను తిరిగి ప్రారంభించనుంది. వాస్తవానికి, ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలోనూ, కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోనూ ఎల్లంపల్లి ప్రాజెక్టు అనేది కామన్ పాయింట్. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డలో నీటిని నిల్వ చేసి అన్నారంలోకి, అక్కడి నుంచి సుందిళ్లలోకి, చివరికి ఎల్లంపల్లికి నీటిని పంపింగ్ చేస్తారు. దిగువన 100 కి లో మీటర్ల నుంచి నీటిని పంపింగ్ చేసుకుంటూ ఎల్లంపల్లిలో వేయడం కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధాన ఉద్దేశం. అదే ప్రాణహిత-చేవెళ్ల పథకంలో అయితే తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి.. 116 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్లంపల్లికి నీటిని తరలించాలనేది ప్రతిపాదన. ఇక్కడ 150 మీటర్లతో బ్యారేజీ కడితే 71.5 కిలోమీటర్ల దాకా గ్రావిటీ కెనాల్ ద్వారా నీటిని తరలించవచ్చు. పంపింగ్‌కు ఒక్క పైసా కూడా ఖర్చు కాదు. 71.5 కిలోమీటర్ల వద్ద ఉన్న మైలారం గ్రామం వద్ద చిన్న పంప్‌హౌస్ కడితే.. నేరుగా ఎల్లంపల్లిలో నీటిని వేయవచ్చు. 75 శాతం డిపెండబులిటీ వద్ద 165 టీఎంసీల జలాలను ప్రాణహిత-చేవెళ్లలో తరలించాలనేది గత ప్రతిపాదన. తాజాగా 80 టీఎంసీలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీని 2.75 టీఎంసీల సామర్థ్యంతో కట్టనున్నారు. ఇక ఎల్లంపల్లి నుంచి కొండపోచమ్మసాగర్ దాకా పనులన్నీ పూర్తయ్యాయి. అక్కడి నుంచి చేవెళ్ల దాకా అలైన్‌మెంట్‌ను ఖరారు చేయాల్సి ఉంది.

బ్యారేజీ పనులు త్వరగా చేపట్టాలి



తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ పనులను త్వరగా చేపట్టాలి. నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత బీడు భూములు సస్యశ్యామలమవుతాయి. ప్రాజెక్టు నిర్మాణంతో రెండు పంటలు వస్తే రైతులు ఆర్థికంగా బలపడతారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మాదిరిగా కాకుండా ఈసారైనా ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నిర్మించి రైతాంగాన్ని ఆదుకోవాలి.

\- చరణ్‌దాస్, తుమ్మిడిహెట్టి



మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం వద్ద బుధవారం రాత్రి క్యూలైన్లలో నిద్రిస్తున్న రైతులు

పంపిణీ కేంద్రాల వద్దే రైతుల నిద్ర

» యూరియా కోసం తప్పని తిప్పలు

మహబూబ్‌నగర్, హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కోసం రైతుల కష్టాలు తీరడం లేదు. రెండు నెలలుగా యాతన పడుతూనే ఉన్నారు. పంపిణీ కేంద్రాల వద్ద పగలంతా క్యూలైన్లలో నిలబడి అలసిపోయి రాత్రి అదే క్యూలైన్లలో నిద్రిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన రైతులు బుధవారం అర్ధరాత్రి క్యూలైన్లలోనే నిద్రించారు. తిరిగి తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో నిల్చున్నా యూరియా దొరకని పరిస్థితి ఏర్పడింది. యూరియా లభించకపోవడంతో మహబూబ్‌నగర్ మండలం మన్యంకొండ వద్ద ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి ధర్నా చేపట్టారు. పోలీసులు రైతులకు నచ్చజెప్పి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. జడ్చర్లలో మార్కెట్ యార్డు వద్ద యూరియా సరఫరా చేయాలంటూ రైతులు రాస్తారోకో నిర్వహించారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట, అమరచింత మండలాల రైతులు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. ఉదయం ప్రాథమిక సహకార కేంద్రాల వద్దకు చేరుకున్న వారికి అధికారులు టోకెన్లు ఇవ్వడం లేదని రైతులు మండిపడ్డారు.

రైతుల కష్టం చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది: హరీశ్‌రావు

కాంగ్రెస్ పాలనా వైఫల్యం వల్ల తెలంగాణ రైతులు పడుతున్న కష్టం చూస్తుంటే.. బాధతో కడుపు తరుక్కుపోతోందని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. జోరువానలో బారులు తీరాలే.. బస్తా యూరియా కోసం బోరున ఏడవాలే.. అన్నట్లుగా ఈ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అన్నదాతలకు కన్నీరే మిగిల్చుతోందని హరీశ్‌రావు గురువారం ఎక్స్‌లో వెల్లడించారు.

ఓ కార్పొరేట్ కాలేజీ విద్యార్థులపై సిబ్బంది దాష్టీకం

» విద్యార్థి చెంపపై కొట్టడంతో దవడకు గాయం

చాదర్‌ఘాట్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నారంలో ఓ కార్పొరేట్ జూనియర్ కాలేజీలో ఇద్దరు విద్యార్థులపై కాలేజీ సిబ్బంది ఒకరు చేయి చేసుకున్న ఘటనలో ఓ విద్యార్థి దవడకు గాయమైంది. కాలేజీలో ఇద్దరు విద్యార్థుల మధ్య తలెత్తిన ఘర్షణను నివారించే క్రమంలో కాలేజీ ఫ్లోర్ ఇన్‌చార్జి వారిపై చేయి చేసుకున్నాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మలక్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ఈ నెల 15వ తేదీన కాలేజీలో ఇంటర్ చదువుతున్న ఇద్దరు సహచర విద్యార్థులకు గొడవ జరిగింది. ఈ క్రమంలో ఫ్లోర్ ఇన్‌చార్జి జోక్యం చేసుకుని విద్యార్థి చెంపపై గట్టిగా కొట్టడంతో దవడకు గాయమయింది. బాధితుని తల్లిదండ్రులు విషయాన్ని కాలేజీ యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. వారు స్పందించక పోవడంతో గురువారం కాలేజీకి చేరుకుని ఆందోళనకు దిగారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఐటీబీపీలో బతుకమ్మ ఉత్సవాలు

» ఏర్పాట్లు చేయాలని అధికారులకు కేంద్ర మంత్రి సంజయ్ ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇండో- టిబెటన్ బోర్డర్ పోలీసు (ఐటీబీపీ)లో బతుకమ్మ ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని అధికారులను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదేశించారు. హరియాణలోని ఐటీబీపీ ప్రాథమిక శిక్షణా కేంద్రంలో గురువారం 9 నివాస భవన సముదాయాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. దీంతో ఈ నెల 29,30 తేదీల్లో బతుకమ్మ సంబురాలు జరుపుకునేందుకు అనుమతివ్వాలని మంత్రి బండి సంజయ్‌ను తెలంగాణ మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులు కోరారు. దీనిపై మంత్రి సంజయ్ స్పందిస్తూ.. బతుకమ్మ పర్వదిన గొప్పతనం, విశిష్టతను ఐటీబీపీ అధికారులకు వివరించారు. కనుక బతుకమ్మ సంబురాలను సంప్రదాయ బద్ధంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శిక్షణా కేంద్రంలో ట్రైనింగ్ పొందుతున్న వివిధ రాష్ట్రాల అభ్యర్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. తమకు మొబైల్ టాయిలెట్ల అవసరం ఉందని మహిళా అభ్యర్థులు కోరడమే.. వాటిని తక్షణం ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి బండి సంజయ్ ఆదేశించారు. ఇక ఐటీబీపీ జవాన్లకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నిఘా పరికరాలను అందించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీబీపీ ఐజీ అశోక్ కుమార్ నేగి తదితరులు పాల్గొన్నారు.

కట్టెల మంటల వంటలు!

పొగచూరుతున్న మధ్యాహ్నభోజన నిర్వాహకుల ఆరోగ్యం

» ఏళ్లుగా ఆరుబయట కట్టెల పొయ్యి మీదే వంటలు

» కళ్లమంటలు, దగ్గుతో ఇబ్బందులు.. తరగతి గదుల్లోకీ పొగ

» ఆగస్టు 15 వరకు గ్యాస్ కనెక్షన్ల మంజూరుకు కేంద్రం హామీ

» ఇప్పటివరకూ ఆ ఊసే లేదు.. 3నెలల బిల్లులూ పెండింగ్



పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట పాఠశాలలో ఆరు బయట మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న మహిళలు

పెద్దపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో లంచ్ బెల్ మోగేసరికి.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం సిద్ధం చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీకావు. కట్టెల పొయ్యి రాజేసి.. దట్టంగా కమ్మేసే పొగ మధ్య ఆపసోపాలు పడుతూ వంటలు సిద్ధం చేస్తున్నారు. ఇలా మధ్యాహ్న భోజన నిర్వాహకులు కట్టెల పొయ్యి మీద వండుతూ ఏళ్లుగా కళ్లమంటలు, దగ్గు వంటి అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల ఈ పొగ తరగతి గదుల్లోకి వెళుతుండటంతో విద్యార్థులు కూడా సమస్యలు ఎదుర్కొంటున్నారు. తమకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసి.. నెలనెలా ఉచిత సిలిండర్లు సరఫరా చేయాలని చాన్నాళ్లుగా వారు కోరుతున్నారు. అయితే ఇటీవల కేంద్రం నుంచి వెలువడిన ఓ ప్రకటన వారికి ఊరట నిచ్చినా.. ఆ తర్వాత ఉసూరుమనిపించింది. ఆగస్టు 15 వరకు మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసి.. గ్యాస్ పొయ్యిలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే దీనికి సంబంధించి బడ్జెట్‌ను మాత్రం విడుదల చేయకపోవడంతో ఆ హామీ, హామీ వరకే పరిమితమైంది. ఇక.. రాష్ట్రంలో తాము అధికారంలోకొస్తే మధ్యాహ్న భోజన పథకానికి ఉచితంగా గ్యాస్ సరఫరా చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకొచ్చి 22నెలలు అవుతున్నా ఇప్పటివరకు ఆ హామీ నెరవేర్చలేదు. రాష్ట్రంలో 18,254 ప్రాథమిక, 3,142 ప్రాథమికోన్నత, 4,705 ఉన్నత.. ఇలా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 26,101 బడులున్నాయి. ఈ అన్ని బడుల్లో కూడా మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. దీనికి సంబంధించి 8వ తరగతి విద్యార్థుల భోజనానికి సంబంధించి నిధులను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు వరుసగా 60శాతం, 40 శాతం చొప్పున నిధులు భరిస్తున్నాయి. 9, 10 తరగతుల విద్యార్థులకు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వమే అమలు చేస్తోంది. రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయం సహాయక మహిళా సంఘాలకు చెందిన మహిళలు నిర్వహిస్తున్నారు. ఒక బడిలో ఒకరు నుంచి ముగ్గురు దాకా విధుల్లో ఉంటారు. వీరికి రూ.3వేల చొప్పున గౌరవ వేతనం ఇస్తున్నారు. కూరగాయలు, ఇతరత్రా సరుకుల కోసం ఒకటో క్లాసు నుంచి 5వ తరగతి విద్యార్థులకు రోజుకు రూ.6-19 చొప్పున, 6,7,8 తరగతుల విద్యార్థులకు రూ.9-29 చొప్పున, 9,10 తరగతి విద్యార్థులకు రూ.10-67 చొప్పున చెల్లిస్తున్నారు. పిల్లలకు భోజనంలో వారానికి మూడుసార్లు ఉడకబెట్టిన కోడిగుడ్లు పెట్టాల్సి ఉంటుంది. గుడ్ల కోసం రూ.6 చొప్పున ఇస్తున్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజనం పెట్టేందుకు ఇంత చేస్తున్న ప్రభుత్వాలు.. నిర్వాహకులను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. వంట ఖర్చునంతా నిర్వాహకులే భరిస్తున్నారు. వారికి గ్యాస్ కనెక్షన్లు, గ్యాస్ పొయ్యిలు మంజూరు చేయడం లేదు. సిలిండర్లకు రూ.925 చొప్పున ఖర్చు అవుతోందని.. సొంత ఖర్చుతో గ్యాస్ పొయ్యి మీద వండుతుంటే తమకు ఏం మిగులుతుంది? అని నిర్వాహకులు ఆవేదనగా ప్రశ్నిస్తున్నారు. ఒకటో క్లాసు నుంచి 8వ తరగతి విద్యార్థుల భోజనానికి సంబంధించి రెండు నెలలు, 9, 10 తరగతుల విద్యార్థులకు సంబంధించి 3 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. కోడిగుడ్ల బిల్లులు కూడా సక్రమంగా రావడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరవై ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్న తమకు నెలకు రూ.10 వేల గౌరవవేతనం ఇవ్వాలని కోరుతున్నారు.

బాచుపల్లి జీరో..!

» వేలంలో ఒక్క ప్లాట్ కూడా అమ్ముడుపోలే

» గజం రూ.70 వేలుగా నిర్ణయించిన హెచ్ఎండీఏ

» గతం కంటే భారీ ధర ఉండటంతో స్పందన కరువు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగర అభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్లాట్లు వేలం వేస్తోందంటే జనం భారీగా పోటీ పడతారు. స్థలాలు నిమిషాల్లోనే అమ్ముడై.. సంస్థకు రూ.కోట్లు సమకూరుతాయి. కానీ ఈసారి అలా జరగలేదు. రెండున్నరేళ్ల తర్వాత బుధవారం తుర్కయాంజల్‌లో ప్లాట్ల వేలం చేపట్టగా.. రెండే అమ్ముడుపోయాయి. గురువారం బాచుపల్లి లేఔట్‌లో ప్లాట్ల వేలం జరగ్గా.. ఒక్కటి కూడా అమ్ముడుపోలేదు. వంద అడుగులతో విస్తరించిన ఆరు లేన్ల మియాపూర్-గండిమైసమ్మ ప్రధాన రహదారికి సమీపంలో ఉన్నా.. ప్లాట్ల కొనుగోలుకు ఎవరూ ఆసక్తి కనబరచలేదు. గజం కనీస ధర రూ.70వేలుగా నిర్ణయించడం, సరైన ప్రచారం, అవగాహన కల్పించకపోవడమే దీనికి ప్రధాన కారణాలని తెలుస్తోంది. రెండున్నరేళ్ల తర్వాత హెచ్ఎండీఏ ప్లాట్లను వేలం వేస్తుండటంతో భారీ స్పందన ఉంటుందని ఊహించారు. హెచ్ఎండీఏ ప్లాట్లు టైటిల్ క్లియర్, వివాదరహితంగా ఉండటంతో డిమాండ్ ఉంటుందని భావించారు. అయితే తుర్కయాంజల్ లేఔట్‌లోని 12 ప్లాట్లకు బుధవారం వేలం వేస్తే కేవలం రెండే అమ్ముడుపోయాయి. అందులో ఒక ప్లాట్ గజం రూ.1.10 లక్షలు పలికింది. అమ్ముడుపోని ప్లాట్లలో అత్యధికంగా ప్లాట్ల సైజ్ సక్రమంగా లేకపోవడం, కనీస ధర గజానికి రూ.65వేలు నిర్ణయించడంతో స్పందన లేదు. మేడ్చల్ జిల్లాలోని బాచుపల్లి లేఔట్‌ను హెచ్ఎండీఏ అభివృద్ధి చేయగా.. రెండున్నరేళ్ల క్రితం వందకు పైగా ప్లాట్లను విక్రయించారు. గురువారం 70 ప్లాట్లకు ఈ-వేలం నిర్వహిస్తే ఒక్క ప్లాట్ కూడా అమ్ముడుపోలేదు. నివాసాల మధ్య ఉన్న లేఔట్‌లోని ప్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోతాయని హెచ్ఎండీఏ అధికారులు గజం కనీస ధరను రూ.70వేలు నిర్ణయిస్తే.. ఒక్కరూ కొనుగోలుకు ముందుకు రాలేదు.

ఇష్టానుసారంగా కనీస ధరల నిర్ణయం..

బాచుపల్లిలో లేఔట్‌ను ప్రకటించిన తర్వాత మూడు విడతలుగా దాదాపు 180 ప్లాట్ల వరకు విక్రయించారు. అప్పట్లో గజం కనీస ధర రూ.25 వేలు మాత్రమే. దాంతో జనం పోటీపడి కొనుగోలు చేశారు. మూడు విడతల్లో బాచుపల్లిలో ప్లాట్లను విక్రయిస్తే అత్యధికంగా గజం రూ.68వేలు, సగటున రూ.59,149 పలికింది. అప్పట్లో పలికిన గజం అత్యధిక ధరను ఆధారం చేసుకొని ఇప్పుడు కనీస ధరను నిర్ణయించడం గమనార్హం. తుర్కయాంజల్‌లో గతంలో గజం కనీస ధర రూ.25వేలు మాత్రమే.. కానీ ప్రస్తుతం రూ.65వేలు నిర్ణయించారు.

ఇందిరమ్మ ఇళ్లకు డబుల్ బిల్లులు!

» సాఫ్ట్‌వేర్ లోపంతో లబ్ధిదారుల ఖాతాల్లో మొదటి విడతగా రెండు సార్లు రూ.1 లక్ష చొప్పున జమ

» డ్రా చేయకుండా ఫ్రీజింగ్ చేసిన అధికారులు

జనగామ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఖాతాలో డబుల్ బిల్లులు జమ అవుతున్నాయి. గృహనిర్మాణ సంస్థ సాఫ్ట్‌వేర్‌లో తలెత్తిన లోపం కారణంగా మొదటి విడతలో కొంతమంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.1 లక్ష చొప్పున రెండుసార్లు జమ అయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మాణాలు ప్రారంభించిన లబ్ధిదారులకు ప్రభుత్వం మొదటి విడత కింద రూ.1 లక్ష చొప్పున అందిస్తుంది. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పలువురు లబ్ధిదారులకు శుక్రవారం మొదటి విడతగా రూ.1 లక్ష చొప్పున విడుదల చేసింది. అయితే సోమవారం కూడా ఆయా లబ్ధిదారుల ఖాతాల్లో మరో రూ.1 లక్ష చొప్పున జమ అయ్యాయి. సాఫ్ట్‌వేర్ మారుతున్నందున ఈ తప్పిదం జరిగిందని, జనగామ జిల్లాలో 20 మందికి, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,300 మందికి పైగా రెండుసార్లు డబ్బులు జమ అయ్యాయని అధికారులు చెబుతున్నారు. కాగా మొదటి విడతకు సంబంధించిన బిల్లులు రెండు సార్లు జమ కావడంతో గృహనిర్మాణ సంస్థ అధికారులు కంగుతిని దిద్దుబాటు చర్యలు ప్రారంభించారు. మొదటగా లబ్ధిదారులు తమ ఖాతాల నుంచి డబ్బులను డ్రా చేయకుండా ఫ్రీజింగ్ చేసినట్లు తెలుస్తోంది. వాటిని తిరిగి ప్రభుత్వ ఖాతాల్లో జమ చేయించాలని అన్ని జిల్లాల హౌసింగ్ పీడీలకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు.

యూటీఎస్ యాప్‌తో అన్ రిజర్వ్‌డ్ టికెట్లు: ఎస్‌సీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): పండుగల సీజన్‌లో క్యూలో నిరీక్షించే అవసరం లేకుండా ప్రయాణికులు యూటీఎస్ యాప్‌తో 'క్యూఆర్ కోడ్'తో స్కాన్ చేసి అన్ రిజర్వ్‌డ్ జనరల్ టికెట్లు పొందొచ్చని దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆయా రైల్వే స్టేషన్లలో ఎంపిక చేసిన సిబ్బంది ధరించిన 'రెట్రో రిఫ్లెక్టివ్' జాకెట్ల వెనుక ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను యూటీఎస్ యాప్‌తో స్కాన్ చేసి జనరల్ టికెట్ కొనుగోలు చేయొచ్చునని పేర్కొంది. నగదు రహిత, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంతోపాటు టికెట్ల కౌంటర్ల వద్ద పెద్ద పెద్ద క్యూల తగ్గింపునకు సికింద్రాబాద్, కాచిగూడ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, తిరుపతి, నాందేడ్ స్టేషన్ల వద్ద ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. మొదట జనరల్ టికెట్ల కొనుగోలు కోసం విధించిన దూర పరిమితులను సడలించారు. రైల్వే స్టేషన్ ప్రాంగణం, రైల్వే ట్రాక్ నుంచి 5 మీటర్ల దూరంలోని ఏ ప్రదేశం నుంచైనా టికెట్లు కొనుగోలు చేసే సౌలభ్యం అందుబాటులో ఉంది. డిజిటల్ ఇండియాలో భాగంగా యాప్ పేపర్ లెస్ నగదు రహిత లావాదేవీలకు ప్రయాణికులు ఆర్-వాలెట్, పేటీఎం, యూపీఐ, ఇంటర్నెట్ బ్యాంకింగ్ తదితర డిజిటల్ మోడ్‌ల ద్వారా టికెట్ల చార్జీలు చెల్లించవచ్చు. ఆర్-వాలెట్ ద్వారా టికెట్ కొనుగోలు చేస్తే 3% బోనస్ క్రెడిట్ అవుతుంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కుదుటపడుతున్న నేపాల్


నేపాల్ త్వరితగతిన గాడినపడటం ఊరటనిస్తోంది. మరో పొరుగు దేశం బంగ్లాదేశ్ గాడితప్పి, ఇంకా కుదురుకోక, అనతికాలంలోనే పక్కలోబల్లెంలాగా తయారైన నేపథ్యంలో నేపాల్ పరిణామాలు ఉపశమనం కలిగిస్తాయి. కేవలం నలభైఎనిమిది గంటల్లో భీతావహమైన ఘట్టాలను చవిచూసిందీ దేశం. పాలకుల అవినీతి, ఆశ్రితపక్షపాతంమీద జనం గుండెలోతుల్లో గూడుకట్టుకొని ఉన్న నిరాశా నిస్పృహలు ఒక్కసారిగా ఓ చిన్న నిప్పురవ్వతో రాజుకున్నాయి. దొరికిన మంత్రులను నవతరం తన్నితరిమేసింది, ప్రధాని మాయమై రక్షణ స్థావరాల్లో తలదాచుకున్నారు, దేశాధ్యక్షుడు రహస్యప్రదేశాలకు తరలిపోయారు. ఐదుగురు మాజీ ప్రధానుల ఇళ్ళు తగలబడ్డాయి, చివరకు పార్లమెంటు, సుప్రీంకోర్టు భవనాలు సైతం అగ్నికి ఆహుతైనాయి. నాయకుడంటూ లేని ఈ తిరుగుబాటు ఎంతకాలం సాగుతుందో, ఎక్కడకు దారితీస్తుందోనన్న భయం మొదట్లో కలిగినప్పటికీ, తిరగబడిన యువత తాము అనుకున్న లక్ష్యాల సాధన దిశగా త్వరితంగానే అడుగులు వేశారు. నేపాల్ ఇప్పుడు స్వయం ప్రక్షాళనతో నవ యువ యుగం వైపు కదులుతోంది.

అర్ధరాత్రి కుట్రలతో పౌరప్రభుత్వాలను కూల్చి, ప్రజానాయకులను జైళ్ళలోకి నెట్టి సైన్యం అధికారాన్ని తన్నుకుపోయిన ఉదంతాలు మన చుట్టూనే అనేకం. సైన్యాధ్యక్షులు నియంతలుగా అవతారమెత్తి ప్రజలను హింసించి, ప్రజాస్వామ్యాన్ని పాతరేసిన ఘనచరిత్ర మన ఇరుగుపొరుగులది. ఈ నేపథ్యంలో, అధికారాన్ని కొంతకాలం వెలగబెట్టగలిగే అంతపెద్ద అవకాశం వచ్చికూడా నేపాల్ సైన్యం ప్రజానుకూలంగా వ్యవహరించి దేశాన్ని తిరిగి గాడినపెట్టడం మెచ్చదగినది. నేపాల్ సైన్యాధ్యక్షుడు ఒక చిన్న విడియో సందేశంతో ప్రజలను అభ్యర్థించి, దేశాన్ని నియంత్రణలోకి తేవడం, సైనికాధికారులు ఎక్కడికక్కడ ఉద్యమకారులతో చర్చలు జరిపి కార్యాచరణను నిర్ణయించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. చట్టసభలు చట్టుబండలైన స్థితిలో, పౌర ప్రభుత్వం, రాజకీయ నాయకులు ఉనికిలో లేని ఉద్రిక్తవేళల్లో సైన్యమే మధ్యవర్తి అయింది, ఆర్మీ కార్యాలయమే చట్టసభగా అవతరించింది. రాజుగారి ఏలుబడినుంచి మావోయిస్టు ఉద్యమం వరకూ ఎన్నడూ ప్రజలపక్షాన లేని సైన్యం, ఇంతటి సంక్షోభంలోనూ నవతరం వైపు నిలబడింది. గతపాలకులు తప్పుకోవడం నుంచి, జెన్ జి గ్రూపుల్లో విభేదాలను చక్కదిద్ది సుశీలా కర్కిని ఎంపిక చేయడం వరకూ ప్రతీదీ సవ్యంగా పూర్తయ్యేట్టు చూసింది. గడ్డుకాలాన్ని గట్టెక్కించినందుకు నేపాల్ యువత సైన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పుకుంది.

ఆ నమ్మకాన్ని ఆపద్ధర్మ ప్రధాని కూడా నిలబెట్టుకున్నారు. అతి త్వరలోనే దేశాన్ని తిరిగి ప్రజాస్వామ్యం పట్టాలు ఎక్కించేందుకు వచ్చే మార్చిలో ఎన్నికల నిర్వహణకు సిద్ధపడ్డారు. బంగ్లాదేశ్‌లో గత ఏడాది ఆగస్టులో తిరుగుబాటు, మహ్మద్ యూనిస్‌ను విదేశాల నుంచి హడావుడిగా రప్పించి తాత్కాలిక ప్రభుత్వాధినేతగా కూర్చోబెట్టడం, ఆయన ఎంతో నాన్చి ఎట్టకేలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలను ప్రకటించడం తెలిసిందే. అవి కూడా సజావుగా సకాలంలో జరుగుతాయన్న నమ్మకం ఇప్పటికీ అక్కడ లేకపోతోంది. హసీనాను గద్దెదించిన తరువాత కూడా మైనారిటీలపైనా, బంగ్లా పితామహుడు ముజిబుర్ రహ్మాన్ ఆస్తులు, పార్టీనేతలపైనా సాగిన దమనకాండ ఆ పోరాట స్ఫూర్తిని పూర్తిగా దెబ్బతీశాయి. హసీనా పార్టీని ఎన్నికల్లో పాల్గొననీయకుండా చేయడం, ఆమె ప్రత్యర్థి ఖలేదాజియాను బలోపేతం చేయడం, మతోన్మాదులను జైళ్ళనుంచి రోడ్లమీదకు వదిలేయడం, బంగ్లా ఆవిర్భావ చరిత్రను పాతరేసి పాకిస్థాన్‌తో అంటకాగడం వంటివి గమనించినప్పుడు నేపాల్ ఎంత ఉన్నతంగా నిలబడిందో అర్థమవుతుంది. బంగ్లాలో దీర్ఘకాలం విధ్వంసం కొనసాగితే, నేపాల్ వెనువెంటనే పరిసరాలను శుభ్రం చేసుకుంది, పరిస్థితిని చక్కదిద్దుకుంది. ఏదో ఆపద్ధర్మంగానో, సలహాదారుగానో కాక, ఆయా రంగాల్లో అనుభవం ఉన్న ముగ్గురు మంత్రులతో ప్రధానిగా ప్రమాణం చేసిన సుశీల దేశాన్ని గాడినపెట్టేపని ఇప్పటికే ఆరంభించారు. అధికారాన్ని దుర్వినియోగం చేసి, ఆస్తులు కూడబెట్టుకున్న నాయకులందరిమీదా యువతరం దండెత్తిన నేపథ్యంలో, వీరి ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగంలో మార్పుచేర్పులు చేపట్టాల్సివుంది. ఓ నలుగురు వ్యక్తులు మారి, అవే విధానాలు కొనసాగితే ఈ ప్రజాగ్రహానికి విలువే లేకుండా పోతుంది కనుక, నవతరం ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవస్థల ప్రక్షాళన జరగాల్సి ఉంది.

ఉత్తరాఖండ్‌లో విధ్వంస వికాసం

ఉత్తరాఖండ్ రాష్ట్రం 2000 సంవత్సరంలో నవంబర్ 9న ఏర్పాటయింది. ఆ శుభ వేడుకలు ఇంకా పూర్తిగా ముగియకముందే ముస్సోరిలో ఒక ఉపన్యాసం వెలువరించేందుకు నాకు ఆహ్వానం అందింది. ఆ ఆహ్వానాన్ని అంగీకరించాను. ఆ రాష్ట్రంలోని ప్రధాన నగరాలలో ఒకటైన డెహ్రాడూన్‌లోనే నేను పుట్టి పెరగడమే అందుకొక కారణం. ముస్సోరికి వెళ్లిన తరువాత నా బసకు సమీపంలో ఉన్న ఒక పబ్లిక్ కాల్ బూత్ (అప్పటికి ఇంకా సెల్ ఫోన్లు లేవు)కు వెళ్లి నైనిటాల్‌లో ఉండే చరిత్రకారుడు శేఖర్ పాఠక్‌కు ఫోన్ చేశాను. నా మిత్రుడు ఫోన్ ఎత్తగానే నేను ఇలా సగర్వంగా ప్రకటించాను: 'మై అప్నే ప్రదేశ్ సె బోల్ రహా హూ' (నేను నీతో మన రాష్ట్రం నుంచి మాట్లాడుతున్నాను).



ఇప్పుడు బెంగళూరులో స్థిరపడినప్పటికీ నేను యువకుడుగా ఎదిగిన, నా తొలి పరిశోధనను నిర్వహించిన ప్రదేశంతో నా ఆత్మీయ సంబంధాలను కొనసాగిస్తున్నాను. ఉత్తరప్రదేశ్‌లోని పర్వత ప్రాంత జిల్లాలతో ఒక ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకై అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటూ ప్రజలు నిర్వహించిన ఉద్యమాన్ని మొదటి నుంచి చివరివరకు నేను ఆసక్తితో గమనించాను. తుదకు ఉత్తరాఖండ్ ఏర్పడినప్పుడు 'దేవ భూమి'గా ప్రసిద్ధిగాంచిన ఆ హిమాలయ ప్రాంతాల ప్రజల జీవితాలలో కొత్త యుగోదయాన్ని ఆకాంక్షించాను.

1971లో హిమాచల్‌ప్రదేశ్ పూర్తిస్థాయి రాష్ట్రంగా ప్రభవించిన తరువాత ఆ రాష్ట్ర ప్రజలు గణనీయమైన సామాజిక, ఆర్థిక పురోగతి సాధించిన విధంగానే ఉత్తరాఖండ్ వాసులు తమ సొంత రాష్ట్రంలో సర్వతోముఖమైన ప్రగతి సాధించగలరని భావించాను. నా నమ్మకానికి కారణమేమిటి? ఆ కొత్త రాష్ట్రాన్ని పాలించే రాజకీయవేత్తలు తమ పాలితులతో ఉమ్మడి సాంస్కృతిక నేపథ్యమున్నవారే కాక, ప్రజల ఆశలు, అభిలాషలలో భాగస్వాములుగా ఉండడమే. మరో కొద్ది వారాలలో ఉత్తరాఖండ్ 25వ ఆవిర్భావ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నది. ఈ పాతికేళ్ల కాలంలో కాంగ్రెస్ పది సంవత్సరాల పాటు అధికారంలో ఉండగా భారతీయ జనతా పార్టీ పదిహేనేళ్లు పాలించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర రజతోత్సవాలను చాలా ఘనంగా నిర్వహిస్తుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు రెండూ ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు చేసింది చాలా తక్కువ అనేది ఒక చేదు సత్యం. విద్యా వైద్య రంగాలను రెండు పార్టీల ప్రభుత్వాలూ ఒకే విధంగా నిర్లక్ష్యం చేశాయి. మహిళలకు రక్షణ కల్పించడంలోను, జీవనోపాధులకు భద్రత సమకూర్చడంలోనూ అన్ని ప్రభుత్వాలూ విఫలమయ్యాయి. 2017 నుంచి అధికారంలో ఉన్న బీజేపీ హిందూత్వ భావజాలాన్ని ప్రోత్సహిస్తోంది. మైనారిటీల పట్ల వివక్ష ప్రదర్శిస్తోంది. భయపూరిత వాతావరణాన్ని సృష్టించి మత సామరస్యానికి విఘాతం కలిగిస్తోంది.

ఇదిలావుండగా ఉత్తరాఖండ్‌లో అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వమూ కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో 'అభివృద్ధి' పేరిట పర్యావరణ విధ్వంసానికి పాల్పడడం పరిపాటిగా ఉన్నది. కొండలు తొలిచివేస్తున్నారు. నాణ్యత లేని రోడ్లు నిర్మిస్తున్నారు. ఆలోచనారహితంగా భారీ డ్యాంల నిర్మాణానికి పూనుకుంటున్నారు. చార్ ధామ్ హైవే ఈ ప్రాజెక్టులలో అత్యంత ప్రమాదకరమైనది. ప్రజలు, పర్యావరణానికి ఈ ప్రాజెక్టు హానికరమైనదని నిరాకరించలేని శాస్త్రీయ సాక్ష్యాధారాలు నివేదించినప్పటికీ ఆ హైవే నిర్మాణాన్ని కొనసాగించేందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం అనుమతినిచ్చింది.

ఒక సాధికారిక అంచనా ప్రకారం 2000 సంవత్సరంలో ఏర్పడినప్పటి నుంచీ ఇప్పటివరకు హై వేలు, డ్యాంలు, గనులు, ప్రభుత్వ బస్తీలు మొదలైన 'అభివృద్ధి ప్రాజెక్టుల' పేరిట 50 వేల ఎకరాల సహజ అడవిని కోల్పోయింది. ఆ 'అభివృద్ధి' నుంచి ప్రజలు రవ్వంత కూడా లబ్ధి పొందలేదు. ఎంత తక్కువగా అంచనా వేసినా ప్రతి హెక్టారు సహజారణ్యంలో 3000 వృక్షాలు ఉంటాయి. హరించుకుపోయిన 50 వేల హెక్టార్లలో ఇంచుమించు 15 కోట్ల వృక్షాలు ఉండవచ్చు. ఉత్తరాఖండ్ ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వమే ఆ వృక్ష సంపదను సంపూర్ణంగా నిర్మూలించింది. ఈ సహజ సంపద విధ్వంసకాండ ఆర్థిక, పర్యావరణ వ్యయాలు అగణితమైనవి.

> ప్రాకృతిక జగత్తు, జన సమూహాల వైవిధ్య జీవన రీతులను గౌరవిస్తూ జరిగే పుణ్యక్షేత్రాల సందర్శన యాత్రలా పర్యాటకాన్ని రూపొందించుకోవల్సి ఉండగా ప్రకృతి, ప్రజలకు విధ్వంసాన్ని, కాలుష్యాన్ని మిగిల్చే ఆర్భాటపూరిత పర్యాటకంలా తీర్థయాత్రలను తీర్చిదిద్దాలని ప్రభుత్వాలు ఆకాంక్షిస్తున్నాయని చరిత్రకారుడు శేఖర్ పాఠక్ వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్ రజతోత్సవాల శుభవేళ పవిత్ర క్షేత్రాల సందర్శనలా పర్యాటక రంగాన్ని రూపొందించేందుకు, ప్రజలకు సుస్థిర ఆర్థిక భవిష్యత్తును సమకూర్చేందుకు పాలకులు పూనుకోవాలి.

హిమాలయాల పర్యావరణ వ్యవస్థ సున్నితమైనది. భూకంపాలు సంభవించే ప్రాంతంలో హిమాలయాలు ఉన్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పోషణకే కాకుండా నేల కోత, వరదల నుంచి రక్షణకు కూడా దట్టమైన అడవులు విలసిల్లడం చాలా అవసరం. హైవేలు, రైళ్ల మార్గాలను నిర్మించేందుకు కొండలు తొలిచి సొరంగాలు నిర్మిస్తున్నారు. సదరు కొండ ప్రాంతాలను కాంక్రీట్ నిర్మాణాలతో నింపివేస్తున్నారు. ఈ పర్యావరణ విరుద్ధ నిర్మాణాలతో వరుసగా అనేక ఘోర ప్రమాదాలు, విపత్తులు సంభవించాయి. ధరాళిలో చోటుచేసుకున్న దుర్ఘటన ఈ ప్రమాదాలలో చాలా ఇటీవలది. భూపాతాల కారణంగా చోటుచేసుకున్న మానవ మరణాలు, ఆస్తినష్టం లెక్కకు మించి జరిగింది. ఇటీవలి కాలంలో వరదలు తరచుగా సంభవిస్తున్నాయి. పెద్ద ఎత్తున ప్రాణనష్టానికి ఇవి దారితీశాయి. జీవనాధారాలకు వాటిల్లిన నష్టం అపారమైనది. ఈ దుర్ఘటనలను పాలక పక్షాలు 'ప్రాకృతిక విపత్తులు'గా పరిగణిస్తున్నాయి. నిజానికి అవి మానవుల విచక్షణారహిత కార్యకలాపాల మూలంగానే సంభవించాయి. రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై స్వప్రయోజనాలకై రోడ్ల విస్తరణ, డ్యాంల నిర్మాణాలు, రిసార్ట్ల ఏర్పాటుకు ముందు వెనుకలు చూడకుండా అనుమతి నిస్తున్నారు.



■ రామచంద్ర గుహ

ప్రకృతి పరిరక్షణకు, సమాజశ్రేయస్సుకు తోడ్పడని ఈ ప్రాజెక్టులు తరచు విపత్తులకు దారితీస్తున్నా ఉత్తరాఖండ్‌ను పరిపాలిస్తున్నవారు లబ్ధి పొందుతున్నారు. డెహ్రాడూన్‌లో బిందాల్, రిస్పాన నదులపై తలపెట్టిన రెండు ఎలివేటెడ్ హైవే (నేలమట్టం లేదా నదీతలానికి పైన ఎత్తుగా నిర్మితమయ్యేవి)లనే తీసుకోండి. ఒక్కోటి పది కిలోమీటర్లకు పైగా పొడవు ఉంటుంది. ఏమిటి వీటి లక్ష్యం? అధికారికంగా చెప్పక పోయినప్పటికీ మైదాన ప్రాంతాల నుంచి డెహ్రాడూన్‌లోకి ప్రవేశించిన పర్యాటకుల వాహనాలు శీఘ్రగతిన ముస్సోరికి చేరేందుకు సౌలభ్యాన్ని కల్పించడమే నన్నది స్పష్టం. ఒక్కో ఎలివేటెడ్ హైవే నిర్మాణ అంచనా వ్యయం రూ.6000 కోట్లు. ఇది మరింతగా పెరుగుతుందనడంలో సందేహం లేదు. వీటి నిర్మాణానికి చట్టబద్ధంగా నిర్మాణమైన వేలాది గృహాలు, ఇతర కట్టడాలను కూల్చివేయవలసి ఉంటుంది. పెద్ద ఎత్తున నేల కోత సంభవిస్తుంది. వంతెనల స్తంభాలు సహజ ప్రవాహాన్ని అడ్డుకోవడం వల్ల ఆకస్మిక వరదలు పెరిగిపోయే ప్రమాదమున్నది. వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఎలివేటెడ్ హైవేల ప్రత్యక్ష లబ్ధిదారులు కాంట్రాక్టర్లు కాగా పరోక్ష లబ్ధిదారులు కార్ల ఉత్పత్తిదారులు, వాటి పంపిణీదారులు అని డెహ్రాడూన్ పౌరసమాజ బృందం ఒకటి విమర్శించింది.

ఈ హైవేల నిర్మాణాలకు బిందాల్, రిస్పాన నదుల నుంచి లక్షలాది క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్విపోయవలసి వుంటుందని, దీనివల్ల వరదల సంభవత పెరుగుతుందని డెహ్రాడూన్ నివాసి అయిన భారతి జైన్ అన్నారు. డెహ్రాడూన్ పరిసర ప్రాంతాలలో భూగర్భ జలాల పెరుగుదలకు విశేషంగా తోడ్పడే ఈ నదులలో మట్టి తవ్వకాలు, జల ప్రవాహాలకు ఆటంకాల వల్ల వర్షాకాలంలో వరదలు, వేసవిలో కరువులు వస్తాయని ఆమె తెలిపారు. డెహ్రాడూన్ ప్రాంతం ఇప్పటికే భూగర్భ జలాల కొరత నెదుర్కొంటుందని, రిస్పాన-బిందాల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం వల్ల వాహనాల రాకపోకలకు సౌలభ్యం కలగవచ్చునేమో కానీ దానివల్ల జల భద్రత, పర్యావరణ సమతుల్యతకు ప్రమాదమేర్పడుతుందని ఆమె అన్నారు. తాత్కాలిక వెసులుబాటు లేదా దీర్ఘకాలిక ప్రయోజనాలలో నొకదాన్ని డెహ్రాడూన్ పౌరులు ఎంచుకోవల్సిన సమయమాసన్నమయిందని భారతి జైన్ స్పష్టం చేశారు.

ఈ హైవేల నిర్మాణంపై డెహ్రాడూన్ పౌరులలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని ఇటీవల ఒక సర్వేలో వెల్లడయింది. వీటితో పాటు ఢిల్లీ–డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణాన్ని కూడా చేపట్టనున్నారు. వీటివల్ల డెహ్రాడూన్ పౌరులకు సమకూరే తాత్కాలిక సామాజిక ప్రయోజనాలు స్వల్పం కాగా దీర్ఘకాలిక పర్యావరణ, సామాజిక నష్టాలు చాలా తీవ్రంగా ఉంటాయి. పర్యాటకులకు అవి ఏ విధంగా లబ్ధి కలిగిస్తాయి అన్నది తెలియదు. ఈ హైవేల నిర్మాణం పూర్తయితే ముస్సోరిలోకి ప్రతిరోజూ అదనంగా వేలాది చిన్నకార్లు, బస్సులు ప్రవేశిస్తాయి. ఈ పర్యాటకుల రద్దీని ఎలా తట్టుకుంటారు? అదనపు వాహనాల వెల్లువ సృష్టించే ట్రాఫిక్ జామ్‌లను ఎలా నివారిస్తారు? వాహనాలను తాత్కాలికంగా నిలపడానికి కొండ పక్కన పది అంతస్తుల పార్కింగ్ సదుపాయాన్ని నిర్మించేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం పూనుకోనున్నదా?

ఉత్తరాఖండ్ విలక్షణ భౌగోళికత, చరిత్ర, సంస్కృతి గురించి మన కాలంలో మరెవ్వరికి కంటే సమగ్రంగా తెలిసిన శేఖర్ పాఠక్ తన విద్వత్ ప్రాజ్ఞతతో ఒక వివేకవంతమైన వ్యాఖ్య చేశారు: 'ప్రాకృతిక జగత్తు, జన సమూహాల వైవిధ్య జీవన రీతులను గౌరవిస్తూ నిదానంగా, నిరాడంబరంగా జరిగే పుణ్యక్షేత్రాల సందర్శన యాత్రలా పర్యాటకాన్ని రూపొందించుకోవల్సి ఉండగా ప్రకృతి, ప్రజలకు విధ్వంసాన్ని కాలుష్యాన్ని మిగిల్చే ఆర్భాటపూరిత పర్యాటకంలా తీర్థయాత్రలను తీర్చిదిద్దాలని ప్రభుత్వాలు ఆకాంక్షిస్తున్నాయి' అని పవిత్ర క్షేత్రాల సందర్శనలా పర్యాటక రంగాన్ని పునః రూపకల్పన చేయడమనేది ఉత్తరాఖండ్‌ను ప్రస్తుతం పరిపాలిస్తున్న రాజకీయవేత్తల, అధికారుల ప్రధాన ప్రాధాన్యత అవ్వాలి. మరింత మెరుగైన, అందరికీ అందుబాటులో ఉండే పాఠశాలల, ఆసుపత్రుల నిర్వహణ, తద్వారా ఆ హిమాలయ రాష్ట్ర ప్రజలకు సుస్థిర ఆర్థిక భవిష్యత్తును సమకూర్చడం ఉత్తరాఖండ్ పాలకులకు రెండవ, బహుశా మరింత ముఖ్యమైన ప్రాథమ్యం కావాలి. ఉత్తరాఖండ్ ఆవిర్భావానికి ప్రేరణ అయిన ఉదాత్త ఆకాంక్షలు, సమున్నత లక్ష్యాలు ఇప్పటికీ చాలా స్వల్పంగా మాత్రమే నెరవేరాయి. వాటిని సంపూర్ణంగా సాకారం చేయవలసిన బాధ్యత ఉత్తరాఖండ్ ప్రస్తుత, భావి పరిపాలకులపై ఉన్నది.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

చిరస్మరణీయులు ఆచార్య ఎస్వీ రామారావు

నివాళి

ఆచార్య ఎస్వీ రామారావు ఇక లేరు అన్నది భౌతిక సత్యం. తమ గ్రంథాలలో వారు సజీవంగా ఉన్నారన్నది సాహిత్య సత్యం. సెప్టెంబర్ 17న ఉదయం వారు కనుమూశారన్న వార్త సాహిత్యలోకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. వారు వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలో 1941లో జన్మించారు.

2000 సంవత్సరం నుంచి తెలుగు సాహిత్య రంగంలో మార్పులు చోటుచేసుకుంటూ వచ్చాయి. తెలంగాణ సాహిత్య ప్రత్యేక అస్తిత్వాన్ని నిరూపించుకోవటానికి బలమైన వాదనలను వినిపించవలసిన అగత్యం ఏర్పడింది. తెలుగు సాహిత్య చరిత్రలలో తెలంగాణ సాహిత్యానికి సరైన చోటు లభించకపోవటం వంటి సత్యాలను ఎత్తి చూపవలసి వచ్చింది.

ఇట్లాంటి చారిత్రక సందర్భంలో ఎస్వీ రామారావు తమ కలానికి పదును పెట్టి తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించారు. వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా, శాఖాధ్యక్షులుగా, పాఠ్యప్రణాళికా సంఘం అధ్యక్షులుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. కాని తెలుగు సాహిత్య చరిత్రకు, తెలంగాణ సాహిత్య చరిత్రకు సంబంధించిన వ్యాసాలను, గ్రంథాలను ఎత్తిన కలం దించకుండా రాస్తూ వచ్చారు. వీరు ఈ అంశాల మీద ఆంగ్లంలో కూడా రచనలు చేసి ప్రచురించడం మూలంగా అన్యభాషీయులకు కూడా తెలంగాణ ప్రాంతపు సాహిత్య వైశిష్ట్యం తెలిసింది.



ఎస్వీ రామారావు 1960 ప్రాంతం నుంచి సాహిత్య రంగంలో ఉన్నారని చెప్పవచ్చు. 'జ్యోతిర్మయి' అన్న సాహిత్య సంస్థను నెలకొల్పి, అదే పేరుతో సాహిత్య సంచికలను కూడా ప్రచురిస్తూ వచ్చారు. వీటిల్లో ఎక్కువగా పాలమూరు జిల్లా కవుల రచనలు ప్రచురితమయ్యాయి.

సాహిత్య విమర్శ, సాహిత్య చరిత్ర ఈ రెండూ వారికి ఇష్టమైన ప్రక్రియలు. డా. సి.నారాయణరెడ్డి పర్యవేక్షణలో 'తెలుగు సాహిత్య విమర్శ–అవతరణ, వికాసాలు' అన్న అంశం మీద పరిశోధన చేసి, 1973లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి పట్టా పొందారు. ఇది విమర్శ ప్రక్రియలో తెలుగులో వచ్చిన తొలి పరిశోధన గ్రంథం. ఇది పలు ముద్రణలు పొంది దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో ప్రాచుర్యం పొందింది. విమర్శలో ఆలంకారిక విమర్శ, తులనాత్మక విమర్శ, స్వతంత్ర విమర్శ, చారిత్రక విమర్శ, కవి జీవిత విమర్శ, కళాతత్త్వ విమర్శ, సాంఘిక విమర్శ, మనస్తత్త్వ విమర్శ– వంటి అనేక భేదాలున్నాయని ఒక వ్యాసంలో పేర్కొన్నారు. వాటిని వివరించారు కూడా. ఇది వారి కూలంకష ప్రజ్ఞకు నిదర్శనం.

2012లో ఎస్వీ రామారావు రచించిన 'తెలుగు సాహిత్య చరిత్ర' ఒక తెలంగాణ పరిశోధకుడు ఒక చేతిమీదుగా రాసిన తొలి చరిత్రగా చెప్పుకోవచ్చు. సాహిత్య చరిత్రలో కవుల కాలస్థలాలకు సంబంధించి, అధ్యాయాల విభజనకు సంబంధించి అనేక సమస్యలు ఎదురవుతుంటాయి. అంతర్ బహిర్ సాక్ష్యాల ఆధారంగా వీటిని పరిష్కరించవలసి ఉంటుంది. ప్రపంచంలోనే తొలి కథల సంపుటి అయిన బృహత్కథను రచించిన గుణాఢ్యుని కాలం గూర్చి తొలితరం చరిత్రకారులు అనేక వాదాలు చేశారు. అయితే ఎస్వీ రామారావు గుణాఢ్యుడు క్రీ.శ. ఒకటవ శతాబ్దానికి చెందిన హాల శాతవాహనుని కాలం నాటివాడని భావించారు. అధిక సంఖ్యాకుల అభిప్రాయం కూడా ఇదే కావటం గమనార్హం. తెలంగాణ సాహిత్య చరిత్ర మీద కూడా వారు అనేక గ్రంథాలు రాశారు. 'మావూరి కథలు', 'విశ్వనాథ దర్శనం', 'గ్రంథావలోకనం', 'విమర్శక వతంసులు' వంటి ఇతర పుస్తకాలు రచించారు.

ఎస్వీ రామారావు చాలా అభిరుచులున్న రచయిత. 'మాయాబజారు', 'గుండమ్మ కథ' వంటి అనేక సినిమాల మీద వారు రాసిన సమీక్షలు పాఠకులను ఆకట్టుకున్నాయి. నెల్లూరి కేశవస్వామి, భాస్కరభట్ల కృష్ణారావు వంటి సత్తా ఉన్న రచయితల పుస్తకాల మీద కూడా వారు సమీక్షలు రాశారు. 'తెలుగు అధ్యాపక సంఘం' అధ్యక్షులుగా ఉన్న సమయంలో కళాశాల విద్యలో తెలుగు భాష ప్రాముఖ్యం తగ్గిపోవడాన్ని నిరసిస్తూ, ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరిస్తూ వచ్చారు.

కేంద్ర సాహిత్య అకాడమీ వారి కోసం 'సి.నారాయణరెడ్డి' మీద మోనోగ్రాఫ్ రాశారు. నారాయణరెడ్డి జీవిత సాహిత్యాల మీద వచ్చిన సాధికారికమైన గ్రంథంగా దీన్ని చెప్పుకోవచ్చు.

ఎస్వీ రామారావు పర్యవేక్షణలో సుమారు 30 మంది పరిశోధకులకు ఎం.ఫిల్, పిహెచ్.డి పట్టాలు లభించాయి. విద్యార్థులకు సన్నిహితంగా ఉంటూ, వారి సందేహాలను నివృత్తి చేస్తూ సరైన బాటలో వారిని నడిపించారు. ఏది ఏమైనా చివరి శ్వాస వరకు సాహిత్య సేవ చేస్తూ సార్థక జీవితాన్ని గడిపిన ఆచార్య ఎస్వీ రామారావు చిరస్మరణీయులు.

● అమ్మంగి వేణుగోపాల్

'ఐటీడీఏ'ల్లో అన్నీ ఖాళీలే!

గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాల్సిన ఐటీడీఏలు సమస్యల వలయంలో చిక్కుకుని ఉన్నాయి. పర్యవేక్షణ లోపం, నిధుల మంజూరులో జాప్యం, సంస్థలో అవసరమైన ఉద్యోగాలను భర్తీ చేయకపోవడంతో ఇవి సమర్థవంతంగా పనిచేయలేకపోతున్నాయి. దీంతో ప్రభుత్వ పథకాలు గిరిజనులకు చేరడం లేదు. రాష్ట్రంలో ఉట్నూరు, భద్రాచలం, ఏటూరునాగారం, మన్ననూరుల్లో ఐటీడీఏలు ఉన్నాయి. మన్ననూరును మినహాయిస్తే మిగతా మూడు ఐటీడీఏల్లో 208 పోస్టులకు గానూ 116 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆదివాసీ బిడ్డ, రాష్ట్ర మంత్రి సీతక్క సొంత జిల్లాలో కూడా ఇదే పరిస్థితి. మన్ననూరు ఐటీడీఏలో కేవలం ఒకే ఒక్క ఉద్యోగి ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గిరిజనుల కోసం అమలు చేస్తున్న పథకాల్లో ప్రధానమైన వ్యవసాయం, పండ్ల తోటల పెంపకం, వైద్యం, ఆరోగ్యం, ఉపాధి హామీ, స్వయం సహాయక సంఘాలు, పెసా చట్టం, స్త్రీ శిశు సంక్షేమ కార్యక్రమాలు, ఆటవీ ఆధారిత పథకాలు, విద్య, సాగునీరు, భూ అభివృద్ధి, గృహ నిర్మాణం, ఇంజినీరింగ్ విభాగం, గిరిజన సహకారం వంటి సంస్థల కార్యక్రమాలను ఇతర శాఖలతో సమన్వయం చేయడమే సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ విధి. జీవో–57 ప్రకారం ప్రీమిటివ్ ప్రాంతం అంతా సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ కిందికి వస్తుంది. అన్ని ప్రభుత్వ శాఖలు కూడా ఐటీడీఏ పీవో పరిధిలోకి వస్తాయి. పీవో ఆదేశాల మేరకు ఉద్యోగులు పనిచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం గిరిజనుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోయినా, ప్రతి ఏడాది ఐటీడీఏకు జిల్లా పరిషత్, మండల పరిషత్ ఇయర్ మార్క్డ్ ఫండ్స్, కేంద్ర ప్రభుత్వం నుంచి సీసీడీపీ ఫండ్స్ వస్తాయి. కానీ ఐటీడీఏ రెగ్యులర్ పీవో నిధులపై సమీక్ష చేసి ఆయా జిల్లా పరిషత్‌ల నుంచి, మండల పరిషత్‌ల నుంచి రావాల్సిన బకాయిలను రాబట్టే నాథులే లేరు. ఐటీడీఏల్లో రెగ్యులర్ అధికారులు, దిగువ స్థాయి సిబ్బంది లేకపోవడంతోనే గిరిజనాభివృద్ధి సంస్థలు గతి తప్పుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి ఐటీడీఏల్లోని ఖాళీలను భర్తీ చేయాలి. తద్వారా వాటి పనితీరును మెరుగుపరచాలి.

– రావుల రాజేశం

ఊరు, వాడ ఇక్కట్లు తీర్చరా?

స్వతంత్ర భారతావనిలో గడిచిన 78 ఏళ్లుగా లెక్కలేనన్ని సంక్షేమ పథకాల తర్వాత క్రమంగా 'కేవలం సంక్షేమ పథకాలు, బడా ప్రాజెక్టులు మాత్రమే ఓట్ల వర్షం కురిపిస్తాయి' అన్న నమ్మకం పాలకుల్లో బలపడిపోయింది. ఆ నమ్మకం దెబ్బతిని ఎన్నికల్లో ఓటమిపాలైన ప్రతిసారీ సరికొత్త పథకాల కోసం వెతుకుతున్నారే తప్ప ఆ నమ్మకం నుంచి మాత్రం బయటపడటం లేదు.

సంక్షేమ పథకాలకు భారీగా శ్రీకారం చుట్టిన ఎన్టీఆర్ 1989 ఎన్నికల్లో ఓడిపోయారు. వాటిని పతాక స్థాయికి తీసుకెళ్లిన వైఎస్. రాజశేఖరరెడ్డి 2009 ఎన్నికల్లో బొటాబొటి మెజార్టీతో గట్టెక్కారు. 2019–2024 మధ్య దాదాపు రెండున్నర లక్షల కోట్లు సంక్షేమ పథకాలపై ఖర్చుపెట్టిన వైసీపీ అధినేత జగన్ ఏపీలో కేవలం 11 సీట్లకే పరిమితమయ్యారు. 2014–19 మధ్య చంద్రబాబు సంక్షేమానికి పెద్దపీట వేసి రెండు లక్షల కోట్ల రూపాయల పైచిలుకు పథకాలు ఇచ్చినా కేవలం 23 సీట్లే దక్కాయి. తెలంగాణలో పదేళ్లలో కేసీఆర్ సర్కార్ ఎన్నో సంక్షేమ పథకాల్ని ప్రవేశపెట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ లాంటివి చేపట్టినా ఫలితం దక్కలేదు.

ఇన్ని ఉదాహరణలు కనిపిస్తున్నా ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు, భారీ ప్రాజెక్టులకు కేటాయిస్తున్న నిధుల్లో పదోవంతు కూడా స్థానిక సమస్యల మీద ఖర్చు పెట్టడం లేదు. నియోజకవర్గ పరిధిలో వివిధ అంశాల్లో ప్రాథమిక అవసరాలు తీర్చడానికి సదరు ఎమ్మెల్యేకి ఏడాదికి రూ.25కోట్లు ఇచ్చినా తెలంగాణలో ఐదేళ్ళకు అయ్యే ఖర్చు రూ.14,875కోట్లు. ఐదేళ్ళకు రూ.14లక్షల కోట్లకు పైగా బడ్జెట్ ప్రవేశపెడుతున్న ఈ రాష్ట్రంలో రూ.14,875 కోట్లు అనేది కేవలం ఒక్క శాతమే. కానీ దీనివల్ల విద్య, ఆరోగ్యం, తాగునీరు వంటి ప్రాథమిక అంశాల విషయంలో ఏళ్లకొద్దీ ఎదురు చూపులు తప్పుతాయి. దీనివల్ల అవినీతికి ఆస్కారముందని భావించవచ్చు. కానీ ఎంపీ నిధుల అంశాన్ని తీసుకుందాం. ఈ దేశంలో జరుగుతున్న అవినీతితో పోల్చుకుంటే ఎంపీ లాడ్స్ అంశంలో అతితక్కువ దుర్వినియోగం జరుగుతోంది. కిందిస్థాయి నుంచి పై స్థాయి దాకా అధికారులకు ఇచ్చే నజరానాలు మిగులుతాయి. ఏ గ్రామంలో పనులు ఆ గ్రామస్తులతో చేయిస్తే స్థానికంగా ఉపాధి కూడా దొరుకుతుంది. సంక్షేమంతో పాటు స్థానిక అవసరాలకు ప్రభుత్వాలు పెద్దపీట వేయకుంటే ప్రజల్లో అసంతృప్తి పెరుగుతూనే ఉంటుంది.

> ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు, భారీ ప్రాజెక్టులకు కేటాయిస్తున్న నిధుల్లో పదోవంతు కూడా స్థానిక సమస్యల మీద ఖర్చు పెట్టడం లేదు. స్థానిక సమస్యలపై తగినంత ఖర్చు పెట్టకపోతే ప్రజాస్వామ్యం దాని అర్థాన్ని కోల్పోతుంది. ఎమ్మెల్యేలకు చిన్న చిన్న పనుల విషయంలో విచక్షణాధికారం ఉండేలా చేయాలి. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఏటా రూ.25కోట్ల పనులు జరిగేలా చూడాలి.



సామాన్యులు వివిధ అంశాలపై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడం స్వతంత్ర భారతావనిలో సర్వసాధారణ దృశ్యం. ఇదే దృశ్యంలో సామాన్యుడికి బదులుగా ఒక ఎమ్మెల్యేని ఊహించుకోండి. మనస్కరించడం లేదు కదా! కానీ జరుగుతున్న చరిత్ర ఇదే. ఎమ్మెల్యే బయటకు వచ్చాడంటే చుట్టూ జనమే. తమ కష్టాలు తీరుస్తారన్న నమ్మకంతో వచ్చేవాళ్ళే వారిలో చాలా మంది. ఆయన ఏ ఊరికైనా వెళ్తే చిన్నపాటి రోడ్డు, కాలవ, బడి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదలుకొని ఎన్నో సదుపాయాల విషయంలో సమస్యలు తీరతాయని పేద బడుగు బలహీనవర్గాల ప్రజలు తండోపతండాలుగా వస్తారు. నిజాయితీగా చెప్పాలంటే ఎమ్మెల్యే అందులో చాలా సమస్యల్ని తమ విచక్షణాధికారంతో పరిష్కరించే అవకాశముంటుంది. కానీ 90శాతం సమస్యలు ఆర్థిక అనుమతులతో ముడిపడి ఉండేవి. నియమనిబంధనల సుడిగుండంలో చిక్కుకొని అల్లాడేవి మరికొన్ని. దీంతో ప్రజా బాహుళ్యం నుంచి నాయకుడిగా ఎమ్మెల్యే స్థానంలోకి వచ్చిన ఆ మనిషి యథావిధిగా అధికార గణం, ప్రభుత్వ కార్యాలయాల వైపు చూడాల్సిందే. ఇందులో తప్పులేదు కూడా. కానీ ఆశ్చర్యం ఏమిటంటే– ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ స్థాయిల అధికారుల నుంచి సామాన్యులకు ఎదురయ్యే సమాధానాలే, సదరు ఎమ్మెల్యేకి కూడా ఎదురవుతున్నాయి. కాకపోతే కాస్త గౌరవంగా వస్తాయి అంతే. అంతకుమించి పనుల వేగంలోను, అనుమతుల విషయంలోను పెద్దగా వచ్చే మార్పేమీ ఉండదు. దీంతో నిజంగా ప్రజలకు ఏదైనా చేద్దామన్న తపనతో ముందుకు వచ్చే ఎమ్మెల్యేలు సైతం ఇలాంటి అనుభవాలతో కొన్నేళ్లకే తమ వైఖరి మార్చుకుంటున్నారు. అధికారుల్ని గట్టిగా ప్రశ్నిస్తే దాన్ని రాజకీయ కోణంలో చూస్తారన్న సందేహం ఒకటి ప్రజాప్రతినిధుల్ని దూకుడుగా ముందడుగు వేయకుండా ఆపుతోంది. దీంతో సద్భావన ఉన్న ఎమ్మెల్యేలు సైతం కొన్నేళ్ళకి స్తబ్ధుగా మారుతున్నారు. దీంతో ప్రజలు కూడా ఎమ్మెల్యేలు తమ ఇంటిలో జరిగే శుభకార్యాలకు వస్తే చాలనుకుంటున్నారు. ఈ మాటలు చెప్పడానికి కాస్త ఇబ్బందిగా అనిపించినా క్షేత్ర స్థాయిలో దేశమంతటా ఇదే వాతావరణం నెలకొని ఉన్నది.

దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో చూసినా ప్రభుత్వాలు పలు సంక్షేమ కార్యక్రమాలు, బడా ప్రాజెక్టులకు మాత్రమే రూపకల్పన చేస్తున్నాయి. కానీ అదే స్థాయిలో ప్రజల చేత ఎన్నికైన ఎమ్మెల్యేలకు చిన్న చిన్న పనుల విషయంలో విచక్షణాధికారం ఉండేలా చూస్తే మంచిది. ఇందులో తప్పొప్పులు దొర్లకుండా చూసేందుకు అవసరమైన నియంత్రణ ఉంచి ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఒక్కో నియోజకవర్గ స్థాయిలో ఏటా రూ.25 కోట్ల పనులు జరిగేలా చూస్తే మంచిది. బడా ప్రాజెక్టులు, సంక్షేమ కార్యక్రమాలతో పోలిస్తే రాజకీయంగా కూడా ఇలాంటి పనులు ఎక్కువ ప్రయోజనాన్ని కలిగిస్తాయని ఇప్పటికే ఎన్నోసార్లు రుజువైంది. దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు ఈ దిశగా ఆలోచించాల్సిన సమయం వచ్చింది.

బడా ప్రాజెక్టులు, బడా ఈవెంట్లు, వందల కోట్ల ప్రకటనలు... వీటి కంటే– ప్రజల అసలు అవసరం సీసీ రోడ్లు, డ్రయినేజీలు, స్వచ్ఛమైన తాగునీరు, పిల్లల వ్యాధులకు గ్రామంలోనే మందులు దొరకడం, స్కూలు కాంపౌండ్ వాల్, మరుగుదొడ్లు... ఇలాంటివి! వీటికి పెద్ద బడ్జెట్లు అవసరం ఉండదు. ప్రతి నియోజకవర్గానికి ఏటా రూ.25కోట్లు నేరుగా ఎమ్మెల్యే విచక్షణ అధికారంతో ఇస్తే– ఒక్కో ఊరిలో దశాబ్దాలుగా నిలిచిపోయిన వేలాది పనులు కొన్నేళ్లలోనే పూర్తవుతాయి. ఇకనైనా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు స్థానిక సమస్యలకు ప్రాముఖ్యతను ఇచ్చి తగినంత ఖర్చుపెట్టకపోతే ప్రజాస్వామ్యం దాని అర్థాన్ని కోల్పోతుంది.

మెజార్టీ ప్రభుత్వాలు సంక్షేమ పథకాల్ని వల్లె వేస్తున్నాయి. ప్రతిపక్షాలు అధికారం కోసం ఆ డోసు పెంచుతామని వాగ్దానం చేస్తున్నాయి. ఇదో విషవలయంలా మారుతున్నది. ఏది మంచీ ఏది చెడూ అన్న ఆత్మశోధన లేకుండా పోయింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే అధికారమే పరమావధిగా కొన్ని ప్రతిపక్షాలు ప్రజల్ని పక్కదారి పట్టిస్తున్నాయి. ప్రజలు కూడా ఆ మాయలో పడితే మిగులు బడ్జెట్‌తో మొదలైన తెలంగాణ మరికొద్ది ఏళ్లలోనే పేద రాష్ట్రంగా మిగిలిపోతుంది.

■ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే

అడిషినల్ డీసీపీగా బాలస్వామి

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆపరేషన్స్ అండ్ క్రైం అడిషినల్ డీసీపీగా జి.బాలస్వామిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1991 బ్యాచ్‌కు చెందిన బాలస్వామి.. గతంలో ఉమ్మడి వరంగల్‌లో ఎస్సై, సీఐగా విధులు నిర్వర్తించడంతోపాటు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీగా విధులు నిర్వర్తించాడు. ప్రస్తుతం హైద్రాబాద్ డీజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న బాలస్వామిని వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైం విభాగానికి బదిలీ చేశారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రండి..

- భద్రకాళి ఆలయ ఈవో, అర్చకుల ఆహ్వానం



హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు ఉత్సవాల ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఈవో సునీత

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చారిత్రక ఓరుగల్లు నగరంలోని భద్రకాళి దేవస్థానంలో ఈనెల 22 నుంచి పది రోజుల పాటు అత్యంత వైభవోపేతంగా నిర్వహించే భద్రకాళి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు హాజరు కావాలని ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖులకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు గురువారం ఉత్సవాల ఆహ్వాన పత్రికలను దేవాదాయ శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈవో రామల సునీత, అర్చకులు భద్రకాళి శేషుతో కలిసి అందజేశారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదాదేవి, మునిసిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో వైవీ గణేష్, కుడా అధికారులు అజిత్‌రెడ్డి, భీమ్‌రావులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్, సూరింటెండెంట్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సహకారం.. సంక్షేమం..

- అన్నదాతల సేవలో తరిస్తున్న ముల్కనూర్ సహకార బ్యాంకు
- నేడు ముల్కనూర్ బ్యాంకు 69వ వార్షిక మహాసభ

7



మేడారంలో ప్రారంభానికి నోచుకోని పోలీస్‌స్టేషన్

కొత్త ఠాణాలు ఎప్పుడో..?!

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కొత్త ఠాణాలు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు కాగితాలకే పరిమితమవుతోంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో కొత్తగా ఠాణాల ప్రతిపాదనలు మూలుగుతున్నాయి. కొత్త జిల్లాలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త పోలీస్ స్టేషన్లు, ట్రాఫిక్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసినా ఫలితం లేకుండా పోతోంది. వీటితో పాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొత్తగా మరో రెండు పోలీస్‌స్టేషన్‌ల కోసం చేసిన ప్రతిపాదనల ఫైలు కదలటం లేదు. దీనికి తోడు ఏళ్ల తరబడి పోలీస్‌స్టేషన్లు అప్‌గ్రేడేషన్‌కు నోచుకోవటం లేదు. దీంతో చాలా పోలీస్‌స్టేషన్లలో అరకొర సిబ్బందితో స్టేషన్లను నెట్టుకురావాల్సి వస్తోందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఏళ్ల తరబడి కాగితాల్లోనే మూలుగుతున్న ప్రతిపాదనలు

కాగితాల్లోనే కొత్త ఠాణాలు

కొత్త ఠాణాల ప్రతిపాదనలు అటకెక్కుతున్నాయి. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో 45 పోలీస్‌స్టేషన్లు ఉండగా, భూపాలపల్లిలో 13 పీఎస్‌లు, ములుగు జిల్లాలో 10, మహబూబాబాద్ జిల్లాలో 18 పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయి. మొత్తం గా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 86 పోలీస్‌స్టేషన్లు ఉండగా, పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న కాలనీలతో కొత్తగా (మిగతా 7లో..)



- ఉమ్మడి జిల్లాలో గతంలోనే 3 పోలీస్‌స్టేషన్లు, 6 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు ప్రతిపాదనలు
- నడికూడ, మేడారం, అలుబాకలో ఏర్పాటు చేయాలని నిర్ణయం
- కేయూ, జనగామ, నర్సంపేట, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లిలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు ప్రతిపాదనలు
- పోలీస్‌కమిషనరేట్ పరిధిలో రెండు పోలీస్‌స్టేషన్లు అవసరంగా గుర్తింపు
- అప్‌గ్రేడేషన్‌కు నోచుకోని పోలీస్‌స్టేషన్లు.. సిబ్బంది కొరతతో అవస్థలు..

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక

- ఏ-గ్రేడ్‌కు రూ.2,389, కామన్‌కు రూ.2,369 ధర
- కలెక్టర్ సత్యశారద



వరంగల్ కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పటిష్ఠ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2025-26 వానాకాలం ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 2లక్షల 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, సుమారు 260 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ప్యాడీ క్లీనర్లు, డ్రైయ్యర్లు, తాగునీరు, టార్పాలిన్స్, గన్నీ బ్యాగులు, తేమ సాంద్రత కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సీజన్‌లో ఏ-గ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ.2389, కామన్ రకానికి రూ.2369 ప్రభుత్వం ధర నిర్ణయించిందని, సన్నరకం ధాన్యానికి ప్రోత్సాహకం ఇస్తున్నందున అన్ని కేంద్రాల్లో సన్న రకం, దొడ్డు రకం ధాన్యం గుర్తింపులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా నిల్వ చేయడానికి అనుకూల స్థలాన్ని ఎంచుకోవాలని, రవాణా విషయంలో పలు జాగ్రత్తలు వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సివిల్ సప్లయీస్ డీఎం సంధ్యారాణి, పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, డీఎం సురేఖ, డీఆర్‌డీవో రామిరెడ్డి, డీసీవో నీరజ, డీఏవో అనురాధ, రవాణా అధికారి శోభన్, వివిధ శాఖల అధికారులు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హత లేకున్నా వైద్యం

18 మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలపై కేసులు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య కుమార్ ఆదేశాల మేరకు చైర్మన్ డాక్టర్ కె.మహేశ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఏకకాలంలో వరంగల్, కాజీపేట, హనుమకొండ, దుగ్గొండి సహా 12ప్రాంతాల్లో తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 18 మంది (ఆర్‌ఎంపీ, పీఎంపీ) అనధికారికంగా వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అధిక మోతాదులో యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ ఇస్తూ ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు కలిగిస్తున్నారని తెలిపారు. వీరిపై ఎన్‌ఎంసీ, టీఎంపీఆర్ చట్టాల ప్రకారం సంబంధిత పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు చేయనున్నట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు తెలిపారు. అర్హత లేకున్నా వైద్యం చేసే వారిపై సమాచారం ఉంటే మెడికల్ కౌన్సిల్‌కు వాట్సాప్ నెంబర్ 9154382727 ద్వారా సమాచారం అందించాలని కోరారు. తనిఖీల్లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



నేలకూలిన శివాలమర్రిని నిలబెట్టిన దృశ్యం

- పాత చోటే రీ ప్లాంట్ చేసిన అధికారులు
- చరిత్రను పదిలం చేసిన వైనం

శివాల మర్రికి పునరుజ్జీవం

ఐనవోలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు దేవాలయ ప్రాంగణంలో ఇటీవల నేలకూలిన శివాల మర్రి చెట్టుకు రీప్లాంటేషన్ పద్ధతిలో పునర్‌జీవనం కల్పించారు.

ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం సమీపంలో వేయ్యేళ్ళ చరిత్ర కలిగిన శివాల మర్రి వేర్లు దెబ్బతిని ఈ నెల 14న సాయంత్రం కూకటి వేళ్లతో నేలకూలిన విషయం తెలిసిందే. మరుసటి రోజున స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఈవో సుధాకర్‌లు కూలిన శివాల మర్రిని సందర్శించి పూజలు చేశారు. ఎమ్మెల్యే ఆటవీశాఖ, ఉద్యానశాఖ, వృక్ష శాస్త్రవేత్తలతో ఫోన్‌లో మాట్లాడి కూలిపోయిన శివాల మర్రిని మళ్ళీ నిలబెట్టి జీవింపచేయడంపై సాధ్యా సాధ్యాలను అడిగి తెలుసుకున్నారు. కూలిపోయిన మర్రిని రీ ప్లాంటేషన్ పద్ధతిలో అదేస్థానంలో నిలబెట్టి జీవింపచేసే అవకాశాలు ఉన్నాయని అధికారులు వివరించారు. దీంతో మర్రిని నిలబెట్టే బాధ్యతలను మాజీ ఎంపీటీసీ బొల్లేపల్లి మధుచంద్రగౌడ్‌కు అప్పజెప్పారు. శివాల మర్రి సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో వారు మూడు రోజులు శ్రమించారు. ముందుగా చెట్టు కొమ్మలను తొలగించారు. వేరు వ్యవస్థ పూర్తిస్థాయిలో దెబ్బతినని కారణంగా జాగ్రత్తగా చెట్టు అడుగుభాగంలో జేసీబీల సహాయంతో వెడల్పుగా గొతిని తవ్వి మట్టిని వదులుగా చేసి వృక్షశాస్త్రవేత్తల సలహాలు పాటించారు. రెండు పెద్దక్రేన్ల సహాయంతో యథావిధిగా అదే స్థానంలో నిలబెట్టారు. దీనికి రూ. 2 లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు. శివాల మర్రి వృక్షాన్ని కాపాడి నిలబెట్టేందుకు సహకరించిన టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, ఎస్సై పస్తం శ్రీనివాస్‌లకు ఈ సందర్భంగా మధుచంద్రగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

సింగరేణిలో కలకలం



కేటీకే 5 ఇంక్లైన్ గని ఆవరణలో రక్షణ చర్యల్లో రెస్క్యూ టీమ్

- కేటీకే 5 ఇంక్లైన్ భూగర్భ గనిలో మంటలు
- విష వాయువులతో నలుగురు కార్మికులకు అస్వస్థత
- భూపాలపల్లిలో ఘటన.. కార్మిక కుటుంబాల ఆందోళన



అస్వస్థతకు గురైన అన్వేష్, రంజిత్‌కుమార్, రఘు, క్రాంతికుమార్

కృష్ణకాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని 5 ఇంక్లైన్ గని రెండో లెవల్ మ్యాన్‌రైడింగ్ వద్ద చోటు చేసుకున్న ప్రమాదం కలకలం రేపింది. గురువారం మొదటి షిఫ్టుకు ముగింపు సమయంలో కార్మికులు గనిలోపల గ్లాటర్లు మార్చి.. పాత వాటిని కట్ చేసి వాటిని తీసేసి స్లాబ్ చేసి క్లోస్ చేసే పని వెల్డింగ్ ద్వారా చేపట్టారు. దీంతో స్లాబ్‌పైన గ్యాస్ కటింగ్ చేయడం మూలంగా నిప్పు రవ్వలు చెలరేగి బొగ్గు పెల్లలకు అంటుకొని మంటలు వ్యాపించాయి. ఆ మంటలతో విషవాయులు వెలువడగా గనిలో ఉన్న నలుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ముగ్గురైన జనరల్ అసిస్టెంట్ దాసరి అన్వేష్, ఫిట్టర్ రాయారపు రంజిత్, సపోర్టుమెన్ ట్రైనీ ఓ.రఘులు ముందుగా అస్వస్థతకు గురై బయటకు వచ్చి ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వెంటనే అధికారులు గమనించి వారిని హుటాహుటిన సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మరో వ్యక్తి జనరల్ అసిస్టెంట్ (పంప్ ఆపరేటర్)గా విధులు నిర్వర్తిస్తున్న సొన్నాయిల క్రాంతికుమార్ గనిలోనే ఇరుక్కపోగా బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో సుమారు అరగంట పాటు అధికారులు రక్షణ చర్యలు చేపట్టి అతడిని బయటకు తీసుకరాగా అస్వస్థతో ఉన్న ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. కాగా, నలుగురు కార్మికులకు ప్రాణాపాయం తప్పింది.

గనిలో చోటు చేసుకున్న ప్రమాదంపై సింగరేణి, ఫైర్, రెస్క్యూ, సెక్యూరిటీ, సెఫ్టీ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. విషయం తెలిసిన వెంటనే సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఓటుజీఎం కవీంద్ర ఘటనా స్థలికి చేరకొని ఘటనపై ఆరా తీశారు. అలాగే, సింగరేణి సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీ మోహన్, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శ్రీనివాస్ పాటు సింగరేణి రెస్క్యూ, సెఫ్టీ, ఫైర్ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకొని గనిలో చెలరేగుతున్న మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. రెండు గంటల తరువాత కూడా మంటలు ఆరిపోకపోవడంతో రెండో షిఫ్టులో కార్మికులను లోనికి అనుమతించలేదు. రాత్రి 8 గంటల వరకు కూడా గనిలో మంటలు వ్యాప్తి తగ్గలేదని, ఇంకా సుమారు 5 గంటలు ఆర్పే ప్రయత్నం చేస్తే గానీ ఆగే పరిస్థితి లేదని ఫైర్ అధికారులు చెప్పారు. ఎవరికీ ప్రాణహాని జరగకపోవడంతో అటు అధికారులు, ఇటు కార్మికుల కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నాయి.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న టి.రాజేశ్వర్‌రావు, రాజయ్య యాదవ్

నగరంలో సుష్మస్వరాజ్ కాంస్య విగ్రహం

- మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు

వడ్డెపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకభూమిక పోషించిన కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ జాతీయ నేత దివంగత సుష్మస్వరాజ్ కాంస్య విగ్రహాన్ని వరంగల్ నగరంలో ఏర్పాటు చేయాలని సంకల్పించినట్లు మాజీ మేయర్, బీజేపీ నేత డాక్టర్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, గొర్రెలు, మేకల పెంపకందారుల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్, బీజేపీ నేత కన్నెబోయిన రాజయ్య యాదవ్ అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ బిల్లుకు పార్లమెంట్‌లో సంపూర్ణ మద్దతును సుష్మస్వరాజ్ ప్రకటించారని పేర్కొన్నారు. విగ్రహం ఏర్పాటుకు రాజకీయాలకు అతీతంగా అన్ని సామాజిక వర్గాలు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీజేపీ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు మంద ఐలయ్య, వంగాల సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్షకుడి ట్రిక్... కష్టానికి చెక్..

రైతు భుజాలపై భారాన్ని దించిన బాలు ఒరవడి..

- రూ.15 వేలతో స్ప్రే చేసే యంత్రం తయారీ
- పది ఎకరాల వరకు ఒకేసారి పిచికారీ
- పర్వతగిరి మండలంలో రైతు ఆవిష్కరణ

పర్వతగిరి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) : ఆ రైతు చదివింది ఐదో తరగతి. కానీ తనకొచ్చిన ఐడియా మాత్రం అందరికీ ఆకట్టుకుంటోంది. కర్షకులకు వచ్చిన కష్టానికి చెక్ పెట్టాలనే ఆలోచనతో కొత్త ట్రిక్‌ను కనుగొన్నాడు. రైతు భుజాలపై భారం లేకుండా సమయం కూడా ఆదా అయ్యే విధంగా నూతన ఒరవడికి నాంది పలికాడు. ఒక్క రోజులోనే దాదాపు 20-30 ఎకరాల వరకు పురుగుల మందు స్ప్రే చేయగల సామర్థ్యం ఉన్న విధానాన్ని కనుగొన్నాడు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని దౌలత్‌నగర్ ప్రాంతంలో ఉండే ఇసావత్ తండాకు చెందిన రైతు ఇస్లావత్ బాలు దీనికి శ్రీకారం చుట్టాడు. తనకున్న ఐదెకరాల వ్యవసాయ భూమిలో పురుగుల మందు పిచికారీ చేసేందుకు గాను భుజాలపై (మిగతా 6లో..)





స్ప్రే చేసే పంపు



వరి పొలంలో పురుగుల మందు పైపు ద్వారా స్ప్రే చేస్తున్న రైతు ఇస్లావత్ బాలు

ఖాళీ స్థలాల్లో చెత్త వేయొద్దు..

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- న్యూశాయంపేటలో ఆకస్మిక తనిఖీలు



న్యూశాయంపేటలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. గురువారం వరంగల్ నగరంలోని 31వ డివిజన్ న్యూశాయంపేటలో డ్రైనేజీలు, ఖాళీ స్థలాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డివిజన్‌ల వారిగా కేటాయించిన చెత్త తరలింపు వాహనాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. గృహాల నుంచి చెత్తను సేకరించిన తర్వాత ఖాళీ ప్రదేశాల్లో వేయకుండా సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లకు తరలించాలన్నారు. చెత్త సేకరించే వాహనదారులు సమయ పాలన పాటించాలన్నారు. అంతేకాకుండా ఇండ్ల యజమానుల సంతకాలు తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శానిటేషన్ సిబ్బంది ప్రతీ రోజు చెత్త సేకరణ చేస్తున్నారా? లేదా? అని అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రవికుమార్, ఏఈ సౌజన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్న అనిల్‌తోపాటు శానిటేషన్ జవాన్లు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వార్డు అధికారులుగా బాధ్యతలు చేపట్టిన ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ సూచించారు. గురువారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆర్‌ఐలు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కమిషనర్ మాట్లాడారు. ఇటీవల బల్దియా నుంచి 27 మంది వార్డు అధికారులుగా విధులు నిర్వర్తించిన వీఆర్‌వోలు.. రిలీవ్ కావడంతో వారి స్థానంలో 27 మంది గ్రూప్-4 అధికారులను వార్డు అధికారులుగా నియమించామన్నారు. అయితే డివిజన్‌లలో వార్డు అధికారుల పాత్ర చాలా కీలకమని అన్నారు. 2022 సీడీఎంఏ ఆదేశాల ప్రకారం వార్డు అధికారులు పన్నుల వసూళ్లకే కాకుండా శానిటేషన్, పెన్షన్, ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన విధులు కూడా నిర్వర్తించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. పన్నుల వసూళ్లలో అనుకున్న విధంగా పురోగతి లేదని, ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు సమన్వయంతో కలిసి పనిచేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, పన్నుల అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఆర్‌వోలు శ్రీనివాస్, షహజాదీ బేగంతో పాటు అధికారులు పాల్గొన్నారు.

యాప్‌లో సమాచారం నమోదుకు శిక్షణ ఇవ్వండి

యాప్‌లో సమాచార నమోదుకు శానిటేషన్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని డబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. మునిసిపల్ ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ సెంటర్‌ను సందర్శించి అక్కడి సిబ్బందితో కమిషనర్ మాట్లాడారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (ఎస్‌డబ్ల్యూఎం) జీఏఎస్‌ఈ ఇంటిగ్రేషన్ మొబైల్ అప్లికేషన్ యాప్‌కు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. 26, 29 డివిజన్‌లను పైలెట్ ప్రాజెక్టుల కింద ఎంపిక చేసి ఆయా డివిజన్‌లలో పని చేసే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్‌లకు ప్రత్యేక శిక్షణతోపాటు పూర్తి అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం ఐసీసీసీ పనితీరును అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీసీసీ ఇన్‌చార్జి తేజస్వీ, ఐసీసీసీ సిబ్బంది నర్సింహ, నరేష్, రాజారెడ్డి పాల్గొన్నారు.



వార్డు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్



రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

విద్యార్థులు లక్ష్యం కోసం పట్టుదలతో చదవాలి

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

పరకాల, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి తాము ఎంచుకున్న లక్ష్యం కోసం పట్టుదలతో చదవి విజయం సాధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం పరకాలలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని తరగతి గదులు, కిచెన్, డార్మెటరీ, భోజన పదార్థాలను పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థినులను పాఠ్యాంశాలకు సంబంధించి పదో తరగతి గదిలోని బోర్డుపై రాయించారు. విద్యార్థినుల అభ్యసన, పఠన సామర్థ్యం తక్కువగా ఉందని అభ్యసన సామర్థ్యం పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అదే విధంగా పరకాలలో ఉన్న గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి వసతులు, విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో ఆంజనేయులు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందజేస్తాం..



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే 163జీ నిర్మాణంలో భూములు కోల్పోతున్న నెక్కొండ మండలంలోని తోపనపల్లి, అలంకానిపేట రైతులతో జిల్లా కలెక్టర్ సత్యశారద గురువారం కలెక్టరేట్‌లో ఆర్బిట్రేషన్ నిర్వహించారు. భూములు కోల్పోయిన రైతులకు అవార్డు పాస్ చేసేందుకు ఆర్బిట్రేషన్ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్ రాజ్‌కుమార్, కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ అడిషినల్ ఎస్పీ లియాఖత్ అలీ మృతి



వరంగల్ క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ అడిషినల్ ఎస్పీ లియాఖత్ అలీ బుధవారం గుండెపోటుతో మరణించాడు. 1976 ఎస్సై బ్యాచ్‌కు చెందిన లియాఖత్ అలీ స్వస్థలం కరీంనగర్ కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసి హనుమకొండలో స్థిరపడ్డాడు. 2010లో ఉద్యోగ విరమణ చేసిన ఆయన.. కొంతకాలంగా అనారోగ్యానికి గురై హైద్రాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. ఈ సందర్భంగా పలువురు రిటైర్డ్ పోలీసు అధికారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు లియాఖత్ అలీ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడి మృతి

చెన్నారావుపేటలో విషాదం

చెన్నారావుపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంలో భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం వెలుగు చూసింది. ఎస్సై రాజేశ్‌రెడ్డి, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన చీర బోయిన రాజు(30) అనే యువకుడు భవన నిర్మాణాలలో సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు వారి మాదిరిగానే రాజు బుధవారం మండలంలోని ఖాదర్‌పేట గ్రామానికి చెందిన పెండ్లి ఐలయ్య నూతన ఇంటి నిర్మాణ పనుల సెంట్రింగ్ కర్రను కొట్టేందుకు వెళ్లాడు. ఐలయ్య ఇంటి సమీపంలోనే 11 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయి. ఇంటికి సెంట్రింగ్ కొడుతున్న క్రమంలో రాజు చేతిలో ఉన్న ఇనుప తీగ (బైడింగ్ వైర్) ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలను తగిలింది. దీంతో రాజు విద్యుత్ షాక్‌తో భవనం పైనుంచి కింద పడడంతో తల పగిలిబలమైన గాయమైంది. గమనించిన తోటి కార్మికులు నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.



రాజు (ఫైల్)

పరిస్థితి విషయంగా ఉండటంతో వెంటనే వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. కాగా, ఇంటి యజమాని ఐలయ్యకు విద్యుత్ లైన్ ఎల్‌సీ తీసుకోమని పలుమార్లు చెప్పామని, యాజమని ఎల్‌సీ తీసుకోకపోవటం వలనే విద్యుత్ ప్రమాదం జరిగిందని, ఇంటి యజమానిపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలిలించారు. కాగా, విద్యుత్ షాక్‌తో మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుడి కుటుంబాన్ని యజమాని ఆదుకోవాలని మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి మాట్లాడుతూ కుటుంబ యాజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సమాజ ఉన్నతికి రాము ఆలోచనలు దోహదం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మృగ్యమవుతున్న మానవీయ విలువలను కాపాడేందుకు తక్కళ్లపల్లి వెంకటరామ నర్సింహరావు (రాము) ఆలోచనా దృక్పథం ఎల్లప్పుడూ దోహదం చేస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ రాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయంలో కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, మార్నేని ఉదయభానురావులు అధ్యక్షులుగా వ్యవరించిన రాము 3వ వర్ధంతి సభలో రాము చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై రాము ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని కొనియాడారు. మాజీ మంత్రి తక్కళ్ళపల్లి పురుషోత్తమరావు తనయుడిగా, కాంగ్రెస్ నేతగా అనేక మందికి పేదలకు సహాయ సహకారాలు అందించారని గుర్తు చేశారు. ప్రతీ ఆదివారం హంటర్‌రోడ్డులోని తన స్వగృహంలో తెలంగాణ జనవేదిక సదస్సులు నిర్వహించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మహోన్నత వ్యక్తిని, గొప్ప రాజకీయ నేతను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎస్.లక్ష్మీప్రసాద్, మాజీ డిప్యూటీ మేయర్ అశోక్‌రావు, ప్రభాకర్‌రావులు మాట్లాడుతూ.. తక్కళ్ళపల్లి రాము సమాజంలో అన్నిపార్శ్వాలను స్పృశిస్తూ ప్రతీ ఆదివారం తెలంగాణ జనవేదిక సదస్సులు నిర్వహించారని చెప్పారు. కార్యక్రమంలో కొట్టే భాస్కర్, రాము కుమారుడు తక్కళ్ళపల్లి శ్రీకరణ్ రావు, విక్రమ్‌రెడ్డి శిరీశ్‌రెడ్డి, ముంద్రాతి సురేశ్, రాజన్న, క్రాంతికుమార్, డాక్టర్ వంగాల సుధాకర్, డాక్టర్ ఎడ్ల ప్రభాకర్ కత్తి వెంకటస్వామి, ప్రొఫెసర్ రామేశ్వరం, ఆకుల యాకుబ్, ప్రొఫెసర్ సంజీవరెడ్డి, డాక్టర్ తిరుణ హరి శేషు, వరయోగి, అడ్వకేట్ గౌతమ్, స్కాలర్స్ కల కోట సుమన్, డాక్టర్ మట్టెడ కుమార్‌తో పాటు మేధావులు, కార్మిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ఆహ్వానపత్రం ఆవిష్కరణ

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఈ నెల 21న వైభవంగా జరిగే తొలినాటి బతుకమ్మ వేడుకలతోపాటు 22వ తేదీ నుంచి ఆలయ ప్రాంగణంలో జరిగే దేవీశరన్నవ రాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహింపజేస్తామని, దీనికి ప్రభుత్వ శాఖలన్నీ సహకరించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఈవో అనిల్‌కుమార్‌తో కలిసి ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ ప్రాంగణంలో తొమ్మిది రోజులపాటు శోభాయమానంగా విద్యుత్ దీపాల అలంకరణ, పారిశుధ్య ఏర్పాట్లు, అన్నదాన కార్యక్రమంతోపాటు ప్రతీరోజు సాయంత్రం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. లోక కల్యాణార్థం ప్రతీరోజు వేద పండితుల సమక్షంలో చండీహోమం నిర్వహింపజేస్తామని చెప్పారు. మునిసిపల్, కుడా, పోలీసు, టూరిజం, సాంస్కృతిక, వైద్యశాఖల సమన్వయంతో ఉత్సవాలకు సహకరించాలని కోరారు. గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. ప్రతినిత్యం అమ్మవారికి ఉపచార పూజలు, సీఎంఆర్ షాపింగ్ మాల్ వారి సహకారంతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈవో అనిల్ కుమార్ మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ పక్షాన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామని, తొలినాటి బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షులు బత్తిని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కోన శ్రీకర్, రవీందర్‌రెడ్డి, పులి రజనీకాంత్, రావుల ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వానపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తదితరులు

గంజాయి రవాణాదారులకు పదేళ్ల జైలు

నలుగురికి శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా

వరంగల్ లీగల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎండు గంజాయి కొనుగోలు చేసి రవాణా చేస్తున్న నలుగురిపై నేరం రుజువైనందున ఒక్కొక్కరికి పదేళ్ల కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ హనుమకొండ మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కం ఎన్‌డీపీఎస్ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి బి.అపర్ణాదేవి గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

2017 జనవరి 16న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో హసన్‌పర్తి పోలీసులు మల్లారెడ్డిపల్లి గ్రామశివారులో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో రామకృష్ణాపురం వైపు మోటారు సైకిల్‌పై ఇద్దరు వాహనం మధ్యలో బస్తా సంచి పెట్టుకొని వస్తున్నారు. పోలీసులను గమనించిన నిందితులు బస్తాను పడేసి పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని పట్టుకొని విచారించారు. బస్తా సంచిలో గంజాయి తీసుకొని వెళ్తున్నట్లు పోలీసులకు తెలిపారు. విచారణలో శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన నరిగె రాజయ్య, గంగిరేణిగూడెం సూర్యానాయక్ తండాకు చెందిన లావుడ్య భద్రమ్మ, మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దువ్వటి మల్లయ్య ముగ్గురు కలిసి మల్లారెడ్డి గ్రామానికి చెందిన బోళ్ల ఐలయ్య, దాసరి కుమారస్వామి వద్ద కిలో రూ. వెయ్యి చొప్పున గంజాయి కొనుగోలు చేసి అధిక రేటుకు విక్రయించడానికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

దీంతో పోలీసులు నిందితులు ఐదుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో ఉండగా మొదటి నిందితుడు నరిగె రాజయ్య మృతి చెందడంతో మిగతా నలుగురిపై విచారణ జరిపి నేరం రుజువైనందున నిందితులకు పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ వలబోజు రవీందర్ సాక్షులను ప్రవేశపెట్టగా లైజన్ అధికారిగా ఏఎస్సై కె.పరమేశ్వరి, సీఐలు వి.చేరాలు, పి.కిషన్ దర్యాప్తు అధికారులుగా వ్యవహరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

పరామర్శకు వెళ్లొస్తూ.. తనువు చాలించిన వృద్ధురాలు

వర్ధన్నపేటలోని డీసీ తండా వద్ద ఘటన

కుమారుడికి తీవ్రగాయాలు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చావింటికి వెళ్లి, తిరిగి తమ ఇంటికి వెళ్తుండగా ఆ వృద్ధురాలిని మృత్యువు కబలించింది. ద్విచక్ర వాహనాన్ని ఆయిల్ ట్యాంకర్ వెనక వైపున తాకడంతో లారీ వెనక టైర్ల కింద పడి వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందగా, కొడుకుకు తీవ్రగాయాలు కాగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని కమ్మెన పెల్లి తండాకు చెందన గుగులోతు రేషమ్మ (56) ఆమె భర్త నాను, పెద్ద కుమారుడు తుకారాం, చిన్న కుమారుడు వెంకన్నలతో కలిసి తెట్టేకుంట తండాలో చావింటికి హాజరై, తిరిగి ఇంటికి వెళ్తున్నారు. రేషమ్మ ఆడబిడ్డ ఇస్లావత్ దస్లీ అనారోగ్యంతో చనిపోగా రెండో రోజు కార్యక్రమంలో పాల్గొని ఇంటికి వెళ్తున్నారు.

ఈ క్రమంలో పెద్ద కుమారుడైన తుకారం టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనంపై తల్లి రేషమ్మ, చిన్న కుమారుడు వెంకన్న వాహనంపై నాను వెళ్తున్నారు. వెంకన్న వాహనం ముందు వెళ్తుండగా, వెనక తుకారం వాహనం వస్తోంది. ఈ క్రమంలో డీసీ తండా దుర్గమ్మ గుడి సమీపంలో ఉన్న వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై మూలమలుపు వద్ద తొర్రూరు నుంచి వరంగల్ వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకర్ తుకారాం వాహనానికి వెనక నుంచి అదుపు తప్పి ఢీకొంది. ఈ ఘటనలో లారీ వెనక టైర్లు వృద్ధురాలిపైనుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తుకారాంకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట అదనపు ఎస్‌ఐ మేరుగు రాజు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వర్ధన్నపేట మార్చురీకి తరలించాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగిస్తామని తెలిపారు.



ఘటనాస్థలంలో మృతి చెందిన రేషమ్మ, గాయపడిన తుకారాం



పోస్టుమార్టం గది వద్ద నేలపై నుంచి వెళ్లిన సర్వీస్ వైరు

విద్యుత్ అధికారులు.. మీకిది తగునా..!

వివిధ కారణాలతో చనిపోయిన మృతదేహాలను తీసుకువచ్చే వర్ధన్నపేట సంగెపు వాగు వద్ద ఉన్న పోస్టుమార్టం గది వద్ద విద్యుత్ సరఫరా విషయంలో ఇబ్బందిగా మారింది. ఎన్నిసార్లు విద్యుత్ శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని పోస్టుమార్టం నిర్వాహకులు చెపుతున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం చేసి భద్రపరిచే గది ఎదుట కరెంటు సరఫరా అయ్యే ప్రధాన సర్వీసు వైరు నేలపై సప్లయ్ కావడంతో బాధిత కుటుంబాలను భయాందోళనకు గురిచేస్తోంది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక స్తంభాన్ని ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నారు.

క్రీడల ద్వారా మానసికంగా బలోపేతమవ్వాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిత్యం పనిఒత్తిడిలో ఉండే విద్యుత్‌శాఖ సిబ్బంది క్రీడలద్వారా పని ఒత్తిడిని తగ్గించుకొని మానసికంగా దృఢంగా కావాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. గురు వారం జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో ట్రాన్స్‌కో స్పోర్ట్స్ కౌన్సిల్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ట్రాన్స్ కో, డిస్కంల ఇంటర్ సర్కిల్ చెస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను సీఎండీ వరుణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారై వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో సీఈ శ్రీరాంకుమార్, ఎస్‌ఈలు నారాయణరెడ్డి, గౌతంరెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ నీలం జగన్నాథ్, స్పోర్ట్స్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ చంద్రప్రకాశ్, జాయింట్ సెక్రటరీ రాజిరెడ్డి, కోశాధికారి మోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

కర్షకుడి ట్రిక్.. కష్టానికి చెక్

(5వ పేజీ తరువాయి)

తీవ్ర భారం కావడం, సమయం వృధా అవుతుండడంతో వినూత్న ఆలోచన చేశాడు.

రూ. 15 వేలతో తయారీ...

రైతు ఇస్లావత్ బాలు తన మోటారు పాడైపోవడంతో పర్వతగిరికి ఓసారి వెళ్లాడు. అక్కడే ఉన్న బైక్ మెకానిక్ వద్ద ఆగి మాట్లాడుతుండగా, వాషింగ్ మోటారుతో ద్విచక్ర వాహనాన్ని కడిగే తీరును గమనించాడు. దీంతో అప్పుడే తనకో ఆలోచన వచ్చింది. పోర్టబుల్ పవర్ స్ప్రెయింగ్ పంపు తెచ్చుకుని, దాంతో పాటు షాపులో 50 మీటర్ల పైపును సైతం కొన్నాడు. మొత్తం రూ.15 వేలు ఖర్చు చేశాడు. డ్రమ్ములో ఒకేసారి ఎకరానికి సరిపడా నీటిలో మందు కలిపి, ఈ పంపు ద్వారా 50 మీటర్ల పైపు వాడుతూ ఒకేసారి ఎకరం పొలానికి మందు పిచికారీ చేస్తున్నాడు. పెట్రోల్‌తో నడిచే ఈ పంపు అరగంటకు ఎకరానికి పైగా మందు పిచికారీ చేస్తోంది. ఒక రోజుకు దాదాపు 20-30 ఎకరాల వరకు మందు పిచికారీ చేయవచ్చని చెపుతున్నాడు. ఇప్పటికే పక్కన ఉన్న రైతులకు సైతం ఎకరానికి రూ.500 చొప్పున తీసుకుని పిచికారీ చేస్తున్నట్లుగా వివరించాడు. రైతుల భుజాలపై భారం లేకుండా ఈ విధానం బాగా పనిచేస్తోందని చెబుతున్నాడు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7440	5300
మక్కలు	2188	1521
కందులు	5782	3022
పెసళ్లు	5350	3022
పల్లికాయ (సూక)	6810	3500
పల్లికాయ (పచ్చిది)	4130	2400
పసుపు (కాడి)	10659	7889
పసుపు (గోల)	10009	8996
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	-	-
వండర్‌హాట్ ఏసీ	16000	12000
యూఎస్341ఏసీ	14500	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

దామెర చెరువుపై నిర్లక్ష్యమేల?

- 6 నెలలుగా తెరుచుకోని ప్రధాన తూము
- రెండో తూము నుంచి వృథాగా పోతున్న నీరు
- మునుగుతున్న పంటలు.. నష్టపోతున్న రైతులు
- కోతకు గురై చెట్లు, పొదలతో నిండిన కట్ట
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు, పాలకులు



దామెర చెరువు కట్టను కమ్మేసిన చెట్లు

కరీమాబాద్(వరంగల్), సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నీటి పారు దల శాఖ అధికారుల నిర్లక్ష్యం అక్కడి రైతులకు శాపంగా మారింది. ఆర్నెల్లుగా తూము తెరుచుకోకున్నా పట్టించుకున్న నాథులే లేరు. వర్షాలతో కట్ట.. కోతకు గురవుతూ ప్రమాదకరంగా మారుతున్నా, చెట్లు పొదలతో చిట్టడవిని తలపిస్తున్నా చర్యలు కానరావడం లేదు. ఇది ఖిలా వరంగల్ మండల పరిధిలోని దామెర చెరువు దుస్థితి.

నగర పరిధిలో వున్న దామెర చెరువు కింద దాదాపు 250 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇక్కడ రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన రైతులు వరి సాగు చేస్తున్నారు. చెరువు ఒక్కసారి నిండితే రెండు పంటలు గ్యారెంటీ. ఈ చెరువుకు రెండు తూములు వున్నాయి. ఇందులో ఒకటి తూర్పు తూము కాగా, మరొకటి గణేశుడి తూము. ఆయకట్టు సాగుకు తూర్పు తూమే ప్రధానమైనది. యాసంగి సీజన్ నుంచే ఇది తుప్పు పట్టి తెరుచుకోకుండా మొరాయిస్తోంది. వానాకాలం సీజన్‌లో రైతులు నార్లు పోసి వరినాట్లు వేసుకునే దశలోనూ ఇది తెరుచుకోలేదు. దీంతో గణేశుడి తూము నుంచి లీకయ్యే నీటినే రైతులు సాగుకు ఉపయోగించుకుంటున్నారు.

వరుస వర్షాలతో ప్రస్తుతం చెరువు పూర్తిగా నిండింది. ప్రధాన తూముకు మరమ్మతులు చేయించాలని స్థానిక రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు అనేకమార్లు విన్నవించారు. అయితే తూమును రిపేరు చేయాలంటే గజ ఈతగాళ్ల అవసరమని, వారు తమకు దొరకడం లేదని, మీరే తెచ్చుకోండని అధికారులు ఉచిత సలహా ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని తీసుకువస్తామని అధికారులు చెప్పారని, ఈ విషయంలోనూ శ్రద్ధ పెట్టడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. 'గణేశుడి తూము లీకేజీతో కట్టకు దగ్గరగా వున్న వరి పొలాలు నీట మునుగుతున్నాయి. అలాగే పలువురు రైతుల పొలాలు బుడుగులా మారి సాగుకు పనిరాకుండా పోతున్నాయి... 24 గంటలు నీళ్ల వృథాగా బయటకుపోతున్నాయి..' అని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఇరిగేషన్ అధికారులు స్పందించి ప్రధాన తూము మరమ్మతులు చేపట్టి, పంట కాల్వలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా చెరువు కట్ట

దామెర చెరువు ప్రధాన తూము పరిస్థితి ఇలా ఉంటే, చెరువు కట్టను ఎవరూ పట్టించుకోవడం లేదు. వరుస వర్షాలతో కట్ట రెండు చివరలా కోతకు గురైందని, దీంతో కట్ట పరిస్థితి ప్రమాదకరంగా మారిందని రైతులు తెలిపారు. ఈ కట్ట తెగితే నగరానికి పెను ప్రమాదమని వారు చెబుతున్నారు. ఇక కట్టపైన చెట్లు, పొదలు విపరీతంగా పెరిగాయి. బయటనుంచి చూస్తే కట్ట ఏ మాత్రం కనిపించడం లేదు. కట్టపైకి వెళ్లడానికి కనీసం దారికూడా లేకుండా పోయింది. కట్ట పటిష్టతను, శుభ్రతను ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని స్థానిక రైతు, రిటైర్డు జైలర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

పదేళ్ల కిందట రూ.అర కోటి ఖర్చు

ఇప్పటి మంత్రి కొండా సురేఖ 2015లో ఎమ్మెల్యేగా వున్నప్పుడు 'మిషన్ కాకతీయ'లో భాగంగా చెరువు పునరుద్ధరణ పనుల పేరుతో రూ.53 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో అప్పుడు కట్ట మరమ్మతు పనులు చేశారు. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు చెరువుకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని రైతులు తెలిపారు. ఇరిగేషన్ అధికారుల ఆదరణకు నోచుకోకుండా పోతున్న దామెర చెరువుపై స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ మళ్లీ దృష్టి సారించాలని, అలాగే చెరువు వద్దకు వెళ్లే దారి పూర్తిగా బురదమయంగా మారినందున, మసీదు బండ నుంచి కట్ట వరకు రోడ్డు నిర్మాణానికి నిధులివ్వాలని నీటి వినియోగ దారుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసమూర్తి కోరారు.

పర్యాటక అవకాశాలు

దామెర చెరువును జక్కలొద్ది సమీపంలోని దామెరగుట్టలు, బోడగుట్టకు మధ్య నిర్మించారు. ఇది కాకతీయుల నాటి గొలుసుకట్టు చెరువుగా చెబుతారు. వందలాది ఎకరాల్లో విస్తరించిన ఈ చెరువు.. అనేక దశాబ్దాలుగా అటు వ్యవసాయదారులు, ఇటు మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తోంది. నగరానికి సమీపంలో ఉండటంతో భవిష్యత్తులో దీనిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 'కుడా' అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వాటర్ స్పోర్ట్స్‌కు అనువుగా తీర్చిదిద్దాలని యోచిస్తున్నారు. కాకతీయుల కాలం నాటి భారీ వినాయక రాతి విగ్రహం ఈ చెరువుకు ప్రధాన ఆకర్షణ. అలాగే చెరువుకు ఇరువక్కలా వున్న గుట్టల్లో ఆదిమానవులు సంచరించిన ఆనవాళ్లు, జైనుల సంస్కృతికి సంబంధించిన ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. ఈ చెరువు నగరానికి చేరువలో ఉండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన స్విమ్మర్లు ఇక్కడి స్వచ్ఛమైన నీటిలో నిత్యం ఈత కొడుతుంటారు. అటు వ్యవసాయానికి, ఇటు పర్యాటకానికి అనువుగా వున్న దామెర చెరువు పరిరక్షణకు చర్యలు చేపట్టాలని రైతులు, పర్యాటక ప్రేమికులు కోరుతున్నారు.



దామెర చెరువులో పనిచేయని ప్రధాన తూము ఇదే..

అరచేతిలో వ్యవసాయం

- వాట్సాప్ చానల్ క్రియేట్ చేసిన వ్యవసాయశాఖ
- రైతులకు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు
- నూతన సాంకేతికత, పరికరాల సమాచారం



వరంగల్ వ్యవసాయం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సులభంగా, త్వరగా రైతులకు చేరవేసేందుకు వ్యవసాయ శాఖ వాట్సాప్ చానెల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రస్తుత రోజుల్లో ప్రతీ రైతు వద్ద ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ ఉంటోంది. సంబంధిత మండల వ్యవసాయశాఖ అధికారులను సంప్రదిస్తే ఆ చానల్‌లో రైతులను చేరుస్తారు. దీని ద్వారా వ్యవసాయంలో కాలానుగణంగా వస్తున్న మార్పులను, మెళకువలను ఎప్పటికప్పుడు రైతులకు అందిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, అధిక ఆదాయాన్ని పొందేందుకు సలహాలు, సూచనలు అందిస్తారు. అంతేగాకుండా పంటల దశను బట్టి, వాతావరణ పరిస్థితులను బట్టి వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు కావాల్సిన సమాచారాన్ని అందజేస్తారు. ఇప్పటికే వరంగల్ జిల్లాలోని వ్యవసాయశాఖ అధికారులు ఈ వాట్సాప్ చానెల్‌లో లాగిన్ అయ్యారు. తొలుత ప్రతీ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) 100 మంది రైతుల సెల్‌ఫోన్లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలని వ్యవసాయశాఖ అధికారులు ఆదేశించారు.

రైతులకు లభించే సమాచారం

- ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ వివరాలు.
- పంటల సంరక్షణ కాలానుగుణ సూచనలు.
- వాతావరణ హెచ్చరికలు, కీటక నియంత్రణ మార్గదర్శకాలు.
- మార్కెట్ ధరలు, శిక్షణా కార్యక్రమాలు.
- రైతు నేస్తం కార్యక్రమాల షెడ్యూల్
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో నేరుగా సమావేశాలు.

రైతులకు ఎంతో మేలు

కె. అనురాధ, డీఏవో



ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ చానెల్ రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. సెల్‌ఫోన్‌లో సమస్త సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా దీన్ని రూపొందించారు. పంట పరిస్థితి. దానికి కావాల్సిన ఎరువులు, క్రిమి సంహారక మం దులు ఎలా వాడాలో తెలుసుకునే అవకాశం ఉంటుంది. అధిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా అధికారులు, శాస్త్రవేత్తలు తగు సూచనలు ఇస్తారు.

వాట్సాప్ చానెల్‌తో ఉపయోగం

ఆర్. శ్రీనివాస్, రైతు, మొగిలిచర్ల



పంట దిగుబడి అధికంగా రావాలని విచ్చలవిడిగా ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడుతున్నారు. దీంతో సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దిగుబడి తగ్గిపోతోంది. వ్యవసాయశాఖ కొత్తగా తీసుకు వచ్చిన వాట్సాప్ చానెల్‌తో సెల్‌ఫోన్‌లోనే అన్ని విషయాలు తెలుసుకునే అవకాశం ఉంది. గతంలో మాదిరిగా వ్యవసాయశాఖ అధికారుల వద్దకు వెళ్లి సమస్యలను చెప్పుకునే అవస్థలు ఇప్పుడు తప్పింది. దీంతో రైతులకు సమయం కలిసి వస్తుంది. సాగులో ఖర్చు తగ్గి అధిక దిగుబడి, ఆదాయాన్ని పొందేందుకు వీలుపడుతుంది.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, ట్రస్మా బాధ్యులు

ప్రైవేటు టీచర్ల సమస్యలు పరిష్కరిస్తా..

- ఉపాధ్యాయ వృత్తి ఆదర్శనీయమైనది..
- విద్యారంగంలో వారి పాత్ర కీలకం
- నాణ్యమైన విద్యను అందించాలి
- ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

కరీమాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గురువారం వరంగల్ ఉర్సుగుట్ట బైపాస్ రోడ్డులో గల నాని గార్డెన్స్‌లో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) ఆధ్వర్యంలో ప్రైవేటు ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముఖ్య అతిథిగా వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఆదర్శనీయమైనదని, విద్యారంగాన్ని పటిష్ట పరచడంలో ప్రైవేటు విద్యాసంస్థలు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, భావితరాలకు నాణ్యమైన విద్యను అందించాలని అన్నారు. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డితో విద్యారంగంపై చర్చ జరిగిందని, విద్యావంతులతో నిర్వహించిన సమావేశం అనంతరం తెలంగాణలో డిసెంబరు 9న విద్యా రంగంపై నూతన పాలసీని తీసుకురాబోతుందని తెలిపారు. సుమారు 60లక్షల మంది విద్యార్థులు పదవ తరగతిలో అభ్యసిస్తున్నారని అన్నారు. తాను ఉద్యోగంలో ఉన్న సందర్భంలో 35లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో ఉంటే, 25లక్షల మంది ప్రైవేటు పాఠశాలల్లో ఉండేవారని, ప్రస్తుతం అన్ని రకాల గురుకుల పాఠశాలల్లో చూసినట్లైతే 23లక్షలు, జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో 17లక్షల మాత్రమే విద్యను అభ్యసిస్తున్నారని, మిగితా విద్యార్థులంతా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు.

దీన్ని బట్టి విద్యారంగానికి ప్రైవేటు విద్యా వ్యవస్థ ఎంతో దోహద పడుతుందన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అదేవిధంగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారికి ఉచిత చికిత్స పాలసీ, హెల్త్ కార్డులను అందించేలా చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాశెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారి దండపంతుల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఠాణాలు ఎప్పుడో..?!

(5వ పేజీ తరువాయి)

మరిన్ని పోలీస్‌స్టేషన్లు అవసరంగా గుర్తించారు. 2018లోనే ములుగు జిల్లా మేడారంలో పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించారు. మేడారంలో నిత్యం పూజలు జరుగుతుండటంతో పాటు వేలాది మంది భక్తులు రోజు వస్తుండటంతో ఇక్కడ ప్రత్యేక పోలీస్‌స్టేషన్ అవసరంగా గుర్తించి ప్రతిపాదనలు పంపించారు. పోలీస్‌స్టేషన్ నిర్మాణం కూడా పూర్తి చేశారు. కానీ, ఇప్పటి వరకు సిబ్బంది కేటాయింపులు చేసి, స్టేషన్ ప్రారంభించలేదు. దీంతో ప్రస్తుతం రిజర్వుడు పోలీసులకు షెల్టర్‌గా మారింది.

ఇక ములుగు జిల్లా వెంకటాపురం మండలం అలుబాకలో కూడా పోలీస్‌స్టేషన్ కోసం 2018లోనే ప్రతిపాదనలు చేశారు. చత్తీస్‌గడ్‌కు సరిహద్దులో ఉండటంతో మావోయిస్టుల ఉనికితోపాటు గంజాయి లాంటి అక్రమ దందాను అరికట్టేందుకు అలుబాక స్టేషన్ అవసరంగా గుర్తించి చేసిన ప్రతిపాదనలు ఏడేళ్లుగా కాగితాల్లోనే మూలుగుతున్నాయి. అలాగే వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నడికూడ గ్రామాన్ని 2018 ఆగస్టు 27న నూతన మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. అయితే కొత్త మండలానికి పోలీస్‌స్టేషన్‌ను ఇవ్వలేదు. ఏడేళ్లుగా పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలోనే కొనసాగుతోంది. దీంతో శాంతిభద్రతల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోంది.

తాజాగా వరంగల్ నగరంలో కొత్తగా రెండు పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపించారు. సుబేదారి, మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధి ఎక్కువగా ఉండటంతో పునర్విభజన చేసి మరో రెండు కొత్త పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. ఇవీ కూడా అమలుకు నోచుకోలేదు. దీంతో నగరంలో శాంతిభద్రతల బాధ్యతలు ఖాకీలకు భారంగా మారుతున్నాయి. దొంగతనాలు, గంజాయి స్మగ్లింగ్, అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు..

కొత్తగా జిల్లాలు ఏర్పడటం.. నగరం భారీగా విస్తరిస్తుండటంతో జనాభా సైతం భారీగా పెరుగుతోంది. దీంతో రహదారులు జామ్ అవుతున్నాయి. వరంగల్ నగరంలో కాజీపేట, హనుమకొండ, వరంగల్‌లోనే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. వీటితో పాటు కేయూ పరిధిలో మరో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఇప్పటికే అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేశారు. హసన్‌పర్తి, ఎల్కతుర్తి వరకు నగరంలో కలిసిపోయింది. వడ్డెపల్లి, హనుమకొండ ఆర్టీసీ డిపో ఏరియా మొత్తం కూడా కాజీపేట ట్రాఫిక్ పరిధిలో ఉండటం పోలీసులపై భారం పడుతోంది. కాజీపేట నుంచి మడికొండ, పెద్దపెండ్యాల నుంచి స్టేషన్ ఘన్‌పూర్ వరకు నగరం విస్తరిస్తుంది. ఈ క్రమంలో కాజీపేట ట్రాఫిక్ సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. ఈ క్రమంలో కేయూ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఏడేళ్ల కిందట చేసిన ప్రతిపాదనలకు మోక్షం లభించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అలాగే కొత్తగా మిల్స్‌కాలనీ స్టేషన్ పరిధిలో కూడా మరో ట్రాఫిక్ స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. మామునూరు ఎయిర్‌పోర్టుతో పాటు కాకతీయ టెక్స్‌టైల్ పార్కు విస్తరిస్తుండటంతో ట్రాఫిక్ భారీగా పెరుగుతోంది. ఈ ప్రాంతం లో కూడా మరో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టాలని నగరవాసులు కోరుతున్నారు. ఇక కొత్తగా ఏర్పడిన భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేయాలని 2019లోనే ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారు. భూపాలపల్లిలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కోసం 2020లోనే స్థల సేకరణ కూడా చేశారు. ఇప్పటివరకు కొత్త జిల్లాల్లో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఊసే లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హోం శాఖ మంత్రిగా ఉండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లా లో ఏర్పాటు చేయాల్సిన నూతన ఠాణాలు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లపై అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకురావటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

స్థాయి పెంచరు.. సిబ్బందిని ఇవ్వరు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరత వేధిస్తోంది. సెలవు పెట్టాలన్న పోలీసులకు నిరీక్షణ తప్పటం లేదు. ప్రధానంగా కొత్త పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసినప్పుడు ఎఫ్ గ్రేడ్ కేటగిరీలో సిబ్బంది నియమిస్తారు. ఎఫ్ కేటగిరీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై, ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ కలిపి మొత్తం 28మంది ఉండాలి. అయితే ఇటీవల కొత్తగా భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం ఏర్పాటు చేశారు. ఈ మండల పోలీస్‌స్టేషన్‌లో ఒక ఎస్సై, మరొకరు సెంకడ్ ఎస్సైతో పాటు ముగ్గురు హెడ్‌కానిస్టేబుల్స్, ఆరుగురు కానిస్టేబుల్స్, ఒక మహిళ కానిస్టేబుల్‌ను నియమించారు. మొత్తం 12మంది మాత్రమే గోరికొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. 28మంది సిబ్బంది చేయాల్సిన పనిని 12మందితో చేయిస్తున్నారు. దీంతో సెలవు పెట్టే అవకాశం పోలీసులకు దొరకటం లేదు.

అలాగే ఈ కేటగిరి పోలీస్‌స్టేషన్‌లో 45మంది, డీ కేటగిరి స్టేషన్‌లో 55మంది సిబ్బంది డ్యూటీస్ చేయాల్సి ఉంటుంది. అయితే ఏళ్ల తరబడి ఏ పోలీస్‌స్టేషన్ స్థాయిని కూడా పెంచటం లేదు. ఏ కేటగిరిలో ఉన్న సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించటం లేదు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీ స్‌స్టేషన్లలో పోలీసులకు సెలవులు బంగారమయ్యా యి. పండుగలు, పబ్బాలుకు కూడా సెలవుల కోసం నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి సారించి కొత్త ఠాణాలతో పాటు నగరాల్లో కొత్త ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయటంతో పాటు పోలీస్‌స్టేషన్ల స్థాయిని పెంచి సిబ్బంది నియామకం చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

సహకారం.. సంక్షేమం..

- అన్నదాతల సేవలో తరిస్తున్న ముల్కనూర్ సహకార బ్యాంకు
- ఏటా రూ.410 కోట్ల వ్యాపార లావాదేవీలు
- రైతులకు రూ.250 కోట్ల రుణాలు
- నేడు ముల్కనూర్ బ్యాంకు 69వ వార్షిక మహాసభ



ముల్కనూర్ సహకార బ్యాంకు వరి విత్తనాలు

భీమదేవరపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలకు ముందే ముల్కనూర్ సహకార బ్యాంకు వివిధ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి మార్గదర్శకంగా నిలుస్తోంది. విత్తనం నాటే దగ్గరి నుంచి ధాన్యం కొనుగోలు చేసే వరకు అన్నదాతకు అండగా ఉంటుంది. పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించడంతో పాటు ధాన్యాన్ని అమ్మితే వచ్చిన లాభాలను రైతులకే బోనస్ రూపంలో చెల్లించడం ఇక్కడి ఆనవాయితీ. 20 ఏళ్లలో దాదాపుగా రూ.100కోట్ల రాయితీలను అందించింది. ఎన్నో రాష్ట్రస్థాయి అవార్డులతో పాటు జాతీయ ఉత్తమ సహకార సంఘంగా ఎన్నికైంది. దేశ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ముల్కనూర్ బ్యాంకు ఉపాధ్యక్షుడిగా పనిచేసి చనిపోయేంత వరకు బ్యాంకు సభ్యుడిగా కొనసాగారు. దేశంలోని సహకార సంఘాలతో పాటు, పలు ప్రపంచ దేశాల్లోని సహకార సంఘాలకు మార్గదర్శకంగా నిలుస్తున్న ముల్కనూర్ సహకార బ్యాంకు 69వ వార్షికోత్సవం ఈ నెల 19న జరుగనుంది.



ముల్కనూర్ సహకార బ్యాంకు

రూ.410 కోట్ల వార్షిక టర్నోవర్

ముల్కనూర్ సహకార బ్యాంకు ఈ ఏడు రూ.410కోట్ల వార్షిక టర్నోవర్ చేపట్టింది. ఇందులో రూ.250కోట్లు వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలను రైతులకు అందించింది. రైతులు పండించిన పత్తి, వరి, సీడ్ వరి ధాన్యాన్ని రూ.96కోట్లతో బ్యాంకు కొనుగోలు చేసింది. ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు రూ.30కోట్ల వరకు అమ్మకాలు సాగాయి. రైతులు బ్యాంకులో 7600 మంది సభ్యులుండగా అందులో రైతులు తీసుకున్న రుణాల్లో 99శాతం రికవరీ అయ్యాయి.

రూ.10 కోట్లతో సంక్షేమ పథకాలు

ముల్కనూర్ సహకార బ్యాంకు రూ.10కోట్లతో 2024-25 సం వత్సరంలో రైతులు, వారి పిల్లలకు సంక్షేమ పథకాలు అందజేసింది. రూ.2కోట్ల బోనస్, రూ.60లక్షలు విద్యార్థుల స్కాలర్‌షిప్ లు, హెల్త్ కోసం రూ.70లక్షలు, కళ్ల ఆపరేషన్ల కోసం రూ.70 లక్షలు తదితర సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది

విత్తనాలు.. బియ్యం..

ముల్కనూర్ సహకార బ్యాంకులో నాణ్యమైన విత్తనాలను రాష్ట్రంతో పాటు చత్తీస్‌గఢ్, కర్నాటక, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాలకు వరి సన్న, దొడ్డు రకాల విత్తనాలను అమ్ముతున్నారు. ముల్కనూర్ బ్యాంకు వరి విత్తనాలంటే వివిధ ప్రాంతాల్లో హాట్ కేక్‌ల్లా అమ్ముడుపోతున్నాయి. ముల్కనూర్ బ్యాంకు రైతుల కోసం చేపట్టిన వరి సీడ్ విత్తనాలు నాణ్యంగా ఉండడంతో దాదాపుగా యేటా ఖరీఫ్, రబీ సీజన్‌లో సుమారు రూ.70 నుంచి రూ.80కోట్ల వరకు వరి విత్తనాలు అమ్ముడుపోతున్నాయి. అలాగే ముల్కనూర్ సహకార బ్యాంకు నాణ్యమైన బియ్యం అమ్ముతున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు వివిధ దేశాలకు ముల్కనూర్ బియ్యాన్ని అమ్ముతున్నారు. ఆర్ఎన్ఆర్, బీపీటీ, జైశ్రీరాం లాంటి సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు.



రైతులకు అందుబాటులో ఉన్న ఎరువుల బస్తాలు

వార్షిక సభలో సంక్షేమ పథకాలు ప్రకటిస్తాం..

అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, బ్యాంకు అధ్యక్షుడు, ముల్కనూర్



ముల్కనూర్ బ్యాంకు 69వ వార్షిక మహాసభలో రైతులకు పలు సంక్షేమ పథకాలను ప్రకటిస్తాం. రైతులకు అండగా ముల్కనూర్ బ్యాంకు నిలుస్తోంది. రైతుల సంక్షేమం కోసం అవసరానికి అనుగుణంగా అనేక కొత్త పథకాలను తీసుకొస్తున్నాం. 20 ఏళ్లలో దాదాపుగా రూ.100కోట్ల రాయితీలను ఆ రైతులకు అందించాం. భవిష్యత్‌లో రైతుకు బ్యాంకు భరోసాగా నిలిచేందుకు కృషి చేస్తున్నాం. బ్యాంకులో సీనియర్ సభ్యులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తున్నాం. గృహ, విద్య, వైద్యం కోసం రుణాలు అందిస్తున్నాం.

వరంగల్ మీదుగా అమృత్ భారత్

- 25 నుంచి నాన్ ఏసీ వీక్లీ ఎక్స్‌ప్రెస్
- ఈరోడ్ (తమిళనాడు) వైపు మంగళవారం
- జోగ్బని (బిహార్) వైపు గురువారం అర్ధరాత్రి

గిర్మాజీపేట, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు-బిహార్ రాష్ట్రాల మధ్య సాధారణ ప్రజలు వరంగల్ మీదుగా రాకపోకలు సాగించేందుకు నూతనంగా ప్రవేశపెట్టిన ఈరోడ్-జోగ్బని నాన్ ఏసీ అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈనెల 25వ తేదీ నుంచి వరంగల్ ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ రైలు 25న ఈరోడ్(తమిళనాడు), 28న జోగ్బని(బిహార్) నుంచి ప్రారంభం అవుతుంది. ఈరోడ్-జోగ్బని అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్(16601) ప్రతి గురువారం ఉదయం 8.10 గంటలకు ఈరోడ్‌లో బయలుదేరి సాయంత్రం 4.40 గంటలకు గూడూరు, సాయంత్రం 6.58 గంటలకు ఒంగోలు, రాత్రి 9.15 గంటలకు విజయవాడ, రాత్రి 11.09 గంటలకు ఖమ్మం, గురువారం అర్ధరాత్రి(శుక్రవారం) 0.53 గంటలకు వరంగల్, శుక్రవారం ఉదయం 2.59 గంటలకు మంచిర్యాల, శనివారం రాత్రి 7 గంటలకు జోగ్బని(బిహార్)కి చేరుకుంటుంది.

అలాగే జోగ్బని-ఈరోడ్ అమృత్ భారత్(16602) వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.15 గంటలకు జోగ్బని (బిహార్)లో బయలుదేరి మంగళవారం ఉదయం 9.04 గంటలకు మంచిర్యాల, 10.58 గంటలకు వరంగల్, మధ్యాహ్నం 12.24 గంటలకు ఖమ్మం, 2.40 గంటలకు విజయవాడ, సాయంత్రం 5.03 గంటలకు ఒంగోలు, రాత్రి 7.50 గంటలకు గూడూరు, బుధవారం ఉదయం 7.20 గంటలకు ఈరోడ్ చేరుకుంటుంది. ఈ రైలుకు తెలుగు రాష్ట్రాల్లో గూడూరు, ఒంగోలు, విజయవాడ, ఖమ్మం, వరంగల్, మంచిర్యాల స్టేషన్‌లలో మాత్రమే హాల్ట్ ఉందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలులో నాన్ ఏసీ స్లీపర్ కోచ్‌లు 8, అన్ రిజర్వుడు జనరల్ కోచ్‌లు 11, దివ్యాంగుల కోచ్‌లు 2, ప్యాంట్రీకార్ 1 ఉంటుందని, ప్రయాణీకులు ఈ రైలును వినియోగించుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు.



ఈరోడ్-జోగ్బని మధ్య నడిచే అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు

నాయీ బ్రాహ్మణులు సంఘటితం కావాలి

సంఘం హనుమకొండ నగర ప్రతినిధి సుదర్శన్

వడ్డెపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నాయీ బ్రాహ్మణులు సంఘటితమై హక్కుల కోసం పోరాడాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం హనుమకొండ నగర ప్రతినిధి శ్రీరాముల సుదర్శన్ అన్నారు. గురువారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని నాయీ బ్రాహ్మణులు ఆర్థికంగా ఎదగాలని కోరారు. హనుమకొండ పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఎన్నికలు అక్టోబరు 9న హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు జంపాల ప్రభాకర్, సింగారపు శ్యామ్, యాదగిరి గురుమూర్తి, వనపర్తి రాజేంద్రప్రసాద్, దుపాకుల సూరయ్య, నాగవెల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కేంద్రాలు ప్రమాణాలు పాటించాలి

అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు కనీస ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎ.వెంకట్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా తనిఖీ కమిటీ, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులతో సమన్వయ సమీక్ష సమావేశం జిల్లా సంక్షేమ అధికారి జయంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. బాలల సంరక్షణ కేంద్రాలు వసతి పొందుతున్న బాలబాలికలకు వసతి, భోజనం కల్పించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకబోయే చర్యలు గురించి వివిధ శాఖల టోల్ ఫ్రీ నెంబర్‌లను డిస్‌ప్లే చేయాలని సూచించారు. ఈ నెల 20 నుంచి 26 వరకు జిల్లా ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల రక్షాభవన్ కో-ఆర్డినేటర్ సీహెచ్ ఆవంతి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జి అధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లి- కేయూ వంద ఫీట్ల రోడ్డు వివేక్ నగర్, అమరావతి నగర్ ప్రధాన రహదారిపై వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వివేక్‌నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మర్రి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మీసాల రమేష్‌లు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌కి విజ్ఞప్తి చేశారు. వీధి దీపాలు లేకపోవడం వల్ల నిత్యం రాత్రివేళల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నిత్యం రాత్రి వేళల్లో రద్దీ ఉంటుందని పేర్కొన్నారు. బార్‌కు పార్కింగ్ స్థలం లేక రోడ్డుపైనే మద్యం బాబులు వాహనాలను నిలుపుతున్నారని తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

సేవ, దాతృత్వానికి మారుపేరు ఆర్‌ఎస్‌ఎస్..

కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల సేవలకు, దాతృత్వానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) మారుపేరుగా నిలుస్తోందని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పేర్కొన్నారు. గురువారం కేయూ క్యాంపస్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కేయూ శాఖ నేతృత్వంలో విజయదశమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ దేశంలో ఎన్నో సేవా కార్యక్రమాలను చేస్తోందన్నారు.

ప్రధానంగా కరోనా సమయంలో ఐసోలేషన్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఔషధాలను అందచేసి వేలాదిమంది ప్రాణాలను కాపాడారని అన్నారు. నూరేళ్ల పూర్తి చేసుకున్న ఆర్‌ఎస్‌ఎస్.. ప్రజల్లో సేవ భావాన్ని పెంపొందిస్తోందన్నారు.

ఉత్సవ వక్తగా హాజరైన నిట్ ప్రొఫెసర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. 1925లో హెడ్ గేవార్ ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించి ధర్మ ప్రతిష్ఠకు నాంది పలికారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సేవకులు అయోధ్యలో శ్రీరామ మందిరం నిర్మాణం, తిరుపతి పరిరక్షణ సమితితో మత మార్పిడీని అడ్డుకుంటున్నారని చెప్పారు. 370 ఆర్టికల్ రద్దుకు కృషి చేశామన్నారు. ప్రపంచంలో ఆర్‌ఎస్‌ఎస్ అతిపెద్ద ఎన్‌జీవోగా నిలుస్తోందన్నారు. ఈ సమావేశంలో రిటైర్డు ప్రొఫెసర్ చిలుకమారి సంజీవ, సీడీసీ మాజీ డీన్, వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.దామోదర్, కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజు, ప్రొఫెసర్లు స్వర్ణలత, మమత, మంజుల, ఎం. ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం నగరంలోని పలుసబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. వడ్డెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, సిద్ధార్థనగర్, ప్రణయ్ భాస్కర్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, పీజీఆర్ గార్డెన్స్ ఏరియాలో ఉదయం 9.30నుంచి 11.30 వరకు, ఆర్‌ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలో కేఎల్‌ఎన్‌రెడ్డి కాలనీ, సుబేదారి, ఎక్సైజ్‌కాలనీ, కేడీ కాలనీ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, గోపాలపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో సమ్మయ్యనగర్, కుడా కాలనీ, శంకర్‌నగర్, ఆదర్శనగర్ ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నక్కలగుట్టలో సబ్‌స్టేషన్ పరిధిలో భవానినగర్, హౌజింగ్‌బోర్డు, కేఎల్‌ఎన్ రెడ్డి కాలనీ, సుమంగళి ఫంక్షన్‌హాల్ ఏరియాలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు, శాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని కనకదుర్గ కాలనీ, వాసవి కాలనీ, అంజనేయ టెంపుల్ హంటర్‌రోడ్డు ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రాక్టీసింగ్ ప్రభుత్వ పాఠశాలలో రెండురోజులుగా నిర్వహించిన హనుమకొండ మండలస్థాయి క్రీడాపోటీలు గురువారం ముగిశాయి. అండర్-17 బాల బాలికల వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాంశాల్లో సుమారు 200 మంది బాలబాలికలు పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ఐ మండల కార్యదర్శి ఎం.కరుణాకర్ తెలిపారు. మండలస్థాయిలో క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ఐ జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక చేస్తామన్నారు. అండర్ 14, 17 బాలబాలికలకు రెండు రోజులపాటు నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు జిల్లాస్థాయికి అర్హత సాధించడానికి హోరాహోరీగా చెమటోడ్చారు. ఈ కార్యక్రమంలో పీడీలు కె.మల్లారెడ్డి, వి.శ్రీధర్‌రావు, బి.రాణి, ఎం.మనోహర్, సిహెచ్.వెంకటేశ్వర్లు, టి.హరీష్, సీనియర్ క్రీడాకారులు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన పీఈటీలు పాల్గొన్నారు.

కాజీపేట ఐటీఐలో స్కౌట్స్‌కు వర్క్‌షాపు



కాజీపేటలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

హనుమకొండ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ప్రభుత్వ ఐటీఐలో 30 మంది విద్యార్థులతో స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందం ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఐటీఐలో స్కౌట్స్ అండ్ గౌడ్స్ శిక్షకులకు వర్క్‌షాపును కూడా నిర్వహించారు. కాజీపేట ఐటీఐ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్‌రావు పర్యవేక్షణలో జరిగిన ఈ వర్క్‌షాపునకు వరంగల్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్వయం ప్రతిపత్తితో ఎదుగుతున్న శక్తివంతమైన యువ ఉద్యమం అన్నారు. స్కౌట్స్, గైడ్స్ ద్వారా సాంకేతికత, సమర్థవంతమైన మేనేజ్‌మెంట్ మెళకువలను వినియోగించుకోవడం ద్వారా యువతలో విలువలను పెంపొందించడం, సమానత్వాన్ని పెంపొందిస్తుందన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ పశ్చిమ అధ్యక్షుడిగా రాజు



వడ్డెపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లి ప్రాంతానికి చెందిన తాళ్లపల్లి రాజు కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ పశ్చిమ నియోజక వ ర్గ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదేశం మేరకు హనుమకొండ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు బొచ్చు చందర్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే రాజేందర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి

అదనపు డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు డీఆర్‌డీవో వెంకటేశ్వర్లు

హసన్‌పర్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలను గొప్ప పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనే సదుద్దేశంతో పని చేయాలని గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు డీఆర్‌డీవో బొజ్జ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో సంస్కృతీ విహార్ టీటీడీసీ సమావేశ మందిరంలో జిల్లాలోని గ్రామీణ మహిళలకు ఎంటర్‌ప్రెన్యూర్ పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వ పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లతో సంయుక్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక్క రోజు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం రాజేంద్రప్రసాద్, ఏపీఎం ప్రభాకర్, హైదరాబాద్ అలీఫ్ సంస్థ మెంబర్ కె.రమాదేవి, ప్రాజెక్టు ఆఫీసర్ మహ్మద్ ఖాసీం, ర్యాంపు కోఆర్డినేటర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ హనుమకొండ అభయ జులైవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు గురువారం నోట్‌బుక్స్, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ కూరపాటి రాధిక విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ తాడూరి రేణుక, కార్యదర్శి వెంకటరమణారావు, కోశాధికారి సుధాకర్, సభ్యులు అరుణ, అంబదాస్, సుమతి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలో స్వచ్ఛ్ భారత్

రాంనగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి 75వ జన్మదిన వేడుకల్లో భాగంగా గురువారం ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో న్యూశాయంపేటలో ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛ్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర నాయకుడు కాశిప్రసాద్, సత్యనారాయణరావు, ఎస్సీ మెర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, పూర్ణచారి, నాయకులు ఆర్‌పి. జయంత్‌లాల్, ముత్యాల శ్రీనువాస్, తీగల భరత్, ఉషరెడ్డి, శ్రీనువాస్ పాల్గొన్నారు.

పార్కింగ్‌కు స్థలం కేటాయించాలి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రీజినల్ పరిధిలో 20 ఏళ్లుగా అన్‌ఎంప్లాయీ స్కీం కింద అద్దె బస్సులను నడుపుతున్నామని బస్సుల పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలని గురువారం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసినట్లు అద్దెబస్సుల యజమానుల సంక్షేమ సంఘం వరంగల్ రీజినల్ అధ్యక్షుడు మరిపెల్లి రాంరెడ్డి తెలిపారు. బస్టాండ్ జంక్షన్‌కు ఇరువైపులా పార్కింగ్ చేయడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు హనుమకొండలోని హయాగ్రీవచారి గ్రౌండ్ సమీపంలో, బాలసముద్రంలోని కరెంటు ఆఫీస్ సమీపంలో గల కుడా స్థలంలో పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని కోరినట్లు రాంరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లక్కం ప్రభాకర్, అద్దె బస్సుల యజమానుల సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేయూలో ముందస్తు బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న రామచంద్రం, ఉద్యోగినులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని కంప్యూటర్ సైన్స్, ఇంగ్లిష్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో గురువారం ముందస్తుగా బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామమచంద్రం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, విభాగాధిపతులు రమ, అమరవేణిలతో పాటు పరిపాలన అధికారులు వరలక్ష్మి, సవితాజ్యోత్స్న, మమత, దీపాజ్యోతి, సౌజన్య, రాజేందర్, నరసింహచారి, డాక్టర్ బి.రమేశ్, ప్రగతి, నీలిమా, సలోని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రవర్తనను సరిదిద్దాలి

హసన్‌పర్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రవర్తనను తల్లిదండ్రులు సరిదిద్దాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సునీత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లల మానసిక స్థితిని వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారిని సరైన మార్గంలో నడిపించేవిధంగా కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతం, పరీక్షలలో ఉత్తీర్ణత, మానసిక ఒత్తిడిని తగ్గించడం వంటి పలు అంశాలను చర్చించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించగా తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను, సూచనలను తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ చకిలం రాజేశ్వర్‌రావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 10 మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపారు. మిగతా 8 మందికి రూ. 8,500 జరిమానా విధించారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 12 మందికి రూ.8,500 జరిమానా విధించారన్నారు.

లంబాడీలపై కుట్రలను తిప్పికొట్టాలి

ఎల్‌ఆర్‌పీ జేఏసీ నేతల పిలుపు



కేయూలో నినాదాలు చేస్తున్న లంబాడీ జేఏసీ నేతలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): లంబాడీలపై జరుగుతున్న కుట్రలను ఐక్యంగా తిప్పికొట్టాలని లంబాడీ రిజర్వేషన్ ప్రొటెక్షన్ జాయింట్ యాక్షన కమిటీ నేతలు డిమాండ్ చేశారు. గురువారం కేయూ మొదటి గేటు వద్ద ఎల్‌ఆర్‌పీ-జేఏసీ నేతృత్వంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ నేతలు, కేయూ నాయకులు మాలోత్ వెంకట్‌నాయక్, రమేశ్‌నాయక్‌లు వెంకటేశ్వర్లు, అశోక్, సందీప్, కల్యాణ్, తిరుపతి, సుధీర్, నరేశ్, వీరేందర్‌లు అనిల్‌లు మాట్లాడారు. 19న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద లంబాడీల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు కేయూ పక్షాన మద్దతు ప్రకటించారు. గిరిజనుల మధ్య స్వార్థపూరిత రాజకీయ కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. లంబాడీల ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. ఆత్మగౌరవ సభకు అందరూ స్వచ్ఛందంగా తరలిరావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, యాకుబ్, అలోజీ, చరణ్, అఖిల్, సూర్య, కల్యాణ్, సుమన్, స్నేహ, నవ్య, భరత్, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూకు రూ.500 కోట్ల నిధులు ఇవ్వాలి

ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత



సమావేశంలో మాట్లాడుతున్న మమత

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి రూ.500కోట్ల నిధులు ఇవ్వాలని, ఎస్‌ఎఫ్‌సీ కోర్సులన్నీ రెగ్యులర్ చేయాలని ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. మమత డిమాండ్ చేశారు. గురువారం కేయూ గెస్ట్‌హౌస్‌లో ఎస్‌ఎఫ్ఐ కేయూ అధ్యక్ష కార్యదర్శులు చెన్నూరి సాయికుమార్, బిరెడ్డి జశ్వంత్‌ల అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మమత, హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్‌లు మాట్లాడారు. వర్సిటీ విద్యార్థులందరికీ హాస్టల్ వసతి కల్పించాలని అన్నారు. వర్సిటీలో ఎస్‌ఎఫ్‌సీ విద్యార్థులకు సరిపడా హాస్టల్స్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో విద్యార్థులందరికీ మౌలిక సదుపాయాలను కల్పించాలని అన్నారు. వర్సిటీ అభివృద్ధికి నిధులు ఇప్పించాలని అన్నారు. రూ.500కోట్లు విడుదల చేయాలన్నారు. బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని అన్నారు. వర్సిటీలో సమస్యల పరిష్కారం కోసం ఎస్‌ఎఫ్ఐ నేతృత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్ఐ కేయూ ఉపాధ్యక్షురాలు ఎం.పరిమళ, కమిటీ సభ్యులు మల్లేశ్, రాహుల్, సూరజ్, ప్రవళిక, అనూష, రవళి వైష్ణవి, భాను తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలి



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని

వడ్డెపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హన్మద్గిరి పద్మాక్షి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 4 వరకు నిర్వహించే పద్మాక్షి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని దేవస్థానం వేద పండితులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 22న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి - నీలిమా దంపతులు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి - అవంతిరెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం గుట్టపై ఉన్న ఆలయానికి రోడ్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాగునీటి వసతి, పార్కింగ్ , విద్యుత్ దీపాలంకరణ , సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, బతుకమ్మ నిమజ్జనోత్సవం, తెప్పోత్సవం తదితర కార్యక్రమాలను నేత్రపర్వంగా నిర్వహించేందుకు సకల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ప్రతీ రోజు అమ్మవారికి ఒక్కొక్క అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కనుకుంట్ల రవికుమార్, నీలారపు రాజ్‌కుమార్, పోలు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న దొంతుల ఈశ్వరయ్య

వడ్డెపల్లి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన ఆర్యవైశ్య విద్యార్థులకు ఈనెల 28న హనుమకొండ సుబేదారిలోని అవోపా భవనం లో బంగారు పతకాలను ప్రదానం చేయనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు దొంతుల ఈశ్వరయ్య తెలిపారు. గురువారం హనుమకొండ బాలస ముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి కమటాల భాస్కరరావు మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి నుంచి పీజీ, పీహెచ్‌డీ వరకు అన్ని కోర్సులకు సంబంధించిన వరంగల్ ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. హనుమకొండ సుబేదారిలోని అవోపా కార్యాలయంలో దరఖాస్తులను ఈనెల 25లోపు మార్కుల జాబితా, ర్యాంకు కార్డు, ఫొటో, ఆధార్ కార్డు జత చేసి సమర్పించాలని తెలిపారు. ఒక్కో కోర్సులలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 70930 35699లో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో అవోపా కోశాధికారి డాక్టర్ గంపా సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గన్ను సురేందర్, పీఆర్‌వో పబ్బతి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


క్రీడలతో విద్యార్థులకు సత్ప్రవర్తన

ఎంఈవో ఎ. శ్రీనివాస్‌రెడ్డి

హసన్‌పర్తి, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే విద్యార్థులకు సత్ప్రవర్తన అలవడుతుందని ఎంఈవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పీఎంశ్రీ జడ్పీహెచ్‌ఎస్ బాలికల ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి అధ్యక్షతన 69వ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల ఎంపిక పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడల ఎంపిక పోటీలను ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. మొదటి రోజు బాలికల వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ క్రీడల ఎంపిక పోటీలు జరగగా రెండోరోజు శుక్రవారం బాలుర పోటీలు జరుగుతాయని పీఈటీ పార్థసారథి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శీలం పార్థసారథి, పీఈటీ సంఘ బాధ్యులు ప్రభాకర్, డి.కుమార్, పీడీ వాసుదేవరావు, కందుకూరి చంద్రమోహన్, శీలం యాదగిరి, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 24 నుంచి వైభవంగా అవుతాయి. ఆ రోజు మధ్యాహ్నం 3.00 గంటల నుంచి 5.00 గంటల వరకూ ధ్వజారోహణం ఉంటుంది.

మొదటిరోజు - సెప్టెంబరు 24:
బంగారు తిరుచ్చి ఉత్సవం (మధ్యాహ్నం 3 గంటలకు), పెద్ద శేష వాహనం (రాత్రి 9 గంటలకు)

రెండో రోజు - సెప్టెంబరు 25 :
చిన్న శేష వాహనం (ఉదయం 8 గంటలకు), హంస వాహనం (రాత్రి 7 గంటలకు)

మూడో రోజు - సెప్టెంబరు 26:
సింహ వాహనం (ఉదయం 8 గంటలకు), ముత్యపు పందిరి వాహనం (రాత్రి 7 గంటలకు)

నాలుగో రోజు - సెప్టెంబరు 27:
కల్పవృక్ష వాహనం (ఉదయం 8 గంటలకు), సర్వ భూపాల వాహనం (రాత్రి 7 గంటలకు)

అయిదో రోజు - సెప్టెంబరు 28:
మోహినీ అవతారం (ఉదయం 8 గంటలకు), గరుడ వాహనం (సాయంత్రం 6.30 గంటలకు)

ఆరో రోజు - సెప్టెంబరు 29:
హనుమంత వాహనం (ఉదయం 8 గంటలకు), స్వర్ణ రథోత్సవం (సాయంత్రం 4 గంటలకు), గజ వాహనం (రాత్రి 7 గంటలకు)

ఏడో రోజు - సెప్టెంబరు 30:
సూర్య ప్రభ వాహనం (ఉదయం 8 గంటలకు), చంద్రప్రభ వాహనం (రాత్రి 7 గంటలకు)

ఎనిమిదో రోజు - అక్టోబరు 1:
రథోత్సవం (ఉదయం 7 గంటలకు), అశ్వ వాహనం (రాత్రి 7 గంటలకు)

తొమ్మిదో రోజు - అక్టోబరు 2:
పల్లకి ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం (తెల్లవారుజామున 3 గంటల నుంచి). చక్రస్నానం (ఉదయం 6 గంటలకు), ధ్వజావరోహణం (రాత్రి 7.00 గంటలకు)

విశేషం

తీరొక్క పూల పండుగ



ప్రపంచంలో తీరొక్క పూలతో పండుగ జరుపుకొనే సంప్రదాయం తెలంగాణ బతుకమ్మదే. బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదు... ప్రకృతి, సంస్మృతి కలయికలో పుట్టిన సజీవ కావ్యం. రంగు రంగుల పువ్వులతో అందంగా దొంతరలుగా పేర్చే బతుకమ్మలతో ఆడబిడ్డలు సంబురపడే ఈ పండుగ తెలంగాణ సంస్మృతికి అద్దం పడుతుంది.

21నుంచి బతుకమ్మ సంబురాలు

చెలకల్లో, చేనుల్లో వాటంతట అవే మొలిచే సహజ పూలనే సేకరించి, రంగురంగుల గుండ్రటి ఆకారంలో శిఖరంగా పేర్చడం బతుకమ్మ పండుగకు జీవం. 'పెత్రామాస' (పితృ అమావాస్య) నాడు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే ఈ వేడుకలతో ఊరూ, వాడా కళకళలాడుతుంది. పూల రంగుల మేళవింపుతో ప్రతి ప్రాంతం బతుకమ్మ పూదోటగా గుబాళిస్తుంది.

సాయంత్రం ఆడబిడ్డలు ముస్తాబై, వలయాకారంలో నిలబడి, నెమ్మదిగా కదులుతూ, కోలాటమాడుతూ, పాటలు పాడుతూ నృత్యాలు చేయడం ఈ పండుగ గుండెచప్పుడు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...

అచ్చ తెలుగు తెలంగాణ గీతసుధలలో బతుకమ్మ పాటలకు ప్రత్యేక స్థానం ఉంది...

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...
గోరింటాకు గోరుముద్దలో...
తంగేడు పువ్వు తాలంలో...
జాతి పూల జడలో..

ఇలాంటి పాటలు సజీవంగా పల్లెల గాలిలో వినిపిస్తాయి. ప్రతి పాటలో మహిళల మనసు, ప్రకృతి, పంటల పట్ల మమకారం ధ్వనిస్తూ ఉంటుంది. బతుకమ్మ పండుగను తెలంగాణ మహిళలు తమ ఆత్మగౌరవంగా భావిస్తారు. బతుకమ్మ పాటలు అన్నిట్లో ఒక కథ, ఒక సంస్కృతి, ఒక ఆశ, ఒక స్ఫూర్తి ఉంటాయి. ఈ వేడుకల్లో ప్రతి పువ్వుకు ఒక ప్రత్యేకత ఉంటుంది. ప్రధానంగా ఉపయోగించే తంగేడు పువ్వు శక్తికి, గుమ్మడి పువ్వు సౌందర్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి

ప్రపంచమంతటా...

తెలంగాణ ప్రజలు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా బతుకమ్మ పండుగను జరుపుకొంటారు. ఆయా దేశాలలో తెలంగాణ యాసతో జానపదాలు మారుమోగుతాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో కూడా... అన్ని ప్రాంతాల్లో కాకపోయినా... పల్నాడు ప్రాంతంలోని మాచెర్ల, కంభంపాడు, కారెంపూడి గ్రామాల్లో మహిళలు బతుకమ్మను జరుపుకొంటారు. బతుకమ్మ పండుగ బొడ్డెమ్మ సందడితో ప్రారంభం కావడం ఆనవాయితీ. అయితే తెలంగాణలోని ఖమ్మం, నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాల వారికి ఈ సంప్రదాయం లేదు. కాగా ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోని గ్రామాలలో బతుకమ్మ కనిపించదు. అలాగే మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో కూడా ఈ పూల పండుగను జరుపుకోరు.



నేలతో, నీటితో అనుబంధం

ఈ మధ్య కాలంలో పలు కారణాల వల్ల తంగేడుకు కరువొచ్చింది. చెలక భూముల్లో కాంక్రీట్ అరణ్యాలు విస్తరించడంతో ప్రకృతికి సహజ అలంకారాలైన పూలమొక్కలు కనిపించడం లేదు. ఫలితంగా కాగితం పూల బతుకమ్మలు మార్కెట్‌లోకి వచ్చాయి. వెదురు కర్రతో బుట్టలను చేసి వాటికి పూల మాలలు చుట్టడం ప్రారంభమైంది. బతుకమ్మ వేడుకల సందర్భంగా గౌరమ్మను పసుపు రంగు పూలతో పేర్చి తొమ్మిది రోజుల పాటు ఆటలాడి, పాటలు పాడి పూలను నీటిలో వదులుతారు. పూలు బాగా వికసించే కాలంలో, జలవనరులు నిండుకుండల్లా ఉండే సమయంలో వచ్చే ఈ పండుగ... నేలతో, నీటితో మానవులకు ఉన్న అనుబంధాన్ని చాటుతుంది.

• కసుపు వెంకటరమణ

సహజయోగ

ఎవరి పాదపద్మాలకు నమస్కరించడం వల్ల లభించే శక్తితో బ్రహ్మదేవుడు సకల చరాచర జగత్తును సృష్టించగలుగుతున్నాడో, ఎవరి చరణ కమలాలను స్మరించినంత మాత్రాన లభించే శక్తితో విష్ణుమూర్తి సకల లోకాలకు స్థితి కారకుడు అవుతున్నాడో, ఎవరి చరణ యుగళాన్ని ధ్యానించడం వల్ల లభించే శక్తితో శివుడు ముల్లోకాలకు లయకారకుడు అవుతున్నాడో... అటువంటి ఆదిపరాశక్తికి ప్రీతికరమైన రోజులు శరన్నవరాత్రులు.

శక్తి స్వరూపిణి జగదంబ

22 నుంచి దేవీ నవరాత్రులు

సమస్త సృష్టికి మూలం ఆదిపరాశక్తి అయిన జగదంబ. దేవీ రూపాలు ఎన్నో ఉన్నాయి. వాటన్నిటికీ మూలం... ఆ జగదంబే. ఆమే దుర్గా మాత. రాక్షసులు కూడా ఆ దేవి సృష్టించినవారే. కానీ దేవీ భక్తులను నాశనం చేయడానికి వాళ్ళు అనేకసార్లు ప్రయత్నించారు. ఆ దుష్టశక్తులు నాశనం కాకపోతే... సత్యాన్వేషకులకు, సాధువులకు హాని కలిగించి, వారిని నాశనం చేస్తాయి. కాబట్టి ఎంతోమంది దేవతల, భక్తుల కోరిక మేరకు ఆమె అనేక అవతారాలు ధరించింది.

మానవుల కర్తవ్యం

పూర్వం మునులు హిమాలయాలకు వెళ్ళి, శరీరాన్ని గడ్డకట్టించే చలిలో ధ్యానం చేసేవారు. వారు ఎక్కడో గుహల్లో నివసించేవారు. పండ్లు తింటూ జీవించేవారు. ఎందుకంటే వారి జ్ఞానాన్వేషణ ఎంతో లోతైనది, చాలా బలమైనది, భగవత్ సాక్షాత్కారం అయ్యేవరకు వారు తపస్సును విడిచిపెట్టేవారు. కానీ ప్రస్తుత కాలంలో అది అసాధ్యం. ఈ కలియుగంలో దుష్ట శక్తులు రకరకాల చెడు ఆలోచనల రూపంలో మానవుల మనస్సుల్లోకి ప్రవేశించి, వినాశనంవైపు వారిని నడిపిస్తున్నాయి. ఆ దుష్ట ఆలోచనలను దూరంగా తరిమివేయడమే మానవుల కర్తవ్యం. మన లోపల అంతర్గతంగా ఉన్న కుండలినీ శక్తిని జాగృతం చేయడం ఒక్కటే దానికి ఏకైక మార్గం. కానీ ఇది అంత సులువుగా జరిగేది కాదు. అయితే శ్రీమాతాజీ నిర్మలాదేవి ఆవిష్కరించిన సహజయోగ సాధనతో... సామూహిక ఆత్మసాక్షాత్కారం ద్వారా కొన్నివేల మందిలో ఒకేసారి కుండలినీ శక్తిని జాగృతం చేయవచ్చు.



హృదయ చక్రానికి అధిష్ఠాన దేవత

దుర్గాదేవి మన సూక్ష్మ శరీర వ్యవస్థలోని హృదయ చక్రానికి అధిష్ఠాన దేవతగా ఉంటుంది. ఆ చక్రానికి పన్నెండు దళాలు ఉంటాయి. అందుకనే దుర్గాదేవికి పన్నెండు చేతులు ఉంటాయని మన పురాణాలు చెబుతున్నాయి. వైద్య శాస్త్రం ప్రకారం... హృదయ చక్రం ఉన్న చోట మన స్టెర్నమ్ ఎముక ఉంటుంది. అక్కడ యాంటీబాడీలుగా మనం పిలిచే రోగ నిరోధక శక్తులు ఉత్పత్తి అయి, శరీరంలో వ్యాపిస్తాయి. రోగకారకమైన క్రిములు, వైరస్‌లు మన శరీరంపై దాడి చేసినప్పుడు... ఈ రోగ నిరోధక శక్తులు వాటితో పోరాడతాయి. ఇవి చాలా సూక్ష్మమైన కణాలు. వాటినే మన పూర్వీకులు 'గణాలు'గా అభివర్ణించారు. ఆ గణాలకు అధిపతి శ్రీగణేశుడు. ఆయన జగదంబ రూపమైన గౌరీదేవి కుమారుడు. మన హృదయచక్రం మధ్యలో ఆసీనురాలైన జగదంబ... మనలో ధైర్యాన్ని, విశ్వాసాన్ని, ప్రేమను పెంపొందిస్తుంది. ఈ చక్రం పరిశుద్ధంగా ఉన్నవారు దుర్గాదేవిలా నిర్భయంగా, అందరి పట్లా ప్రేమపూర్వకంగా ఉంటారు. ప్రతినిత్యం చేసే సహజయోగ ధ్యాన సాధన సందర్భంగా... మనలోని కుండలినీ శక్తి సహస్రారం వైపు పయనిస్తూ... మార్గమధ్యంలోని హృదయ చక్రాన్ని దాటుతున్నప్పుడు, కుండలినీ శక్తి స్పర్శతో ఆ చక్రం జాగృతం అవుతుంది. అక్కడ ఆసీనురాలైన దుర్గామాత ప్రసన్నురాలు అవుతుంది. ఆ చక్రం పరిపుష్టి చెంది, శక్తిమంతంగా, ఆరోగ్యంగా తయారవుతుంది. ఆ చక్రంలోని లక్షణాలు, గుణాలు మనలో స్థిరపడతాయి. రాక్షస సంహారం చేసిన శ్రీదుర్గామాత శరన్నవరాత్రి పర్వదినాలలో ఎంతో ఆనందంగా ఉంటుంది.

ఆ రోజులలో ఆమెను ప్రసన్నం చేసుకుంటే మన కోరికలు సిద్ధిస్తాయి. నవరాత్రుల్లో ప్రతిరోజూ భక్తి ప్రపత్తులతో ధ్యానం, కీర్తనల ద్వారా దుర్గామాతను పూజించాలి. దుష్టశిక్షణ, భక్త రక్షణ ద్వారా ప్రపంచంలో శాంతిని నెలకొల్పాలని ప్రార్థించాలి.




డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

సందేశం

నామస్మరణతో కార్యసాఫల్యం

మనిషికి జీవితంలో అనేక సమస్యలు, పరీక్షలు ఎదురవుతాయి. కొన్ని ఇబ్బందులు మన ప్రగతికి ఊహించలేని అవరోధంగా మారుతాయి. అలాంటి పరిస్థితుల్లో దైవనామాన్ని పఠిస్తూ పని మొదలుపెడితే... అది సజావుగా సాగిపోతుందని బోధించారు దైవప్రవక్త మహమ్మద్. "అల్లాహ్ నామంతో రోజును ప్రారంభించాలి. ఉదయం లేచినది మొదలు రాత్రి నిద్రపోయేవరకూ... చిన్నదైనా, పెద్దదైనా ప్రతి పనినీ దేవుని పేరిటే ప్రారంభించాలి. అల్లాహ్ నామంతో మొదలు పెట్టిన పని ఒక ఆశయంగా మారుతుంది. ఆయన నామాన్ని స్మరిస్తే అన్ని పనులూ సాధ్యమవుతాయి. కష్టాలు తొలగిపోతాయి.

అల్లాహ్ నామం కేవలం ఒక మాట కాదు. అది ఒక నమ్మకం, మన హృదయంలో అనిశ్చితిని తొలగించి, మన సంకల్పాన్ని దృఢంగా చేసే ఆధ్యాత్మిక బలం. 'నీవు ఒంటరిగా లేవు. అల్లాహ్ ఎప్పుడూ నీకు తోడుగా ఉన్నాడు' అనే భరోసాను అది అందిస్తుంది. ఆయనను తలచుకుంటూ వేసే ప్రతి అడుగూ విజయానికి (స్వర్గానికి) మార్గం అవుతుంది" అని స్పష్టం చేశారు.




అంతిమ దివ్య గ్రంథమైన ఖురాన్‌లోని 114 సూరాలలో (అధ్యాయాలలో) ఒకటి మినహా మిగిలినవన్నీ అల్లాహ్ నామమైన 'బిస్మిల్లా'తో ప్రారంభమవుతాయి. 'అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను' అనే వాక్యంతో మొదలైన ఎన్నో గ్రంథాలు, లేఖలు, సంభాషణలు కనిపిస్తాయి. స్వర్గాన్ని సృష్టించిన, మహోన్నతుడైన ప్రభువు నామాన్ని కొనియాడుతూ ప్రారంభమైన కార్యాలు కూడా దివ్య ఖుర్‌ఆన్‌లో దర్శనమిస్తాయి. "ఏ పనినైనా 'బిస్మిల్లా' అని అనకుండా మొదలుపెడితే అది అసంపూర్తిగా మిగిలిపోతుంది. కాబట్టి పనులన్నిటినీ ఆ నామాన్ని ఉచ్చరిస్తూ ప్రారంభించండి. అది మిమ్మల్ని సైతాన్ నుంచి రక్షిస్తుంది. దైవ నామస్మరణ చేస్తున్నంత కాలం మనిషికి సర్వ శుభాలు కలుగుతాయి. అన్ని ఆటంకాలు తొలగిపోతాయి. మనిషికి తోడుగా, నీడగా దైవ సహాయం అందుతుంది. కాబట్టి అంతటా వ్యాపించి ఉన్న అల్లాహ్ నామంతోనే ఏ కార్యాన్నైనా మొదలుపెట్టాలి" అని దైవప్రవక్త మహమ్మద్ బోధించారు.

• మహమ్మద్ వహీదుద్దీన్

దారి చూపిన ప్రభువు

దైవమార్గం



ఏసు క్రీస్తు పన్నెండుమంది శిష్యులను ఏర్పరచుకున్నాడు. సమాజంలోని మానవులతో ఎలా ప్రవర్తించాలో వారికి బోధించాడు. తన సందేశాన్ని అందరికీ అందించాల్సిందిగా వారిని ఆదేశించాడు. వారు పయనమవుతున్నప్పుడు... తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించాడు.

"సమాజంలో మిమ్మల్ని కొందరు శపించవచ్చు. వారిపై కోపగించుకోకుండా దీవించండి. మిమ్మల్ని ఎవరైతే బాధిస్తారో... వారి కోసం ప్రార్థించండి. మిమ్మల్ని ఎవరైనా ఒక చెంప మీద కొడితే... రెండో చెంపను కూడా చూపించండి. మీ వస్తువులను ఎత్తుకుపోయేవారిని ఏమాత్రం అడ్డగించకండి. ఇతరులు మీకు ఏవేవి చేయాలని మీరు ఆశిస్తారో... మీరు కూడా వారికోసం అవి చేయడానికి సిద్ధపడాలి. మిమ్మల్ని ప్రేమించేవారిని తిరిగి మీరు ప్రేమిస్తే అందులో పెద్ద విశేషం లేదు. మిమ్మల్ని ద్వేషించేవారిని కూడా ప్రేమించాలి. కీడు చేసేవారికి మేలు చేయాలి. పైలోకంలో ఉన్న ఆ తండ్రి మీపైన ఎంత కనికరం చూపిస్తున్నాడో... అంతటి దయా దాక్షిణ్యాలను తోటివారిపైన మీరు చూపించాలి. మీ ముందు ఎవరైనా తప్పు చేస్తే వారిని క్షమించండి. అప్పుడే దేవుడు కూడా మీ తప్పులను క్షమిస్తాడు. ఇతరులను మీరు ఎటువంటి కొలమానంతో కొలుస్తారో... అదే కొలమానం మీకు కూడా వర్తిస్తుంది. ఏ శిష్యుడైనా తన బోధకుడి మాదిరిగానే ప్రవర్తించాలి. ఏదీ తెలియనివాణ్ణి మార్గదర్శిగా ఎంచుకోకూడదు. ఎప్పుడైనా ఒక అంధుడు మరో అంధుడికి దారి చూపగలడా? వారిద్దరూ ఒక గుంతలో పడిపోతారు కదా!" అంటూ వారికి హితవు చెప్పాడు.

అంతేకాదు... "ఒక్కోసారి ఇతరులు చేసిన తప్పులేమిటో గమనించకుండానే విమర్శిస్తాం. మీ కంట్లో ఉన్న దూలాన్ని పరిగణనలోకి తీసుకోకుండా... మీ తోటివారి కంట్లో ఉన్న నలుసు గురించి మాట్లాడడం సమంజసమా? చక్కటి ఆలోచనా ధోరణితో మంచి పునాదిని నిర్మించుకోవాలి. అదే సత్కార్యాలకు నాంది. మంచి వృక్షాల్లా ఎదగాలి. తియ్యని ఫలాలను కాయించాలి. మంచి చెట్టుకు పనికిమాలిన ఫలాలు కాయవు. మంచికీ, చెడుకూ హృదయం కేంద్రస్థానం. ఒక మనిషి సజ్జనుడు కావాలన్నా, దుర్జనుడు కావాలన్నా హృదయమే మూలం. అది మంచి చెట్టుకు బీజం లాంటిది. నేను చెప్పే మాటలను మీరు శ్రద్ధగా ఆచరించి చూడండి. సత్ఫలాలు లభిస్తాయి. నా మాట వినకపోతే నన్ను ఊరకే "ప్రభువా, ప్రభువా" అని పిలవడం వ్యర్థం. నా మాటలు మీకు మంచి పునాది వేస్తాయి. ఆ పునాది మీద ఎంతటి అందమైన భవనమైనా నిర్మించవచ్చు. కాబట్టి నా ఈ సందేశాన్ని మీ జీవన భవనానికి పునాదిగా చేసుకోండి" (లూకా... ఆరవ అధ్యాయం) అంటూ వారికి మార్గనిర్దేశం చేశాడు. ఏసు తన శిష్యులకు చెప్పిన మాటలు ఎవరికైనా, ఏ కాలంలోనైనా గొప్ప సామాజిక, ఆధ్యాత్మిక జీవనానికి దారి చూపుతాయి.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్,
9866755024

తెలుసుకుందాం

గోపురాలు... శిల్పకళా వైభవానికి నిదర్శనాలు



ఒక దేశంలోని వాస్తు నిర్మాణం ఆ దేశస్తుల మేధోసంపత్తి గురించి తెలియజేస్తుంది. ఆ దేశ ప్రజల నిర్మాణ కౌశలం, కళా కౌశలం, సృజనాత్మకత, అభిరుచి, ఆశచాలు, జీవనశైలి, శ్రమైక జీవన సౌందర్యం లాంటివి ఎన్నో విషయాలు వారు రూపొందించిన నిర్మాణాలు, వాటిలోని శిల్పాలు, చిత్రాలు తదితరాల ద్వారా తెలుసుకోవచ్చు. భారతదేశ వాస్తుకళ, శిల్పకళ... దేవాలయాలతో పెనవేసుకున్నాయి. దక్షిణ భారతదేశంలో వైదిక దేవాలయాల నిర్మాణాలను బట్టి భారతీయుల ఆధ్యాత్మిక వికాసాన్ని గుర్తించవచ్చు. ద్రవిడుల శిల్పకళ, వాస్తుకళల ఉన్నతికి అవి ప్రతిబింబాలు. ద్రవిడ శిల్పుల అపారమైన మేధో సంపత్తికి ఈ దేవాలయాలు సజీవ సాక్ష్యాలు.

ఈ దేవాలయ నిర్మాణాల్లో గోపురం విశిష్టమైనది. ద్వారం దగ్గర ఉన్నతంగా కనిపించే ఈ గోపురాలు ద్రవిడ శిల్పుల మహోన్నత శిల్పకళా వైశిష్ట్యానికి నిలువెత్తు నిదర్శనాలు. వారు తమ నైపుణ్యంతో ఎత్తయిన గోపురాలను నిర్మించి, ఆలయాల కీర్తిని శాశ్వతం చేశారు. గోపురాన్ని కేవలం ద్వారంగానే కాదు, ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చారు. పట్టణాలు పిడుగుపాటుకు గురికాకుండా, దేవుని స్థానం ఉన్నతంగా కనిపించే విధంగా, ఆ రోజుల్లో దేవాలయాలలో ప్రవేశించలేని అణగారిన వర్గాలకు దేవుని స్థానం కనిపించేలా దేవాలయ ప్రాసాదాలు నిర్మితమయ్యాయి. సనాతన భారతీయ శాస్త్రాలు దేవాలయాన్ని మానవ దేహంతో పోల్చాయి.

గర్భగృహం శిరం ప్రోక్తం అంతరాళం గళం తథా
మండపంచ ముఖంబాహుః కుక్షిస్యాన్మండపోమహాన్
ప్రాకారం జానుజంఘేచ గోపురం పాదమేవచ

విశ్వకర్మ వాస్తుశాస్త్రంలోని ఈ శ్లోకం... శయనించి ఉన్న మానవ దేహంలోని అవయవాలతో దేవాలయాన్ని పోల్చింది. "గర్భగృహం మానవుని శిరస్సు. అంతరాళం మానవుడి గళం. ముఖ మండపం మానవుని బాహువులు. మండపం ఉదరం (పొట్ట). ప్రాకారం మానవుని జానుజంఘాలు (మోకాలు, పిక్కలు). గోపురం మానవుని పాదాలు" అని అర్థం. దేవాలయ నిర్మాణంలో ప్రధానమైన కేంద్ర స్థానం గర్భగృహం. అది మానవుని శిరస్సు లాంటిది. దాని ముందు భాగాన్ని 'ముఖ మండపం' అంటారు. గర్భగృహానికి ముఖమండపాన్ని కలుపుతూ సన్నని మండపం ఉంటుంది. దాన్నే 'అంతరాళం' అంటారు. ఇక ఉదరభాగాన్ని మహా మండపంగా, పాదాలను గోపురంగా, పాదంలోని వేళ్ళను గోపుర కలశాలుగా పోల్చారు. శయనించిన మానవుడి పాదాలు రెండూ ఆకాశం వైపు చూస్తూ ఎత్తుగా నిలిచి ఉన్న విధంగా... ఆకాశంలోకి దూసుకుపోతున్నట్టు గోపుర నిర్మాణాన్ని శిల్పి మలిచాడు.

గోపురం శబ్దార్థాలు

పురద్వారంతు గోపురః - పురద్వారాన్ని గోపురం అంటారు. గోపురం అంటే గవను (దుర్గ పుర ద్వారం), వాకిలి అనే అర్థాలున్నాయి.

ద్వార మాత్రేపి గోపురం - 'పట్టణానికి ద్వారం' అని అర్థం.

గోప్యతే శూరైః ఇతి గోపురం - శూరులు రక్షించేది గోపురం. పట్టణ వాకిలిని శూరులైన సైనికులు ఎల్లవేళలా రక్షిస్తూ, కాపలా ఉంటారు.

గౌర్జలం పురం సంస్థాన మన్యతే గోపురం - నీరు ఉనికిపట్టుగా కలిగినది. పూర్వం ఇసుక నేలలో గోపురాన్ని నిర్మించేటప్పుడు పునాది కింద, పునాది చుట్టూ ఉండే ఇసుకలో తేమ శాతం ఉండేటట్టు చూసుకొనేవారు. తేమతో కూడిన ఇసుక ఆ పునాదికి మరింత గట్టితనాన్ని కలిగించి, ఎంత ఎత్తయిన గోపురం బరువునైనా కిందికి కుంగనీయదు. శ్రీరంగం రాజగోపురం, శ్రీకాళహస్తి రాజగోపురం దీనికి ఉదాహరణలు. కాగా వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి, ఆగ్రాలోని తాజ్‌మహల్‌లను కూడా మరికొన్ని ఉదాహరణలుగా చెప్పకోవచ్చు.

• దగ్గుపాటి నాగవరప్రసాద్ స్థపతి
9440525788

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఈ విజయం చిత్ర పరిశ్రమది

- సాయి దుర్గా తేజ్



"కిష్కింధపురి' సాధించిన విజయం చిత్ర పరిశ్రమదిగా భావిస్తున్నా. మరిన్ని మంచి కథలు రావాలి. అప్పుడే ప్రేక్షకులు థియేటర్లకు వస్తారు. అలాంటి సినిమాలు తీయడం మన అందరి బాధ్యత. ఇటీవలె విడుదలైన అన్ని సినిమాలు బాగా ఆడుతున్నాయి. మంచి కంటెంట్‌ని ప్రేక్షకులు ఆదరిస్తారనే విషయం మరోసారి రుజువైంది' అని అన్నారు హీరో సాయి దుర్గా తేజ్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ జంటగా కౌశిక్ పెగల్లపాటి తెరకెక్కించిన చిత్రం 'కిష్కింధపురి' ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణను పొందుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ సినిమాను విజయవంతంగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞలు తెలిపారు. దర్శకులు అనిల్ రావిపూడి, బాబీ, వశిష్ఠ, అనుదీప్ మాట్లాడుతూ 'ఈ నెలలో విడుదలైన సినిమాలతో థియేటర్లలో పండగ వాతావరణం నెలకొంది. ప్రేక్షకులతో థియేటర్లు కళ కళలాడుతున్నాయి. ఇది ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాం' అని అన్నారు. చిత్ర నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ 'డైరెక్టర్ కౌశిక్ అనుకున్న కథను తెరపై హాలీవుడ్ స్థాయిలో చూపించారు. ప్రేక్షకులు కూడా అలానే భావిస్తున్నారు' అని తెలిపారు. చిత్ర దర్శకుడు కౌశిక్ పెగల్లపాటి మాట్లాడుతూ 'చాలా కాలం తర్వాత థియేటర్లలో హౌస్‌ఫుల్ బోర్డ్స్ చూస్తుంటే చాలా సంతోషం కలిగింది' అని అన్నారు.



ఓ అభిమాని బయోపిక్

రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న 'ఆంధ్రా కింగ్ తాలుకా' చిత్రంలో కన్నడ స్టార్ ఉపేంద్ర ఆంధ్రా కింగ్‌గా నటిస్తున్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్ విడుదల చేసి 'హ్యాపీ బర్త్‌డే ఆంధ్రా కింగ్' అంటూ అభినందనలు తెలిపింది టీమ్. మహేశ్‌బాబు దర్శకత్వంలో మైత్రీ మూవీస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఓ అభిమాని బయోపిక్‌గా రూపుదిద్దుకొనే ఈ సినిమాలో రామ్ డై హార్డ్ ఫ్యాన్‌గా నటిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్నారు. నవంబర్ 28న విడుదలయ్యే 'ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రాన్ని నవీన్ యర్నేని, రవిశంకర్ వై నిర్మిస్తున్నారు. సమర్పణ: గుల్షన్ కుమార్, భూషణ్‌కుమార్.

ఇలాంటి చిత్రాలు చేయడానికి ధైర్యం కావాలి



-శేఖర్ కమ్ముల

తిరువీర్, టీనా శ్రావ్య జంటగా నటిస్తున్న చిత్రం 'ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'. సందీప్ అగరం, అస్మితా రెడ్డి నిర్మిస్తున్నారు. నవంబర్ 7న చిత్రం విడుదలవుతోంది. తాజాగా చిత్రం టీజర్‌ను హీరో విజయ్‌దేవర కొండ, దర్శకుడు శేఖర్ కమ్ముల విడుదల చేశారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ 'ఈ టీమ్ అందరిలో మంచి వైబ్ ఉంది. తిరువీర్ ఈ తరహా సినిమాలు మరిన్ని చేయాలి. ఇలాంటి కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలు చేయడానికి నిర్మాతలకు ధైర్యం కావాలి' అని అన్నారు. 'ఈ కథ విన్నంత సేపూ నవ్వుతూనే ఉన్నా' అని తిరువీర్ చెప్పారు.

కల్కి సీక్వెల్ నుంచి దీపిక ఔట్!



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి 2898 ఏడీ'లో బాలీవుడ్ హీరోయిన్ దీపిక పడుకొనే కీలక పాత్రను పోషించిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా సీక్వెల్‌లో ఆమె ఉండరని నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ గురువారం ప్రకటించింది. 'జాగ్రత్తగా ఆలోచించిన తర్వాత మేం ఒక నిర్ణయానికి వచ్చాం. 'కల్కి' సీక్వెల్‌లో దీపికా భాగం కాదని అధికారికంగా తెలియజేస్తున్నాం. గొప్ప టీమ్‌తో 'కల్కి' సీక్వెల్ మీ ముందుకు వస్తుంది. భవిష్యత్తులో దీపికా మంచి సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాం' అని పేర్కొంది. సినిమాలో అత్యంత కీలకమైన పాత్ర నుంచి ఆమె తప్పించడంతో ప్రస్తుతం ఈ విషయం టాక్ ఆఫ్ ద టౌన్‌గా మారింది. దీపిక ఆమె పారితోషికాన్ని 25 శాతం పెంచడం, దాదాపు 25 మంది ఉన్న తన టీమ్‌కు ఫైవ్‌స్టార్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేయడం, షూటింగ్‌కు రోజుకు 7 గంటలు మాత్రమే హాజరవుతాననే షరతు పెట్టడం... ఆమెను 'కల్కి2' నుంచి తొలగించడానికి గల కారణాలు ఇవే అయ్యుండొచ్చని అందరూ అనుకుంటున్నారు. ప్రభాస్ లాంటి అగ్రకథానాయకుడే పార్ట్2కు ఫీజు పెంచకపోవడం, భారీ తారాగణంతో పాటు ఎంతో బడ్జెట్‌తో కూడిన ఈ ప్రాజెక్ట్‌కు ఆమె అంత లిమిటెడ్ టైమ్ కేటాయించడంతో ఏకీభవించని నిర్మాతలు ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చని సమాచారం. ఇప్పుడు ఆ పాత్రకు ఎవరిని ఎంపిక చేస్తారనే ఆసక్తికరమైన చర్చ మొదలైంది.

ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన కథ

- అంకిత్ కొయ్య



'ఈ సినిమా పేరును, లోగోను డైరెక్టర్ మారుతి డిజైన్ చేశారు. ఈ చిత్ర కథ విని షాక్‌కు గురయ్యాను. నాకు కథ చాలా బాగా నచ్చింది. ఈ చిత్రం ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది' అని అన్నారు కథానాయకుడు అంకిత్ కొయ్య. ఆయన కథానాయకుడిగా జేఎస్ఎస్ వర్ధన్ తెరకెక్కించిన చిత్రం 'బ్యూటీ'. నీలఖి కథానాయిక. విజయ్‌పాల్ రెడ్డి అడిదల, ఉమేశ్ కుమార్ భన్సల్ నిర్మించారు. సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా అంకిత్ కొయ్య మీడియాతో ముచ్చటించారు.

- ఇంతకు మునుపెన్నడూ నటించని పాత్రలో నన్ను చూస్తారు. అర్జున్ పాత్రకు కావల్సినట్టుగా నటించాను.
- ఈ సినిమాకు వీకే నరేశ్ గారే హీరో. ఆయన పాత్ర నాకు బాగా నచ్చింది. ఓ మధ్యతరగతికి చెందిన తండ్రిగా నరేశ్ నటనకు ప్రేక్షకులు ఫిదా అవుతారు. ఈ మూవీకి ప్రధాన బలం కూడా ఆయనే.
- ఆలేఖ్య పాత్రలో నీలఖి అద్భుతంగా నటించారు. దర్శకుడు వర్ధన్‌తో కథా చర్చల్లో నేను కూడా పాల్గొన్నాను. ప్రతీ చిన్న విషయాన్ని చాలా విస్తృతంగా చర్చించుకునేవాళ్లం. డైరెక్టర్ కథను అద్భుతంగా హ్యాండిల్ చేశారు. ప్రతి పాత్రకు న్యాయం చేకూర్చారు.




కథ విని షాక్ అయ్యా

-సాయిరాజేశ్

చంద్రహాస్ కథానాయకుడిగా జైరామ్ చిటికెల దర్శకత్వంలో శ్రీకాంత్ రాజారత్నం నిర్మిస్తున్న చిత్రం 'కాయిన్'. బుధవారం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను, గ్లింప్స్‌ను దర్శకుడు సాయిరాజేశ్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కాయిన్' చుట్టూ ఇంత జరిగిందా అని ఈ సినిమా కథ విన్నప్పుడు షాక్ అయ్యా. సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. 'యథార్థ సంఘటనల స్ఫూర్తిగా కాయిన్స్ నేపథ్యంలో రూపొందుతున్న క్రైమ్ థ్రిల్లర్ ఇది' అని చంద్రహాస్ చెప్పారు.

స్వేచ్ఛ కోసం పోరాటం



మలయాళ చిత్ర రంగ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ నటిస్తున్న తాజా చిత్రం 'వృషభ'. రచయిత, దర్శకుడు నందకిశోర్ రూపొందిస్తున్న ఈ భారీ చిత్రాన్ని ఏక్తా కపూర్ మరో ఎనిమిది మంది నిర్మాతలతో కలసి నిర్మిస్తుండడం విశేషం. చిత్రం టీజర్ విడుదలైన సందర్భంగా నిర్మాత ఏక్తా కపూర్ మాట్లాడుతూ 'మా బాలాజీ సంస్థలో ఎప్పుడూ పవర్‌ఫుల్ కంటెంట్‌ను అందించడానికి ప్రయత్నిస్తుంటాం. అలా మా అందరికీ నచ్చిన ప్రాజెక్ట్ 'వృషభ'. స్వేచ్ఛ కోసం పోరాటం ఈ చిత్రకథ' అని చెప్పారు. 'లెజెండరీ మోహన్‌లాల్‌తో కలసి పని చేయడం ఆనందంగా ఉంది. ఆయన కొడుకుగా సమర్జిత్ నటించారు. తండ్రీకొడుకుల చుట్టూ తిరిగే శక్తిమంతమైన కథ' అని చెప్పారు దర్శకుడు నందకిశోర్. మలయాళ, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఈ దీపావళికి రిలీజ్ చేయనున్నారు.

హీరోగా యూట్యూబర్



యూట్యూబర్ నిఖిల్ విజయేంద్ర సింహా కథానాయకుడిగా సాద్ ఖాన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంగీత్'. నవీన్ మనోహరన్, చంద్రు మనోహరన్, స్రవంతి నవీన్ నిర్మిస్తున్నారు. గురువారం 'సంగీత్' చిత్రం నుంచి స్పెషల్ గ్లింప్స్ విడుదల చేశారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ తుది దశలో ఉంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

అందర్నీ ఆకట్టుకుంటుంది

-రాజు నాయక్



'టన్నెల్' సినిమాను చెన్నైలో చూశాను. అద్భుతంగా అనిపించింది. ఇలాంటి చిత్రాన్ని తెలుగువారికి అందించాలనే తెలుగులో విడుదల చేస్తున్నాను' అని అన్నారు నిర్మాత ఏ. రాజు నాయక్. అథర్వ మురళీ హీరోగా నటించిన 'టన్నెల్' చిత్రం నేడు విడుదలవుతున్న సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ 'ఈ మధ్య కాలంలో నాకు విపరీతంగా నచ్చిన సినిమా ఇదే. ఇందులోని కథంతా ఒక్క రాత్రిలోనే జరుగుతుంది. సైకో నుంచి పోలీసుల్ని హీరో ఎలా కాపాడతాడనేది ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు సినిమాను ఎడ్జ్ ఆఫ్ ద సీట్ థ్రిల్లర్‌గా మలిచాడు. చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకుంటుంది అనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

బిజినెస్

వరంగల్ ● శుక్రవారం 19 సెప్టెంబరు 2025



మారుతి కార్ల ధర తగ్గింపు

న్యూఢిల్లీ: కొత్త జీఎస్‌టీ రేట్లు వచ్చే సోమవారం నుంచి అమలులోకి రానున్న నేపథ్యంలో తమ కార్ల ధరలు తగ్గించాలని మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) యాజమాన్యం నిర్ణయించింది. కార్ల శ్రేణిని బట్టి ధరల తగ్గింపు రూ.1,29,600 వరకు ఉంటుందని తెలిపింది. జీఎస్‌టీ రేట్ల కోత ప్రయోజనాన్ని ఈ నెల 22 నుంచి సంపూర్ణంగా కస్టమర్లకే అందించాలని నిర్ణయించినట్టు పేర్కొంది.

ఇదే మంచి సమయం: కారు కొనేందుకు ఇంతకు మించిన మంచి సమయం మరొకటి ఉండదని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ అన్నారు. తాము ఎంట్రీ స్థాయి కార్ల ధరను జీఎస్‌టీ ప్రయోజనం 8.5 శాతాన్ని మించి తగ్గించామని చెప్పారు. దేశంలో కారు కొనుగోలు చేసే వారి సంఖ్య ప్రతి వెయ్యి మందిలో 34గా ఉన్నదని, అందుకే మార్కెట్ అగ్రగామి అయిన తాము ఈ ప్రత్యేక చొరవ తీసుకున్నామని ఆయన వెల్లడించారు.

కార్ల ధర ఎంత తగ్గుతుందంటే

కారు	ధర (రూ.ల్లో)
ఎస్ ప్రెసో	1,29,600
ఆల్టో కే10	1,07,600
సెలేరియో	94,100
వ్యాగన్-ఆర్	79,600
ఇగ్నిస్	71,300
స్విఫ్ట్	84,600
బాలెనో	86,100
టూర్ ఎస్	67,200
డిజైర్	87,700
ఫ్రాంక్స్	1,12,600
బ్రెజ్జా	1,12,700
గ్రాండ్ విటారా	1,07,000
జిమ్నీ	51,900
ఎర్టిగా	46,400
ఎక్స్ఎల్ 6	52,000
ఇన్విక్టో	61,700
ఈకో	68,000
సూపర్ క్యారీ ఎల్‌సీవీ	52,100

హెరిటేజ్ ఫుడ్స్

డెయిరీ ఉత్పత్తులపై జీఎస్‌టీ రేట్లు తగ్గిన నేపథ్యంలో తమ ఉత్పత్తుల ధరలు తగ్గిస్తున్నట్టు హెరిటేజ్ ఫుడ్స్ ప్రకటించింది. ఈ నెల 22 నుంచి జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రయోజనం పూర్తిగా కస్టమర్లకే అందించాలనుకుంటున్నట్టు తెలిపింది. షెల్ఫ్ లైఫ్ యూహెచ్‌టీ పాల ధర లీటరు రూ.3 మేరకు తగ్గిస్తున్నట్టు తెలిపింది. అయితే తాజా పాలపై జీఎస్‌టీ తగ్గించని కారణంగా వాటి ధర యథాతథంగా ఉంటుందని పేర్కొంది. అలాగే నెయ్యి, వెన్న, చీజ్ ధర కిలో రూ.50 వంతున, పనీర్ ధర కిలో రూ.25 తగ్గుతుంది. ఐస్‌క్రీమ్ ధర 950 ఎంఎల్ ప్యాక్‌పై రూ.35, 700 ఎంఎల్ ప్యాక్‌పై రూ.20 తగ్గుతుంది.

ఐటీసీ

జీఎస్‌టీ రేట్లు తగ్గడంతో ఎఫ్ఎంసీజీ విభాగంలోని అన్ని వస్తువుల ధరలూ తగ్గిస్తున్నట్టు ఐటీసీ ప్రకటించింది. ధరల తగ్గింపు ప్రయోజనం ఏ మేరకు ఉన్నదీ కస్టమర్లకు తెలియ చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీ.సుమంత్ చెప్పారు.

ప్లాస్టో నుంచి కొత్త ఉత్పత్తులు



హైదరాబాద్: ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్.. మార్కెట్లోకి ప్లాస్టో బకెట్, మగ్గులను విడుదల చేసింది. వినియోగదారుల రోజువారీ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో ఈ కొత్త ఉత్పత్తులను డిజైన్ చేసినట్లు కంపెనీ తెలిపింది. వంద శాతం ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్‌తో వీటిని తయారు చేసినట్లు పేర్కొంది. ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకునే విధంగా యూవీ ప్రొటెక్షన్ టెక్నాలజీతో ఈ ఉత్పత్తులను తీసుకువచ్చినట్లు తెలిపింది. ఐదేళ్ల వారంటీతో కూడిన బకెట్ 5, 25 లీటర్లు, మగ్గులు ఒక లీటర్, 1.5 లీటర్ సామర్థ్యాలతో అందుబాటులో ఉంటాయని ఆర్‌సీ ప్లాస్టో వెల్లడించింది. ఈ ఉత్పత్తులు ఆర్‌సీ ప్లాస్టో అధీకృత డిస్ట్రిబ్యూటర్లు, డీలర్ల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపింది.

83,000 ఎగువన సెన్సెక్స్

ముంబై: అమెరికాలో వడ్డీ రేట్ల కోత మార్కెట్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ చర్య ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. ఫార్మా, ఐటీ, ఫైనాన్షియల్ రంగాల షేర్లు మార్కెట్ లాభాలకు మద్దతు ఇచ్చాయి. దీంతో సెన్సెక్స్ 320 పాయింట్ల లాభంతో 83,013.96 వద్ద ముగియగా నిఫ్టీ 93.35 పాయింట్ల లాభంతో 25,423.60 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.36% లాభపడగా స్మాల్‌క్యాప్ సూచీ మాత్రం 0.01 శాతం నామమాత్రపు నష్టంతో ముగిసింది.

23న నాలుగు ఐపీఓలు: వచ్చే మంగళవారం (23వ తేదీ) నాలుగు తొలి పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ) మార్కెట్ తలుపు తట్టనున్నాయి. వాటిలో ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్, శేషసాయి టెక్నాలజీస్, జారో ఎడ్యుకేషన్, సోలార్ వరల్డ్ ఎనర్జీ సొల్యూషన్స్ ఉన్నాయి. ఈ ఇష్యూలన్నీ 25వ తేదీన ముగుస్తాయి. ఆనంద్ రాఠీ షేరు ధర శ్రేణిని రూ.393-414, శేషసాయి టెక్నాలజీస్ షేరు ధర రూ.402-423గా ప్రకటించాయి.

గౌతమ్ అదానీకి సెబీ క్లీన్‌చిట్

- అదానీ గ్రూప్, రాజేశ్ అదానీలకు కూడా
- ఇన్‌సైడర్ ట్రేడింగ్ అబద్ధం
- హిండెన్‌బర్గ్ ఆరోపణలకు ఆధారాల్లేవు



న్యూఢిల్లీ: ఊహించిందే జరిగింది. అదానీ గ్రూప్, ఆ గ్రూప్ ప్రధాన ప్రమోటర్లు గౌతమ్ అదానీ, రాజేశ్ అదానీలపై వచ్చిన ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలను క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ కొట్టి పారేసింది. అదానీ గ్రూప్‌నకు చెందిన లిస్టెడ్ కంపెనీల షేర్లలో 'సంబంధిత' (రిలేటెడ్) పార్టీల లావాదేవీలు జరిగినట్టు 2023 జనవరిలో అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ 'హిండెన్‌బర్గ్ రీసెర్చ్' సంస్థ చేసిన ఆరోపణలను తోసిపుచ్చింది. తమ దర్యాప్తులో ఇందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదని ప్రకటించింది. దీనికి సంబంధించి సెబీ బోర్డు సభ్యులు కమలేష్ సీ వర్ష్నీ గురువారం రెండు ఆదేశాలు జారీ చేశారు. ఆదికార్ప్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, మైల్‌స్టోన్ ట్రేడ్‌లింక్స్ ప్రైవేట్ లిమిటెడ్, రెహ్వార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలు.. అదానీ గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీల మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు అసలు 'సంబంధిత' పార్టీల లావాదేవీల నిర్వచనం పరిధిలోకే రావని సెబీ తేల్చింది. ఈ సంస్థలు అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల నుంచి తీసుకున్న రుణాలను వడ్డీతో సహా చెల్లించినప్పుడు 'సంబంధిత' లావాదేవీల ప్రశ్నే తలెత్తదని స్పష్టం చేసింది.

ఇదీ కేసు

అదానీ గ్రూప్ ప్రమోటర్లు తమ నిర్వహణలోని విదేశీ డొల్ల కంపెనీలకు నిధులు మళ్లించి, ఆ నిధులతో గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్లలో కృత్రిమ ర్యాలీ సృష్టిస్తున్నారని 'హిండెన్‌బర్గ్ రీసెర్చ్' సంస్థ 2023 జనవరిలో పెద్ద బాంబు పేల్చింది. దాంతో అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాప్ ఒక దశలో 15,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.13.21 లక్షల కోట్లు) మేర తుడిచి పెట్టుకుపోయింది. అదానీ ఎంటర్‌ప్రైజెస్‌తో పాటు ప్రధాన లిస్టెడ్ కంపెనీల షేర్ల ధర 50 నుంచి 70 శాతం పడిపోయింది. దాంతో 2023 జనవరి నాటికి ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానంలో ఉన్న గౌతమ్ అదానీ కనీసం టాప్-100లో కూడా లేకుండా పోయారు.

క్షమాపణ చెప్పాలి
గౌతమ్ అదానీ

హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ నివేదిక ఆధారంగా తమపై ఆరోపణలు చేసిన వ్యక్తులు ఇప్పటికైనా తమకు క్షమాపణలు చెప్పాలని అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ కోరారు. దీనికి సంబంధించి గురువారం ఆయన సోషల్ మీడియా యాప్ 'ఎక్స్'లో తన వ్యాఖ్యలను పోస్టు చేశారు. హిండెన్‌బర్గ్ సంస్థ దురుద్దేశాలతో తమపై నిరాధార ఆరోపణలు చేస్తోందని తాము మొదటి నుంచీ చెబుతున్న విషయాన్ని అదానీ ఆ పోస్టులో గుర్తు చేశారు. సెబీ జరిపిన సమగ్ర దర్యాప్తులోనూ ఇదే విషయం తేలిందన్నారు. 'ఈ దురుద్దేశపూరిత నివేదికతో నష్టపోయిన మదుపరుల బాధ ఏంటో మాకు తెలుసు. ఈ నివేదిక ఆధారంగా మాపై తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తులు జాతికి క్షమాపణలు చెప్పాలి' అని అదానీ ఆ పోస్టులో పేర్కొన్నారు.

ఇప్పటికే 'సుప్రీం' నుంచి

హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక అప్పట్లో దేశంలో పెద్ద ప్రకంపనలే సృష్టించింది. ప్రభుత్వ అండదండలతోనే అదానీలు ఇందుకు సాహసించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దాంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఈ ఆరోపణల నిగ్గు తేల్చేందుకు ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇప్పటికే అదానీ గ్రూప్ సంస్థలు, గౌతమ్ అదానీ, రాజేశ్ అదానీలకు క్లీన్‌చిట్ ఇచ్చింది. తాజాగా సెబీ కూడా క్లీన్‌చిట్ ఇవ్వడంతో అదానీలకు పెద్ద ఊరట లభించినట్టయింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	560
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	విజయవాడ	135
వరంగల్	118	గుంటూరు	132
కరీంనగర్	118	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	120
కర్నూలు	118	నెల్లూరు	125
విశాఖపట్నం	134	అనంతపురం	125
గోదావరి	135		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,170 ▼	1,01,900 ▼	1,42,000 ▼
విజయవాడ	1,13,600 ▲	1,07,500 ▲	1,31,450 ▲
విశాఖపట్నం	1,13,720 ▼	1,00,000 ▼	1,41,000 ▼
రాజమండ్రి	1,11,160 ▼	1,01,900 ▼	1,30,200 ▼
ప్రొద్దుటూరు	1,14,000 ▼	1,04,420 ▼	1,31,500 ▼
ముంబై	1,10,167 ▲	1,00,913 ▲	1,27,100 ▲

త్వరలో జొన్నగిరి గని నుంచి పసిడి ఉత్పత్తి

- నాలుగేళ్లలో ఏటా 1,000 టన్నులు
- దక్కన్ గోల్డ్‌మైన్స్ ఎండీ హనుమ ప్రసాద్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ త్వరలో దేశ పసిడి ఉత్పత్తి మ్యాప్‌లో చేరబోతోంది. కర్నూలు జిల్లాలోని జొన్నగిరి వద్ద దక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (డీజీఎంఎల్) కంపెనీ అభివృద్ధి చేస్తున్న గనిలో అతి త్వరలో ఉత్పత్తి ప్రారంభం కానుంది. ఢిల్లీలో సీఐఐ నిర్వహించిన ఒక సదస్సుకు హాజరైన డీజీఎంఎల్ ఎండీ హనుమ ప్రసాద్ ఈ విషయం వెల్లడించారు. ఈ ఏడాది జూన్-జూలై నెలల్లో ఈ ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ అనుమతులు లభించాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసిన అనుమతులు కూడా లభిస్తే త్వరలోనే జొన్నగిరి గని నుంచి పసిడి ఉత్పత్తి ప్రారంభిస్తామని ప్రసాద్ చెప్పారు. ఇదే జరిగితే మన దేశంలో గనుల నుంచి పసిడి తీసే తొలి ప్రైవేట్ కంపెనీగా డీజీఎంఎల్ రికార్డు సృష్టించనుంది. కాగా ప్రారంభంలో జొన్నగిరి గని నుంచి ఏటా 750 కిలోల పసిడి ఉత్పత్తి చేయవచ్చని డీజీఎంఎల్ భావిస్తోంది. తర్వాత రెండు-మూడు సంవత్సరాల్లో ఇది 1,000 టన్నులకు చేరే అవకాశం ఉందని ప్రసాద్ తెలిపారు.

ప్రస్తుతం మన దేశంలో ఏటా 1.5 టన్నులకు మించి పసిడి ఉత్పత్తి కావడం లేదు. దీంతో పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం ఖర్చు చేసి ఏటా దాదాపు 1,000 టన్నుల పసిడి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. జొన్నగిరి గనుల్లో డీజీఎంఎల్ పూర్తి స్థాయిలో ఉత్పత్తి ప్రారంభిస్తే ఈ భారం భారీగా తగ్గనుంది.

- న్యూమరస్ మోటార్స్ మార్కెట్లోకి మల్టీ యుటిలిటీ ఎలక్ట్రిక్ స్కూటర్ డిప్లోస్ మాక్స్ ప్లస్ వెర్షన్‌ను విడుదల చేసింది. 4.0 కిలోవాట్ కూలింగ్ బ్యాటరీ ప్యాక్‌తో కూడిన ఈ స్కూటర్ 70 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. మూడు రంగుల్లో అందుబాటులో ఉండే ఈ స్కూటర్ ధర రూ.1.15,103.
- యమహా మోటార్ ఇండియా నవరాత్రుల సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఇందులో భాగంగా ద్విచక్ర వాహన శ్రేణిపై ప్రత్యేక బీమా ప్రయోజనాలతో పాటు రేజర్ 125 ఎఫ్ఐ హైబ్రిడ్ స్కూటర్‌పై క్యాష్‌బ్యాక్ ఆఫర్లను అందిస్తోంది. అలాగే జీఎస్‌టీ ప్రయోజనాలను అందిస్తున్నట్లు ప్రకటించింది.
- మెడ్‌టెక్ సంస్థ మెరిల్.. భారత్‌లోకి అడ్వాన్స్‌డ్ సాఫ్ట్ టిష్యూ రోబోటిక్ సిస్టమ్ 'మిజ్జో ఎండో 4,000'ను తీసుకువచ్చింది. గైనకాలజీ, యూరాలజీ, బేరియాట్రిక్ తదితర వ్యాధుల చికిత్సలో మిజ్జో ఎండో కీలకంగా ఉండనుంది.

అంతిమ్‌కు కాంస్యం



ప్రపంచ రెజ్లింగ్

జగ్రెబ్: భారత యువ రెజ్లర్ అంతిమ్ పంగల్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాన్ని సొంతం చేసుకొంది. గురువారం జరిగిన 53 కిలోల కాంస్య పోరులో అంతిమ్ 9-1తో ఎమ్మా జొన్నా డినైస్ మల్మగ్రెన్ (స్వీడన్)పై గెలిచింది. 21 ఏళ్ల అంతిమ్‌కు ఇది రెండో ప్రపంచ పతకం. 2023 టోర్నీలోనూ ఆమె కాంస్యం నెగ్గింది. దీంతో వినేశ్ ఫొగట్ తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు నెగ్గిన భారత రెజ్లర్‌గా అంతిమ్ నిలిచింది. ఇక, మరో భారత రెజ్లర్ మనీష 62 కిలోల విభాగం రెపిచేజ్ రౌండ్‌లో ఓటమిపాలై కాంస్య పోరుకు దూరమైంది.

క్వార్టర్స్‌కు సింధు, సాత్విక్ జోడీ

షెన్‌జెన్ (చైనా): స్టార్ షట్లర్ పీవీ సింధు, డబుల్స్ ఏస్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో సింధు 21-15, 21-15తో ఆరో సీడ్ పోర్న్‌పవీ చోచువాంగ్ (థాయ్‌లాండ్)పై గెలిచింది. డబుల్స్‌లో 8వ సీడ్ సాత్విక్ ద్వయం 21-13, 21-12తో తైపీ జంట సియాంగ్ చీ చియు/వాంగ్ చి లిన్‌ను ఓడించింది.

ఆర్చరీ లీగ్‌లో జ్యోతి, ధీరజ్, చికిత

న్యూఢిల్లీ: మొదటిసారిగా జరగనున్న ఫ్రాంచైజీ తరహా ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో తెలుగు స్టార్లు జ్యోతి సురేఖ, ధీరజ్, చికితలకు చోటు దక్కింది. వచ్చే నెల 2 నుంచి 12 వరకు యమునా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో లీగ్‌ను నిర్వహించనున్నారు. ఆరు జట్ల లీగ్‌లో వరల్డ్ టాప్ ఆర్చర్లు ఆండ్రి బెసెర్రా, బ్రాడీ ఎల్లిసన్ సహా 48 మంది మేటి విలుకాళ్లు బరిలో నిలవనున్నారు. పృథ్వీరాజ్ యోధాస్, రాజ్‌పుతాన రాయల్స్, చోళ చీఫ్స్, కాకతీయ నైట్స్, చేర ఆర్చర్స్, మైటీ మరాఠాస్ ఈ ఆరుజట్లకు సంబంధించిన ప్లేయర్లను గురువారం జరిగిన ఎనిమిది రౌండ్ల డ్రాఫ్టింగ్ తర్వాత ప్రకటించారు. కాకతీయ నైట్స్‌లో జ్యోతి సురేఖ, చోళ చీఫ్స్‌లో చికిత, దీపిక కుమారి, మైటీ మరాఠాస్‌లో ధీరజ్ తలపడనున్నారు.

రేపటి నుంచి గుంటూరులో జాతీయ చెస్

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో శనివారం నుంచి జాతీయ చెస్ చాంపియన్‌షిప్ జరగనుంది. ఈ టోర్నీలో 14 మంది గ్రాండ్‌మాస్టర్లు, 29 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు, ఓ మహిళా గ్రాండ్‌మాస్టర్ సహా దాదాపు 500 మంది పోటీపడుతున్నారు. అక్టోబరు 1న పోటీలు ముగుస్తాయి. విజేతలకు రూ. 30 లక్షల నగదు బహుమతిని అందజేయనున్నట్టు టోర్నీ చీఫ్ కో-ఆర్డినేటర్ కేవీవీ శర్మ, ఏపీ చెస్ సంఘం అధ్యక్షుడు అడుసుమల్లి సురేష్ తెలిపారు. అలాగే.. టోర్నీలో రాణించిన క్రీడాకారులను త్వరలో జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌లాంటి టోర్నీలకు ఎంపిక చేయనున్నట్టు వెల్లడించారు.

జురెల్ శతకం.. భారత్ 'ఎ' 403/4

లఖ్‌నవూ: ఆస్ట్రేలియా 'ఎ'తో జరుగుతున్న అనధికార తొలి టెస్టులో భారత్ 'ఎ' బ్యాటర్లు సమష్టిగా రాణిస్తున్నారు. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (113 బ్యాటింగ్) అజేయ శతకంతో రాణించగా, అతడికి జతగా క్రీజులో ఉన్న దేవ్‌దత్ పడిక్కళ్ (86 బ్యాటింగ్) కూడా సెంచరీ వైపు సాగుతున్నాడు. దీంతో మూడో రోజు గురువారం ఆట ముగిసే సరికి భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 403/4 స్కోరుతో నిలిచింది. సాయి సుదర్శన్ (73), ఓపెనర్ జగదీశన్ (64) ఆకట్టుకున్నారు. కెప్టెన్ శ్రేయాస్ (8) విఫలమయ్యాడు. ఆసీస్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 532/6 స్కోరు దగ్గర డిక్లేర్ చేసింది.

విఫలమైన నీరజ్ మెరిసిన సచిన్

ప్రపంచ అథ్లెటిక్స్



8వ స్థానానికి పరిమితమైన చోప్రా

- యాదవ్‌కు నాలుగో స్థానం.. త్రుటిలో చేజారిన పతకం
- వాల్కాట్‌కు జావెలిన్ టైటిల్



సచిన్ యాదవ్

టోక్యో: జావెలిన్ వీరుడు నీరజ్ చోప్రా ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నిరాశ పరిచాడు. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన నీరజ్.. టైటిల్ నిలబెట్టుకోవడంలో విఫలమవడమే గాకుండా కనీసం పోడియం ఫినిష్ కూడా చేయలేకపోయాడు. గురువారం జరిగిన పురుషుల జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ ఒక్కసారి కూడా 85 మీటర్ల మార్క్‌ను అందుకోలేకపోయాడు. మొత్తం 12 మంది పోటీపడ్డ ఫైనల్స్‌లో నీరజ్.. జావెలిన్‌ను 84.03 మీటర్లు మాత్రమే విసిరి ఏకంగా ఎనిమిదో స్థానానికి పరిమితమయ్యాడు. హాట్ ఫేవరెట్‌గా పోటీపడ్డ నీరజ్ మొదటి ప్రయత్నంలో జావెలిన్‌ను 83.65 మీటర్ల దూరం విసిరాడు. రెండో రౌండ్‌లో 84.03 మీటర్లు విసిరిన చోప్రా.. మూడో ప్రయత్నంలో ఫౌల్ చేశాడు. నాలుగో రౌండ్‌లో 82.86 మీటర్లతో సరిపెట్టుకున్న నీరజ్.. ఐదో ప్రయత్నంలో ఫౌల్ చేసి పతక రేసు నుంచి నిష్క్రమించాడు. అయితే నీరజ్ నిరాశపరిచిన చోట.. మరో భారత త్రోయర్ సచిన్ యాదవ్ తన అత్యుత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. అంచనాలకు మించి రాణించిన సచిన్.. అత్యుత్తమంగా 86.27 మీటర్లు విసిరి నాలుగో స్థానంతో అందరినీ ఆశ్చర్యపరిచాడు. నీరజ్ కంటే ఎన్నోరెట్లు అద్భుతంగా రాణించిన సచిన్.. కేవలం 40 సెంటీ మీటర్ల తేడాతో కాంస్య పతకం చేజార్చుకున్నాడు. తొలి ప్రయత్నంలోనే అత్యుత్తమ ప్రదర్శన చేసి పతకంపై ఆశలు రేపిన సచిన్.. ఆఖరి ప్రయత్నంలో 80.95 మీటర్లే త్రో చేసి నాలుగో స్థానానికి పరిమితమయ్యాడు. మూడో స్థానంలో నిలిచిన అమెరికా త్రోయర్ కర్టిస్ థాంప్సన్ 86.67 మీటర్లతో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. ఇక, ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన కిషోర్న్ వాల్కాట్ అందరి కంటే అత్యుత్తమంగా 88.16 మీటర్లు త్రో చేసి స్వర్ణం ఎగరేసుకుపోయాడు. గ్రెనెడా అథ్లెట్ అండర్సన్ పీటర్స్ 87.38 మీటర్ల ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం అందుకున్నాడు. ఇటీవల డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో విజేతగా నిలిచిన జర్మన్ స్టార్ జులియన్ వెబర్ (86.11 మీ.) ఇక్కడ ఐదో స్థానానికి పడిపోయాడు. ఇక, నీరజ్‌కు పోటీగా భావించిన పాకిస్థాన్ స్టార్, పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్ కూడా దారుణంగా విఫలమయ్యాడు. ఫైనల్లో పూర్తిగా తేలిపోయిన అర్షద్.. 82.75 మీటర్లు త్రో చేసి ఏకంగా పదో స్థానంలో నిలవడం గమనార్హం.



అండర్సన్ పీటర్స్ | కిషోర్న్ వాల్కాట్ | కుర్టిస్ థాంప్సన్

నయా సంచలనం

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నాలుగోస్థానంలో నిలిచి అబ్బురపరిచిన 25 ఏళ్ల సచిన్ యాదవ్.. ఉత్తరప్రదేశ్‌లోని ఖేక్రా గ్రామానికి చెందిన రైతు కుటుంబంలో జన్మించాడు. ఆరడుగుల ఐదు అంగుళాల పొడవున్న సచిన్.. చిన్నప్పుడు ఫాస్ట్ బౌలర్ కావాలనుకొని ఆ దిశగా అడుగులేశాడు. కానీ, 19 ఏళ్ల వయసులో సందీప్ యాదవ్ అనే అథ్లెట్ మార్గదర్శకత్వంతో జావెలిన్ త్రోను కెరీర్‌గా ఎంచుకున్నాడు. ఈ ఏడాది మే నెలలో కొరియాలో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో జావెలిన్‌ను 86.27 మీటర్లు త్రో చేసి అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శనతో రజతం నెగ్గాడు. అదే ఊపులో ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించి క్వాలిఫికేషన్స్‌లో సత్తా చాటాడు. ఫైనల్లో నీరజ్ చోప్రా, వెబర్, జాకబ్ వాడ్లెచ్, అర్షద్ నదీమ్‌లాంటి స్టార్లు తడబడిన చోట.. వారిని మించిన ప్రదర్శనతో ఆకట్టుకొని ఇప్పుడు జావెలిన్ త్రోలో నయా సంచలనంగా మారాడు.

గాయం దెబ్బతీసిందా..?

గతంలో ఎన్నడూ లేనంతగా నీరజ్ ఈసారి దారుణంగా విఫలమవడానికి కారణం అతను గాయానికి గురవడమేనని తెలుస్తోంది. టోర్నీకి రెండు వారాల ముందు నుంచే నీరజ్ వెన్నునొప్పితో బాధపడుతున్నాడని భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) అధికారి ఒకరు వెల్లడించారు. ఒకరకంగా వెన్నునొప్పి కూడా తన ప్రదర్శనపై ప్రభావం చూపిందని ఫైనల్స్ ముగిసిన అనంతరం నీరజ్ తెలిపాడు. కాగా, గత ఏడేళ్లలో పోటీపడిన ప్రతి ఈవెంట్‌లోనూ పతకం గెలిచిన 27 ఏళ్ల నీరజ్.. ఓ టోర్నీలో పతకం లేకుండా రావడం ఇదే మొదటిసారి. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించిన నీరజ్.. గత పారిస్ ఒలింపిక్స్‌లో రజతం నెగ్గాడు. ఇక, 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం గెలిచిన నీరజ్.. గత టోర్నీ (2023)లో పసిడి సాధించాడు.



48 సెకన్లలోపే..

అమెరికా స్టార్ అథ్లెట్ సిడ్నీ మెక్‌లానిన్ లివ్రోన్ 400 మీటర్ల రేసులో సరికొత్త చరిత్ర సృష్టించింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భాగంగా గురువారం జరిగిన మహిళల 400 మీటర్ల రేసును మెక్‌లానిన్.. 47.78 సెకన్లలో ముగించి స్వర్ణం అందుకుంది. ఈ క్రమంలో గడచిన 40 ఏళ్లలో.. ఈ రేసును 48 సెకన్లలోపు పూర్తి చేసిన తొలి మహిళా అథ్లెట్‌గా 26 ఏళ్ల మెక్‌లానిన్ రికార్డుకెక్కింది. చివరిసారిగా 1985లో జర్మనీ అథ్లెట్ మరిటా కోచ్ 47.60 సెకన్లలో మహిళల 400 మీటర్ల రేసును పూర్తి చేసింది.

స్పోర్ట్స్



'సూపర్' ప్రాక్టీస్ కావాలని..

ఆసియాకప్

- నేడు ఒమన్‌తో భారత్ పోరు
- రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

అబుధాబి: ఆసియాకప్‌లో అజేయంగా దూసుకెళుతున్న టీమిండియా గ్రూప్ 'ఎ'లో తమ ఆఖరి మ్యాచ్ ఆడనుంది. ఇందులో భాగంగా శుక్రవారం ఒమన్‌తో తలపడనుంది. అయితే ఈ నామమాత్రపు మ్యాచ్‌ను సూపర్-4కు సన్నాహకంగా ఉపయోగించుకోవాలని భారత్ భావిస్తోంది. టాపార్డర్ విశేషంగా రాణించడంతో ఇప్పటిదాకా మిడిల్, లోయరార్డర్ బ్యాటర్లకు పెద్దగా అవకాశం దక్కలేదు. ఆడిన రెండు మ్యాచ్‌లు కూడా ఏకపక్షంగానే ముగిశాయి. టాప్-8లోని ముగ్గురు ప్లేయర్లు అసలు బరిలోకి దిగలేదు. ఈ ఆదివారం మరోసారి పాకిస్థాన్‌తో తలపడబోతున్న తరుణంలో బ్యాటర్లకు క్రీజులో తగినంత సమయం లభించాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అందుకే టాస్ గెలిస్తే బ్యాటింగ్ వైపు మొగ్గుచూపవచ్చు. మిడిలార్డర్‌లో శాంసన్, అక్షర్ అసలు బరిలోకే దిగలేదు. మరోవైపు కోచ్ గంభీర్ ఈ మ్యాచ్ కోసం పెద్దగా ప్రయోగాలు చేయాలనుకోవడం లేదు. ఒకవేళ బుమ్రాకు విశ్రాంతినిచ్చి మరో పేసర్ అర్ష్‌దీప్‌ను పరీక్షించవచ్చు. అబుధాబి పిచ్ పేసర్లకు అనుకూలించనుండడంతో హర్షిత్‌ను ఎంపిక చేసినా ఆశ్చర్యం లేదు. అటు ఒమన్ ముందుగా బ్యాటింగ్‌కు దిగితే భారత బౌలర్లను ఎదుర్కొని పూర్తి ఓవర్లు ఆడగలదా అంటే సందేహమే. ఆ జట్టు పాక్‌పై 67, యూఏఈపై 130 రన్స్ మాత్రమే చేయగలిగింది.

అఫ్ఘాన్ అవుట్

సూపర్-4లో శ్రీలంక, బంగ్లాదేశ్

అబుధాబి: ఆసియాకప్‌లో అఫ్ఘానిస్థాన్ పోరాటం ముగిసింది. చావో రేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో గురువారం శ్రీలంకతో పోరులో ఆరు వికెట్ల తేడాతో పోరాడి ఓడింది. ఈ ఫలితంతో గ్రూప్ 'బి' నుంచి లంకతో పాటు బంగ్లాదేశ్ కూడా సూపర్-4లో అడుగుపెట్టింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు సాధించింది. 79/6 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టును చివర్లో నబీ (22 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 60) ఆదుకున్నాడు. ఆఖరి ఓవర్‌లో వరుసగా ఐదు సిక్సర్లతో వణికించాడు. పేసర్ తుషారకు 4 వికెట్లు దక్కాయి. ఛేదనలో లంక 18.4 ఓవర్లలో 171/4 స్కోరు చేసి నెగ్గింది. కుశాల్ మెండిస్ (74 నాటౌట్) అజేయంగా నిలిచాడు. 16వ ఓవర్ వరకు అఫ్ఘాన్ గెలుపు దిశగా సాగుతున్నప్పటికీ, ఆఖర్లో మెండిస్ బాదుడుకు ఆశలు వదులుకుంది.

రెజ్లింగ్‌లో 'నారాయణ' హవా



ఆయుష్, వైష్ణవికి స్వర్ణాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): జమ్మూలో జరిగిన జాతీయ గ్రాప్లింగ్ (రెజ్లింగ్) చాంపియన్‌షిప్‌లో నారాయణ స్కూల్స్‌కు చెందిన విద్యార్థులు 3 స్వర్ణాలతో సత్తా చాటారు. అండర్-11 కేటగిరిలో ఆయుష్ ఠాకూర్ 2 పసిడి పతకాలు, అండర్-15లో వైష్ణవి ఠాకూర్ ఓ స్వర్ణం గెలిచారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డా. సింధూర నారాయణ, శరణి నారాయణ.. విద్యార్థులను అభినందించారు. వీళ్ల విజయం.. తమ సంస్థలో మరింతమంది క్రీడల్లో ప్రతిభ చాటేందుకు స్ఫూర్తినిస్తుందన్నారు.

అప్పుల బాధతో దంపతుల ఆత్మహత్యాయత్నం

» భర్త మృతి.. భార్య పరిస్థితి విషమం


నర్సింహులు (ఫైల్)

కొల్చారం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లకు చేసిన అప్పులు తీరక ఓ దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. భర్త మరణించగా, భార్య పరిస్థితి విషమంగా ఉంది. మెదక్ జిల్లా కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన నిరుడు నర్సింహులు (44), యశోద దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు సంతానం. కాగా వారికి మూడేళ్ల క్రితం అప్పు చేసి వివాహాలు చేశారు. నర్సింహులు తనకున్న ఎకరంన్నర అసైన్డ్ భూమిలో ఏటా సాగు చేసినా అప్పులు తీరలేదు. దీంతో అప్పులు తీరే మార్గం కనిపించక భార్యాభర్తలు ఇద్దరూ ఈ నెల 14న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. ఆ బాధ భరించలేక కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి వారిని జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. నర్సింహులు బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందగా, యశోద ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు.

సంతకాలు లేకున్నా డిజిటల్ నోటీసులు చెల్లుబాటు

» జీఎస్టీ పోర్టల్ పనితీరును హైకోర్టు జడ్జీలకు వివరించిన అధికారులు

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అధికారుల సంతకాలు లేకున్నా డిజిటల్ రూపంలో ఇచ్చే నోటీసులు చెల్లుబాటు అవుతాయని జీఎస్టీ విభాగం హైకోర్టుకు తెలిపింది. దీనిని నిరూపించేందుకు సంబంధిత అధికారులు స్వయంగా హైకోర్టుకు వచ్చి జీఎస్టీ పోర్టల్ పనితీరు, కంప్యూటర్ ద్వారా నోటీసుల జారీపై న్యాయమూర్తులకు స్వయంగా వివరించారు. ఫస్ట్‌కోర్టు హాల్‌లో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ శ్యామ్‌కోషి, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ఎదుట పోర్టల్ పనితీరును చూపించారు. జీఎస్టీ చెల్లింపులకు సంబంధించి జారీ చేస్తున్న నోటీసుల్లో సంతకాలు లేకపోవడంతో వాటి చట్టబద్ధతను సవాల్ చేస్తూ వందల సంఖ్యలో పిటిషన్లు దాఖలయ్యాయి. కంప్యూటరైజ్డ్ నోటీసులను డౌన్‌లోడ్ చేసుకున్నప్పుడు సంతకం ఉండటం లేదని పిటిషనర్లు ఆరోపించారు. ఇవన్నీ చీఫ్ జస్టిస్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. దీనిపై ప్రాక్టికల్‌గా తమకు వివరణ ఇవ్వాలని చీఫ్ జస్టిస్ ఆదేశించడంతో రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కే హరిత, కేంద్ర జీఎస్టీ కమిషనర్ శ్రీనివాస్ గురువారం కోర్టుకు ప్రత్యక్షంగా హాజరయ్యారు. జీఎస్టీ పోర్టల్ పనితీరు, డిజిటల్ కీతో సంతకం చేసిన నోటీసుల జారీపై గంటన్నరపాటు ప్రాక్టికల్‌గా వివరణ ఇచ్చారు. డౌన్‌లోడ్ సమయంలో డిజిటల్ సంతకాలు లేకపోయినా ఉన్నట్లుగా పరిగణించాలని చెప్పారు. ఈ పిటిషన్లకు సంబంధించి నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని జీఎస్టీ అధికారులకు చీఫ్ జస్టిస్ ఆదేశించారు. ప్రత్యుత్తరం ఇవ్వడానికి పిటిషనర్లకు మరో రెండు వారాలు సమయమిస్తూ.. తదుపరి విచారణ అక్టోబర్ 30కి వాయిదా వేశారు.

క్రిమినల్ కేసులు కొట్టేయాలని హైకోర్టులో హరీశ్‌రావు పిటిషన్లు

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తనపై నమోదైన మూడు క్రిమినల్ కేసులు కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. గతేడాది ఆగస్టు 15లోగా రైతులందరికీ రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి మీద ఒట్టేసి రైతులను దగా చేశారని, ఒట్టు వల్ల రాష్ట్ర ప్రజలకు ఎలాంటి కీడు జరగకూడదని కోరుతూ హరీశ్‌రావు యాదగిరిగుట్ట ఆలయంలో పాప పరిహార పూజలు చేశారు. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ కార్యక్రమంలో భాగంగా పూజలు చేయడం సమంజసం కాదని ఈవో భాస్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు హరీశ్‌తోపాటు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత తదితరులపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. పోలీసులు, ఈవో కౌంటర్లు దాఖలు చేయాలని పేర్కొంటూ తదిపరి విచారణను అక్టోబర్ 14కు వాయిదా వేసింది. హరీశ్‌రావు, ఆయన అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొంటూ చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు మరో కేసు నమోదు చేశారు. దీనిపై దాఖలైన క్వాష్ పిటిషన్‌పై నోటీసులు జారీ చేసిన ఇదే ధర్మాసనం తదుపరి విచారణను అక్టోబర్ 8కి వాయిదా వేసింది.సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నాయకుడు మెట్టు సాయి చేసిన ఫిర్యాదు మేరకు కరీంనగర్‌లో దాఖలైన కేసు కొట్టివేయాలని ఇంకో పిటిషన్ దాఖలుచేశారు. ఈ కేసుపై ఇప్పటికే దర్యాప్తు పూర్తయి.. ట్రయల్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలైనందున, ఆ ఛార్జిషీట్‌ను సవాల్ చేస్తూ మరో పిటిషన్ వేసుకోవాలని హైకోర్టు సూచించింది.

సైబర్ నేరగాళ్లకు నలుగురు కరంట్ ఖాతా సప్లయర్ల అరెస్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్లకు వివిధ బ్యాంకుల్లో కరంట్ ఖాతాలు అందిస్తోన్న నలుగురు ఏజెంట్లను సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 10 సెల్‌ఫోన్లు, 10 బ్యాంకు ఖాతాల పాస్‌బుక్‌లు, 2 చెక్ బుక్‌లు, 10 డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. హస్తినాపురం వాసి నుంచి ట్రేడింగ్ యాప్ ద్వారా సైబర్ మోసగాళ్లు స్వాహా చేసిన రూ. 4,87,10,944ల్లో అధిక మొత్తం ఉగ్ర నరిసింహులు అనే వ్యక్తి రితానా ప్రాపర్టీస్ కరెంట్ బ్యాంకు ఖాతాకు బదిలీ అయ్యాయి. రంగంలోకి దిగిన సైబర్ క్రైం పోలీసులు.. రితానా ప్రాపర్టీస్ ఖాతా ఆధారంగా చేపట్టిన దర్యాప్తులో కడప జిల్లా వాసి శివారెడ్డి, జగద్గిరిగుట్ట వాసులు మహ్మద్ మొహినుద్దీన్ షేక్, పసుపులేటి రాజేశ్ ఒక ముఠాగా ఏర్పడ్డారని తేలింది. బోగస్ చిరునామాలు/ పత్రాలతో వివిధ బ్యాంకుల్లో కరంట్ ఖాతాలను తెరిచి.. ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లో వాటి లావాదేవీలు నిర్వహించేవారు. ఈ ఖాతాల ఫోన్ నంబర్ సిమ్ కార్డులు, ఇతర వివరాలను మొహినుద్దీన్‌కు అప్పగిస్తే.. అతడు ఇండోర్‌కెళ్లి సైబర్ నేరగాళ్ల ఏజెంట్‌ను కలిసేవాడు. ప్రతి కరంట్ ఖాతాకు రూ.లక్ష చొప్పున మొహినుద్దీన్‌కు ఏజెంట్ ఇచ్చేవాడు. ఈ ఖాతాల్లో డబ్బు జమ కాగానే ఇండోర్ నుంచి సైబర్ నేరగాళ్లు డ్రా చేసే వారు. కాంబోడియా నుంచి చైనీయులు నిర్వహిస్తున్న సైబర్ క్రైం ముఠాలకు పరోక్ష సహకారం అందించే వారని సైబర్ క్రైం పోలీసుల దర్యాప్తులో తేలింది. అయితే మొయినుద్దీన్ తనకు వచ్చిన రూ.లక్షలో రూ.50 వేల నగదు మాత్రమే ఖాతాదారులకిచ్చేవాడని రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్ చెప్పారు.

ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్టు మృతి

చింతూరు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్టు ఒకరు మృతి చెందారు. సుక్మా జిల్లా గాదిరాజ్ పోలీస్‌స్టేషన్ పరిధి గుప్తి పెర్మాపారా అటవీ ప్రాంతం మధ్యలో ఉన్న కొండల్లో గురువారం సాయుధ బలగాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈక్రమంలో మావోయిస్టులకు, సాయుధ బలగాలకు ఎదురుకాల్పులు జరిగినట్టు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్‌చవాన్ స్పష్టం చేశారు. ఈ ఘటనలో మహిళా మావోయిస్టు మృతి చెందినట్లు ఆయన ప్రకటించారు. మృతిచెందిన మావోయిస్టును మలంగీర్ మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యురాలు బూస్కీ నుప్పోగా గుర్తించామని, ఆమెపై రూ.5లక్షల రివార్డు ఉందని వివరించారు.

ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాకు చెందిన ఆరుగురు మావోయిస్టులు గురువారం భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు ఎదుట లొంగిపోయారు. వీరిలో బస్తర్ దక్షిణ ప్రాంత ఏరియా కమిటీలో సభ్యుడిగా పనిచేస్తున్న మడకం దేవా అలియాస్ దినేశ్, పార్టీ మెంబర్ జోగా మడివి, మిలిషీయా సభ్యులు ఉన్నారు. ఆదివాసీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమానికి మావోయిస్టులు ఆకర్షితులయి, జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకున్నారని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా లొంగిపోయిన వారికి తక్షణ సహాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేల చెక్కును పోలీసులు అందజేశారు.

జూరాల.. వరదాయిని



ఈ రిజర్వాయర్ కేంద్రంగా 16 ప్రాజెక్టులు.. 247 టీఎంసీల తరలింపునకు సర్కారు పావులు

» డీపీఆర్ తయారీకి ఇప్పటికే జీవో 34 జారీ
» ప్రతిని బ్రిజేష్ ట్రైబ్యునల్‌కు ఇవ్వాలని నిర్ణయం
» డీపీఆర్ తయారీ బాధ్యత ప్రాజెక్టుల సీఈలకు
» కృష్ణా జలాల వినియోగంపై ప్రభుత్వం దృష్టి

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోతిరెడ్డిపాడు, బనకచర్ల.. కృష్ణా జలాలను వాడుకోవడానికి శ్రీశైలం ప్రాజెక్టు కేంద్రంగా ఏపీ చేపట్టిన భారీ ప్రాజెక్టులు! ఇక్కడి నుంచే వివిధ ప్రాంతాలకు నీటిని తరలిస్తోంది! దీనికి కౌంటర్‌గా తెలంగాణలోనూ ప్రాజెక్టులు నిర్మించాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది. కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకోవాలని భావిస్తోంది. శ్రీశైలం కంటే ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టును ఇందుకు ప్రధాన కేంద్రంగా ఎంచుకుంది. జూరాల కేంద్రంగా 247 టీఎంసీలను వినియోగించుకునేందుకు వీలుగా ప్రాజెక్టులను నిర్మించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు 16 ప్రాజెక్టుల డీపీఆర్‌లు సిద్ధం చేయడానికి వీలుగా జీవో నంబరు 34ను జారీ చేసింది. ప్రస్తుతానికి దీనిని ఈనెల 23వ తేదీ నుంచి జరగనున్న జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ (కృష్ణా ట్రైబ్యునల్-2)కు అందిస్తుంది. ఇక, ఈ ప్రాజెక్టులన్నీ వనపర్తి, సూర్యాపేట్, నాగర్‌కర్నూలు, మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, హైదరాబాద్ చీఫ్ ఇంజనీర్ల పరిధిలో ఉన్నాయి. దాంతో, డీపీఆర్‌లను సిద్ధం చేసే బాధ్యతను వారికి అప్పగించనుంది. ప్రస్తుతం ట్రైబ్యునల్‌లో కృష్ణా జలాల పంపిణీపై విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. తెలుగు రాష్ట్రాలు వీటిపై తుది వాదనలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి ఏపీకి బచావత్ ట్రైబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీలతోపాటు పోలవరం ప్రాజెక్టు నుంచి కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీల్లో ఎగువ రాష్ట్రాల వాటా 45 టీఎంసీలు, జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ కేటాయించిన జలాలన్నీ కలుపుకొని 1050 టీఎంసీలపై ప్రస్తుతం వాదనలు జరుగుతున్నాయి. అయితే, పాత ప్రాజెక్టులు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, భవిష్యత్‌లో కట్టే ప్రాజెక్టులు కలుపుకొని 904 టీఎంసీలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. కృష్ణా జలాల్లో 904 టీఎంసీలను తెలంగాణకు కేటాయించేలా వాదనలు వినిపించాలని, ఆ మేరకు ప్రాజెక్టుల నిర్మాణాల కోసం అవసరమైన సమగ్ర ఇన్వెస్టిగేషన్లు, ప్రాజెక్టుల సామర్థ్యం పెంపు, డీపీఆర్‌ల తయారీపై దృష్టి సారించాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించారు కూడా. ఇందులో భాగంగానే, జూరాల కేంద్రంగా 247 టీఎంసీల ప్రాజెక్టులను చేపట్టాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది.

ఆ వివరాలు ఇవే

- 100 టీఎంసీలతో జూరాల వరద కాలువ పథకం. ప్రతిరోజూ 2 టీఎంసీల నీటిని ఈ పథకం కింద ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలకు తరలిస్తారు. కాలువ వెంట గ్రామాల్లో రిజర్వాయర్లు, చెరువులు నింపుతూ 11.3 లక్షల ఎకరాలకు నీటిని అందించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం.
- జూరాల జలాశయం బ్యాక్ వాటర్‌పై 123 టీఎంసీలతో కోయిల్‌కొండ-గండీడ్ ఎత్తిపోతల పథకం. వరద సమయంలో నీటిని తరలించడం, 45 టీఎంసీలతో కోయిల్‌కొండ రిజర్వాయర్ సామర్థ్యం పెంచడం, 35 టీఎంసీలతో గండీడ్ రిజర్వాయర్, 43 టీఎంసీలతో దౌలతాబాద్ రిజర్వాయర్ల సామర్థ్యం పెంపు కోసం డీపీఆర్‌ను సిద్ధం చేయడం.
- కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి 13,500 ఎకరాలకు సాగునీటితోపాటు తాగునీటి అవసరాలు తీర్చడానికి 3.30 టీఎంసీలతో కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం.
- జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా 4 టీఎంసీల సామర్థ్యంతో రేలంపాడు రిజర్వాయర్‌ను కట్టగా.. దాని సామర్థ్యాన్ని 10 టీఎంసీలకు పెంచనున్నారు.
- గట్టు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సామర్థ్యం 1.32 టీఎంసీల నుంచి 5/10 టీఎంసీలకు పెంపు.
- జవహర్ నెట్టెంపాడు రెండో దశలో భాగంగా 25 వేల ఎకరాలకు సాగునీటిని అందించడానికి వీలుగా జూరాల ప్రాజెక్టు నుంచి 4 టీఎంసీలను అదనంగా వినియోగించడం.
- పులిచింతల రిజర్వాయర్ నుంచి నీటిని వాడుకునేలా సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో 0.5 టీఎంసీల ఎత్తిపోతల పథకాల నిర్మాణం
- శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం రెండో దశను చేపట్టడం. దీనికింద 13 టీఎంసీలను తరలించి.. 93,531 ఎకరాలకు సాగు, 7.12 టీఎంసీలతో తాగునీటిని అందించేలా డీపీఆర్.
- మహబూబాబాద్ జిల్లా నర్సింహులుపేట మండలం జయాపురంలోని ఆకేరు వాగు నుంచి 2 టీఎంసీలను మళ్లించి, 11,250 ఎకరాలకు సాగునీటిని అందించడానికి బ్యారేజీ నిర్మాణం.
- మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం విస్సంపల్లె గ్రామంలో ఆకేరు వాగుపై బ్యారేజీ కట్టి.. 1.2 టీఎంసీల నీటిని తరలించి, 11,799 ఎకరాలకు సాగునీరు అందించడం.
- మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం ములకనూరు గ్రామంలో మున్నేరు నదిపై బ్యారేజీ నిర్మాణం. 1.2 టీఎంసీల నీటిని తరలించి, 11,871 ఎకరాలకు సాగునీటిని అందించడం.
- మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ములకపల్లిలో 25 నుంచి 35 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మాణం.
- ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం ఏడూళ్ల చెరువు గ్రామం వద్ద ఆకేరు నదిపై బ్యారేజీ కట్టి.. 1.3 టీఎంసీల జలాలను తరలించి, 13,129 ఎకరాలకు సాగునీటిని అందించడం.
- శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టులో భాగంగా నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామం వద్ద శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి రోజుకు 1 టీఎంసీ చొప్పున 35 రోజుల్లో 35 టీఎంసీలు తరలించి, ఉమ్మడి నల్గొండ జిల్లాలో 3.99 లక్షల ఎకరాలకు సాగు, తాగునీటిని అందించేలా ప్రాజెక్టు నిర్మాణం.
- హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంతోపాటు రీజినల్ రింగు రోడ్డు లోపలి గ్రామాలకు తాగునీటిని అందించడానికి వీలుగా 10 టీఎంసీల చొప్పున దేవులమ్మ నాగారం, దండు మైలారంలో, ఆరుట్లలో 5-10 టీఎంసీలతో జలాశయాల నిర్మాణం కోసం ఇన్వెస్టిగేషన్. డీపీఆర్ తయారీ.

నేనెందుకు రాజీనామా చేస్తా?

» కొత్త పార్టీ పెడుతున్నానడం.. అవాస్తవం
» సోషల్ మీడియా ప్రచారం నమ్మొద్దు
» ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



చిట్యాలరూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి తాను రాజీనామా చేస్తున్నట్లుగా వస్తున్న వార్తలు అబద్ధమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. అయినా.. తానెందుకు రాజీనామా చేస్తానని ప్రశ్నించారు. తాను పార్టీ మారుతున్నానని, కొత్త పార్టీ ఏర్పాటు చేస్తున్నానని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నుంచి ఎంపీగా, ఎమ్మెల్సీగా, రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనకు కాంగ్రెస్, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ అంటే ఎంతో అభిమానమని, తమ కుటుంబ నేపథ్యం కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు వెళ్లే క్రమంలో నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులోని ఓ హోటల్ వద్ద గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. విజయవాడలో దుర్గమ్మ వారిని దర్శించుకుని, అక్కడినుంచి గుంటూరులో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు తాను వెళ్తుంటే.. ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసేందుకు వెళుతున్నానంటూ ప్రచారం చేయడం సరికాదన్నారు. తన రాజకీయ భవిష్యత్తు గురించి తానే మీడియా సమావేశం నిర్వహించి చెబుతానని, ఇలాంటి పుకార్లను నమ్మవద్దని కోరారు. కాళేశ్వరంలో అవినీతి జరగలేదంటూ తాను మాట్లాడినట్టుగా, ఆ విషయం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైనట్టుగా, సీఎం రేవంత్‌పై తాను ఎలాంటి విమర్శలు చేయకపోయినా.. చేసినట్టుగా ప్రచారం చేస్తూ తన ప్రతిష్ఠను దెబ్బ తీస్తున్నారని మండిపడ్డారు. కాగా, గుంటూరులో జరిగే కార్యక్రమానికి వెళ్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కాన్వాయ్‌లో 70కార్లు ఉండడం ఆసక్తి రేకెత్తించింది.

గిన్నిస్ రికార్డుల్లోకి 63 అడుగుల బతుకమ్మ

» ఎల్బీ స్టేడియంలో 10వేలమందితో సంబరాలు
» రాష్ట్రవ్యాప్తంగా 21 నుంచి 31 దాకా వేడుక
» వరంగల్ వేయి స్తంభాల గుడిలో ప్రారంభం
» ప్రజ భాగస్వాములు కావాలి: జూపల్లి
» గతంలో బతుకమ్మను రాజకీయం చేశారు
» పార్టీలకతీతంగా వేడుక: మహేశ్‌గౌడ్



హైదరాబాద్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎల్బీ స్టేడియంలో ఈ నెల 28న 10వేల మంది బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నామని, గిన్నిస్ బుక్ రికార్డుల్లో చేర్చేలా 63 అడుగుల ఎత్తైన బతుకమ్మను ఏర్పాటు చేయనున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నామని తెలిపారు. 21న వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి వద్ద ప్రారంభం కానున్న సంబరాలు.. 31వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఈ వేడుకల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఎంగిలి పువ్వుల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. బతుకమ్మను కొందరు రాజకీయం చేయడంతో 2000వ సంవత్సరం నుంచే ఈ పండుగ జరుగుతోందన్న అపోహ ఉందన్నారు. పార్టీలకు అతీతంగా పండుగను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని బతుకమ్మ కుంటను కాపాడడంలో సీఎం రేవంత్‌రెడ్డి, వి.హనుమంతరావు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.

వైద్యం చేయడంలో నిర్లక్ష్యం

» రిపోర్టుల్లో తప్పులు, లేని క్యాన్సర్ ఉన్నట్టు చెప్పి శస్త్రచికిత్స
» కార్ఖానలోని సౌమ్య ఆస్పత్రిపై పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైద్యం చేయడంలో నిర్లక్ష్యం వహించిన ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుల నిర్వాకం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. తప్పుడు రిపోర్టులతోపాటు అనవసరంగా శస్త్ర చికిత్స చేయించుకునేలా చేసిన ఆస్పత్రిపై ఈ నెల 16న బాధితురాలు హైదరాబాద్ కార్ఖాన పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంగళ్‌రావునగర్‌కు చెందిన బసిరెడ్డి సునీత కార్ఖానలో ఉన్న సౌమ్య ఆస్పత్రిలో తన ఎడమ రొమ్ములో కణితికి 2022లో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. అన్ని మెడికల్ రిపోర్టులు (హిస్టోపాథాలజీ అండ్ డిశ్చార్జ్ సమ్మరీ సహా) క్యాన్సర్ కణితి కాదని నిర్ధారించాయి. 2024 సెప్టెంబరులో ఆమె తదుపరి చెకప్‌కు వెళ్లినప్పుడు ఆమె ఎడమ రొమ్ము బయాప్సీకి వైద్యులు సూచించారు. కానీ తన అనుమతి లేకుండా కుడి రొమ్ముపై బయాప్సీ చేసినట్టు ఆమె పేర్కొన్నారు. అదే ఏడాది అక్టోబరు 3న బయాప్సీ రిపోర్టులో ఆమె వయస్సును 54కు బదులుగా 74 అని పేర్కొన్నారు. 2024 అక్టోబరు 10న వచ్చిన మరో రిపోర్టులో ఆమెకు డీసీఐఎస్ (డక్టల్ కార్సినోమా ఇన్ సిటు- స్తనాల్లోకి క్షీర గ్రంథుల్లో వచ్చే క్యాన్సర్‌కు ముందు దశ) చరిత్ర ఉందని తప్పుగా పేర్కొన్నారు. దీనిపై తాను అభ్యంతరం చెప్పడంతో పెన్నుతో సరిదిద్దారని ఆమె పేర్కొన్నారు. తప్పుడు క్యాన్సర్ నిర్ధారణను నమ్మి ఆమె అత్యవసర శస్త్రచికిత్స చేయించుకున్నారు. తర్వాత ఆమెకు అనుమానం రావడంతో ఆమె బయాప్సీ స్లైడ్‌లు, టిష్యూ బ్లాక్‌ను బయటి ప్రయోగశాలల్లో (లైఫ్ ఆన్‌కోపాత్ అండ్ ఎయిమ్స్ బీబీనగర్) పరీక్ష చేయించారు. స్లైడ్, టిష్యూ బ్లాక్ మధ్య పొంతన లేదని వెల్లడైంది. ఈ క్రమంలో తనకు రూ.లక్ష ఆర్థిక నష్టం వాటిల్లడంతోపాటు మానసిక వేదనను చవిచూసినట్టు ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బాధితురాలి ఫిర్యాదు మేరకు సౌమ్య ఆస్పత్రి వైద్యులైన డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సౌమ్యతో పాటు ఆస్పత్రి సిబ్బందిపై కార్ఖానా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండల కార్యాలయాలకు కొత్త భవనాలు

» ఎంపీడీవో, ఎమ్మార్వో, పోలీస్ స్టేషన్ల కోసం నిర్మాణం
» ఉన్నచోటే కొత్తగా కొన్ని.. మరికొన్ని చోట్ల సమీకృత భవనాలు
» ప్రస్తుతానికి ఖమ్మం, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో పనులు

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మండలాల్లో ఎంపీడీవో, ఎమ్మార్వో, పోలీస్‌స్టేషన్ సహా మరికొన్ని ప్రభుత్వ విభాగాలకు కొత్త కార్యాలయాలు రానున్నాయి. ఈ కార్యాలయాలను కొన్నిచోట్ల సమీకృత భవనం తరహాలో నిర్మిస్తారు. మరికొన్ని చోట్ల కార్యాలయాలు ఉన్నచోటే కొత్తవి నిర్మిస్తారు. ప్రస్తుతానికి ఖమ్మం జిల్లాలో ఒక మండలం, యాదాద్రి జిల్లా పరిధిలో రెండు మండలాలు, సూర్యాపేట జిల్లాలో మూడు మండలాల్లో కొత్త కార్యాలయాల నిర్మాణం పనులను చేపట్టనున్నారు. ఇదే సూర్యాపేట జిల్లాలో మరికొన్ని అభివృద్ధి పనులను కూడా మంజూరు చేశారు. ఈ మూడు జిల్లాల్లో పనులకు సంబంధించి రూ.97.91 కోట్ల నిధులు అవసరపడతాయని నిర్ణయించి, ఈ మేరకు పరిపాలనాపరమైన అనుమతులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఖమ్మం, యాదాద్రి జిల్లాల్లో ఉత్తర్వులు ఆర్‌అండ్‌బీ నుంచి సూర్యాపేట జిల్లాలో జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలంలో మొదటిసారిగా సమీకృత మండల కార్యాలయాల భవనాన్ని నిర్మించనున్నారు. ఎంపీడీవో, ఎమ్మార్వో, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు, ఆర్‌అండ్‌బీ డివిజినల్ ఆఫీసు, అడిషనల్ కమీషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయం సహా మరో 11 ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యాలయాలన్నింటినీ ఒకేచోట ఏర్పాటుచేయనున్నారు. రూ.45కోట్లతో గ్రౌండ్‌ప్లస్ 2 విధానంలో సమీకృత భవనాన్ని నిర్మించనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోటకొండూరు మండలంలో రూ.2.60కోట్లతో ఎమ్మార్వో కార్యాలయం, రూ.3.50కోట్లతో ఎంపీడీవో, రూ.2.65 కోట్లతో పోలీస్ స్టేషన్ నిర్మించనుండగా వీటికోసం రూ.8.25 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఇదే యాదాద్రి జిల్లా పరిధిలోని అడ్డగూడూర్ మండలంలో కూడా రూ.3.50 కోట్లతో పోలీస్‌స్టేషన్, రూ.4కోట్లతో ఎంపీడీవో, రూ.3.75కోట్లతో ఎమ్మార్వో ఆఫీసులను నిర్మించనున్నారు. ఈ మూడింటి కోసం రూ.11.25 కోట్లను వెచ్చించనున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని అనంతగిరి మండలంలో రూ.2.61కోట్లతో ఎమ్మార్వో ఆఫీసు, రూ.2.98కోట్లతో ఎంపీడీవో, రూ.2.38 కోట్లతో పోలీస్ స్టేషన్లను ఏర్పాటుచేయనున్నారు. అలాగే సూర్యా పేట జిల్లా చింతపాలెం, పాలకీడు మండలాల్లోనూ పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో, ఎమ్మార్వో కార్యాలయాల కోసం రూ.15.94 కోట్లను వెచ్చించనున్నారు. సూర్యాపేట జిల్లా పరిధిలోని కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో మరికొన్ని అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. సూర్యాపేట జిల్లా పరిధిలో రూ.33.41కోట్లతో మొత్తం 16 పనులను మంజూరు చేశారు.

దసరాకు 7754 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ ఆర్టీసీ 7754 ప్రత్యేక బస్సులను నడపనుంది. ఇందులో 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కూడా కల్పించింది. ఈ నెల 30న సద్దుల బతుకమ్మ, అక్టోబరు 2న దసరా ఉన్నందున.. ఈ నెల 20న ఆ తర్వాత 27 నుంచి అక్టోబరు 2 వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. అలాగే, తిరుగు ప్రయాణానికి సంబంధించి అక్టోబరు 5, 6వ తేదీల్లోనూ రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేయనుంది. హైదరాబాద్‌లో ప్రధాన బస్టేషన్లయిన ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్‌తోపాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్‌సుఖ్ నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాల నుంచి ఈ బస్సులను నడిపించనుంది. పూర్తి సమాచారం కోసం టీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించవచ్చని సూచించారు. దసరా ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేయనున్నారు. ఈ నెల 20తో పాటు 27 నుంచి 30 వరకు వరకు, అలాగే అక్టోబరు 1, 5, 6 తేదీల్లో నడిచే స్పెషల్ బస్సుల్లోనే మాత్రమే అదనపు చార్జీలు అమల్లో ఉంటాయని యాజమాన్యం ప్రకటించింది.

భూపాలపల్లి భూగర్భ గనిలో ప్రమాదం

» నలుగురు కార్మికులకు అస్వస్థత, తప్పిన ప్రాణాపాయం


ప్రమాద వివరాలు తెలుసుకునేందుకు గనిలోకి దిగుతున్న సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి భూగర్భ గనిలో ప్రమాదం చోటు చేసుకుంది. కేటీకే 5 ఇంక్లైన్ రెండో లెవెల్ మ్యాన్ రైడింగ్ వద్ద వెల్డింగ్ చేస్తున్న క్రమంలో నిప్పంటుకుని విషవాయువులు వెలువడ్డాయి. ఈ ప్రమాదంలో నలుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ఘటన జరిగిన వెంటనే రెస్క్యూ, సేఫ్టీ, ఫైర్ అధికారులు అక్కడకు చేరుకొని మంటలను ఆర్పేశారు. బాధితులను హుటాహుటిన సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అధికారులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మొదటి షిఫ్టు పూర్తయి కార్మికులు బయటకు వస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే బాధితుల్లో ముగ్గురు దాసరి అన్వేశ్, రాయారపు రంజిత్, రములు అస్వస్థతకు గురై శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సొన్నాయిల క్రాంతికుమార్ మరో వ్యక్తి గనిలోనే ఇరుక్కుపోయి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో సుమారు అరగంట పాటు అధికారులు సహాయక చర్యలు చేపట్టి అతడిని కాపాడారు.


నేలకూలిన శివాల మర్రిని నిలబెట్టిన దృశ్యం

ఐనవోలు శివాల మర్రికి పునరుజ్జీవం



ఐనవోలు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఇటీవల నేలకూలిన శివాల మర్రి చెట్టుకు రీప్లాంటేషన్ పద్ధతిలో పునరుజ్జీవం కల్పించారు. వెయ్యేళ్ళ చరిత్ర కలిగిన శివాల మర్రి వేర్లు దెబ్బతిని ఈ నెల 14న సాయంత్రం కూకటివేళ్లతో నేలకూలింది. మరుసటి రోజు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఈవో సుధాకర్‌లు శివాల మర్రిని సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే అటవీ, ఉద్యాన శాఖల అధికారులు, వృక్ష శాస్త్రవేత్తలతో ఫోన్‌లో మాట్లాడి.. శివాల మర్రికి పునరుజ్జీవంపై సాధ్యాసాధ్యాలను అడిగి తెలుసుకున్నారు. రీప్లాంటేషన్ పద్ధతిలో అక్కడే నిలబెట్టవచ్చని అధికారులు వివరించారు. ఈ బాధ్యతను మాజీ ఎంపీటీసీ బొల్లేపల్లి మధుచంద్ర గౌడ్‌కు అప్పజెప్పారు. దీంతో వృక్ష శాస్త్రవేత్తల సలహాలు పాటిస్తూ గ్రామస్థులు మూడు రోజులు సమష్టిగా శ్రమించారు. రవీందర్‌రావు, ఎస్సై పస్తం శ్రీనివాస్ తదితరులు సహకరించారు. ముందుగా చెట్టు కొమ్మలను తొలగించారు. వేరు వ్యవస్థ పూర్తిగా దెబ్బతినకపోవడంతో చెట్టు అడుగు భాగం వద్ద జేసీబీలతో వెడల్పుగా గొయ్యి తవ్వి మట్టిని వదులు చేశారు. రెండు పెద్ద క్రేన్ల సాయంతో చెట్టును పాతచోటే నిలబెట్టారు. దీనికి సుమారు రూ.2 లక్షలు ఖర్చయింది.



మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలి

» ఇంజినీర్స్ అసోసియేషన్‌తో మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో శాఖకు మంచి పేరు తీసుకురావడంతో పాటు ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలని రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్లతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఇటీవల శాఖలో నూతనంగా ఎన్నికైన ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిని ఒప్పించి శాఖలో ఏళ్ల తరబడి పెండింగ్ ఉన్న సర్వీస్ రూల్స్‌ను ఆమోదించుకుని పదోన్నతులు ఇచ్చామన్నారు. ఆమోదయోగ్యమైన సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేస్తానన్న మంత్రి ఉద్యోగులంతా మరింత ఉత్సాహంతో పనిచేయాలని సూచించారు. పదోన్నతులు కల్పించినందుకు అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఎన్.శ్రీను, ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి పి.శరత్, కోశాధికారి మహేందర్, ఉపాధ్యక్షులు కె.సంధ్య, వేణు, ప్రదీప్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులు నవీన్, కిషన్, అరుణ్‌రెడ్డితో పాటు పలువురు ఇంజినీర్లు ఉన్నారు.

ప్రొటోకాల్ వివాదం..
రాజన్న-సిరిసిల్ల కలెక్టర్‌కు ప్రభుత్వం నోటీసు

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ప్రొటోకాల్ నిబంధనలు పాటించకపోవడంపై రాజన్న-సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు గురువారం ప్రభుత్వం నోటీసు జారీ చేసింది. ఈ నెల 22లోపు సంజాయిషీ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ నెల 17న రాజన్న-సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రొటోకాల్ ప్రకారం.. కలెక్టర్ ముందస్తుగానే ఉత్సవానికి చేరుకుని, ముఖ్య అతిథిని వేదికపైకి ఆహ్వానించాలి. కానీ... కలెక్టర్ సకాలంలో రాకపోవడంతో ఆది శ్రీనివాసే వేదికపైకి వెళ్లి జెండాను ఆవిష్కరించారు. జాతీయ గీతాలాపన ముగిసే సమయంలో కలెక్టర్ వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ విషయాన్ని ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి తెచ్చారు.

50 శాతానికి పైగా
ఆస్పత్రుల్లో కొనసాగిన ఆరోగ్య శ్రీ సేవలు

» ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో ప్రకటన

తెలంగాణ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ బంద్ పిలుపు ఉన్నప్పటికీ రాష్ట్రంలోని 50 శాతానికిపైగా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో గురువారం ఆరోగ్య శ్రీ సేవలు కొనసాగాయని ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో ఉదయ్‌కుమార్ ప్రకటించారు. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్‌లో మొత్తం 477 ఎంప్యానెల్డ్ ఆస్పత్రులు ఉండగా, అందులో 50 శాతం కంటే ఎక్కువ ఆస్పత్రులు సేవలు అందిస్తున్నాయని వివరించారు. గత రెండు వారాల్లో ఆరోగ్య శ్రీ కింద రోజుకు సగటున 844 శస్త్రచికిత్సలు జరిగేవని, ప్రస్తుతం కొన్ని ఆస్పత్రులు సేవలు నిలిపేసినా బుధ, గురువారాల్లో సగటున 814 శస్త్రచికిత్సలు జరిగాయని తెలిపారు. ఆరోగ్య శ్రీ కింద వైద్య సేవలు కొనసాగిస్తున్న ఆస్పత్రుల యజమానులు, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాళోజీ కళాక్షేత్రంలో
కాకతీయ నృత్య నాటకోత్సవాలు

» సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు చరిత్ర, కాకతీయ వైభవాన్ని గుర్తు చేసుకునే విధంగా వరంగల్ కాళోజీ కళాక్షేత్రంలో ఈ నెల 21 నుంచి రెండు రోజుల పాటు కాకతీయ నృత్య నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జీవిత చరిత్రను కళ్ళ ముందుంచే కూచిపూడి నృత్య రూపకం, ఓరుగల్లు చరిత్ర, కాకతీయ వైభవాన్ని గుర్తుచేస్తూ రాణిరుద్రమ జీవితం ఆధారంగా రూపొందించిన చారిత్రక నాటకం, ప్రజా సాహిత్య కళారూపాలు, ప్రదర్శనలు ఉంటాయని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలియజేశారు.

సద్దుల బతుకమ్మను సెలవుగా ప్రకటించాలి

» సీఎస్‌ను కోరిన టీజీఈజేఏసీ నేతలు

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు పవిత్రంగా జరుపుకునే సద్దుల బతుకమ్మను ప్రభుత్వం అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి(టీజీఈజేఏసీ) నేతలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కోరారు. ఈ నెల 30న జరుపుకునే బతుకమ్మ పండుగకు సెలవు ఇవ్వాలని కోరుతూ టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, కో-చైర్మన్ కటకం రమేష్ తదితరులు సచివాలయంలో సీఎస్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు.

శాంతి చర్చలు కోరుతున్న
మావోయిస్టులను చంపడం అన్యాయం

» పౌర సమాజం గళమెత్తాలి: ఆచార్య హరగోపాల్

» వంద రోజులైనా కాల్పుల విరమణ ప్రకటించాలి :చర్చల కమిటీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శాంతి చర్చలు కావాలని అడుగుతున్న మావోయిస్టులను చంపడం అన్యాయమని ఆచార్య హరగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టులు శాంతి చర్చలకు సిద్ధమని చెప్పిన తర్వాత కూడా జరుగుతున్న ఈ దుశ్చర్యపై పౌర సమాజం గళమెత్తాలని కోరారు. ఈ మేరకు హైదరాబాద్, సోమాజీగూడలోని ప్రెస్ క్లబ్‌లో శాంతి చర్చల కమిటీ ప్రతినిధులు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆచార్య హరగోపాల్ మాట్లాడుతూ.. రాజ్యం హద్దులు దాటి ప్రవర్తించినప్పుడు పౌర సమాజం తప్పనిసరిగా గళమెత్తాలని పేర్కొన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టు పార్టీ ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం అమానవీయం అన్నారు. శాంతి చర్చల కమిటీ అధ్యక్షుడు జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవాలని కోరారు. మావోయిస్టు నాయకులంతా ఓ చోట సమావేశమై సమష్టి నిర్ణయం తీసుకునేందుకు కనీసం వంద రోజులైనా కాల్పుల విరమణ ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇక, స్వాతంత్ర్య సమరయోధుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఆయుధాలు వదిలేస్తామంటూ మావోయిస్టు పార్టీ పేరుతో విడుదలైన లేఖ వాస్తవమా కాదా అనే విషయాన్ని పక్కన పెట్టి, కాల్పుల విరమణ ప్రకటించాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలని అభిప్రాయపడ్డారు. విశ్రాంత ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ అధ్యక్షత జరిగిన సమావేశంలో చలపతిరావు, బి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరు మంత్రుల మధ్య కోల్డ్‌వార్!

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి కొండా సురేఖకు తెలియడంతో ఆమె అసహనానికి గురయ్యారు. అటవీ శాఖ హెచ్‌ఓడీగా ఉన్న పీసీసీఎఫ్‌ను నేరుగా పిలవడమంటే మొత్తం శాఖకు సంబంధించిన ఉన్నతాధికారినే పిలిచినట్టు అవుతుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. జిల్లా, నియోజకవర్గానికి సంబంధించిన అంశాలైతే అక్కడి అధికారుల వరకే సమావేశానికి పిలవాల్సిందని పేర్కొన్నట్టు సమాచారం. దీనిపై ఆమె సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. మరోవైపు సదరు మంత్రి మాత్రం తన నియోజకవర్గానికి సంబంధించిన అటవీ అంశాలు కావడంతోనే ఆ అధికారులతో మాట్లాడానని అంటున్నట్టు సమాచారం. ఇంతకుముందు మంత్రి కొండా సురేఖ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారుల తీరునూ తప్పుబట్టారు. కాలుష్య నియంత్రణ బోర్డుకు సంబంధించిన సమీక్షకు హాజరుపై, సరిగా వివరాలు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు అటవీ శాఖ ఉన్నతాధికారుల తీరుపైనా ఆమె మండిపడటం చర్చనీయాంశంగా మారింది.

మూసీ పునరుజ్జీవంలో భాగస్వాములు కండి

» ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ విభాగాల్లో పెట్టుబడులు పెట్టండి

» బ్రిటిష్ హై కమిషనర్‌ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి

» సానుకూలంగా స్పందించిన లిండీ

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మూసీ పునరుజ్జీవంలో బ్రిటిష్ కంపెనీలు భాగస్వాములు కావాలని సీఎం ఎ.రేవంత్ రెడ్డి కోరారు. ఫార్మా, నాలెడ్జ్, అకాడమీ, జీసీసీ విభాగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని భారత్‌లో బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరూన్‌ను కోరారు. ఆమెతో గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. తమ ప్రభుత్వం తేనున్న నూతన విద్యావిధానం ముసాయిదాను వివరించారు. యునైటెడ్ కింగ్‌డమ్ యూనివర్సిటీల్లో విద్యనభ్యసించే విద్యార్థుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి అక్కడి యూనివర్సిటీలను నిర్వహించేలా చూడాలని లిండీ కామెరూన్‌ను కోరారు. సీఎం రేవంత్ విజ్ఞప్తులపై బ్రిటిష్ హై కమిషనర్ లిండీ స్పందిస్తూ.. మూసీ పునరుజ్జీవనంలో భాగస్వామ్యంతోపాటు ఫార్మా, నాలెడ్జ్, జీసీసీ, అకాడమీ విభాగాల్లో పెట్టుబడులపై సానుకూలత వ్యక్తం చేశారు. ప్రభుత్వోపాధ్యాయులు, ప్రొఫెసర్లకు శిక్షణిచ్చేందుకూ సుముఖత వ్యక్తం చేశారు. విద్య, సాంకేతిక రంగాల్లో సహకారానికి తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. సీఎంను కలిసిన వారిలో హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ గారెత్ విన్ ఓవెన్, పొలిటికల్ ఎకానమీ అడ్వైజర్ నళిని రఘురామన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, మరో అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారని సీఎంఓ ఒక ప్రకటనలో తెలిపింది.



బ్రిటిష్ హైకమిషనర్ లిండీ కామెరూన్‌కు జ్ఞాపికను అందిస్తున్న సీఎం రేవంత్

రాష్ట్రంలో అందరూ పేదలే!

(మొదటిపేజీ తరువాయి)

పెరుగుతూ పోతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయేనాటికి రాష్ట్రంలో 89,95,282 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిపై 2,81,47,565 మంది లబ్ధిదారులున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమగ్ర కుటుంబ సర్వే చేపట్టింది. ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించింది. మీ-సేవలో చేసిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంది. పాత, కొత్త దరఖాస్తులు కలిపి 18 లక్షలు వస్తే.. ఇప్పటివరకు 11.27 లక్షల దరఖాస్తులకు ఆమోదం తెలిపి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసింది. దీంతో రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డుల సంఖ్య 1,01,22,324కు.. లబ్ధిదారుల సంఖ్య 3,25,02,345కు చేరింది. మరో 2.50 లక్షల రేషన్ కార్డులు జారీచేస్తామని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. అంటే లబ్ధిదారుల సంఖ్య మరో 10 లక్షలు పెరుగుతుంది. అప్పుడు రాష్ట్రంలోని లబ్ధిదారుల సంఖ్య 3.35 కోట్లకు చేరుతుంది. ఈ లెక్కల ప్రకారం చూస్తే రాష్ట్రంలో 3.50 కోట్ల జనాభా ఉంటే.. 3.35 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువనే ఉన్నారన్నమాట!



నిబంధనలకు పాతర.. కార్డుల జాతర!

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికే ఆహారభద్రత కార్డులు పంపిణీ చేయాలి. అలాగే 5 ఎకరాలకు మించి భూమి ఉన్న వారికి తెల్ల రేషన్ కార్డులు ఇవ్వకూడదు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా కార్డులు ఇవ్వొద్దనే నిబంధన ఉంది. ప్రైవేటు ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షనర్లు, స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ తీసుకునేవారు కూడా అనర్హులే. వైద్యులు, ఇంజనీర్లు, లాయర్లు, చార్టెడ్ అకౌంటెంట్లు తదితర వృత్తి నిపుణులు, పెద్ద వ్యాపారులు, మిల్లర్లు, పెట్రోలు బంకుల నిర్వాహకులు, బోర్‌వెల్ యజమానులు కూడా తెల్ల రేషన్‌కార్డులు తీసుకోవడానికి వీల్లేదు. కార్లు ఉన్న వారూ అనర్హులే. కానీ, ఇలాంటి వారందరికీ తెల్లరేషన్ కార్డులు జారీచేశారు. ఉదాహరణకు రాష్ట్రంలో 25 లక్షల కార్లు ఉన్నాయి. వీరిలో చాలా కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులున్నాయి. 5 ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులు రాష్ట్రంలో 56.11 లక్షల మంది ఉన్నారు. 5-54 ఎకరాల వరకు భూములున్న రైతులు 6 లక్షల మంది ఉన్నారు. వీరిలో చాలా మందికి తెల్ల రేషన్ కార్డులున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది కలిపి 10 లక్షల మంది ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా తెల్ల రేషన్ కార్డులు తీసుకున్నవారిలో ఉన్నారు. రాష్ట్రంలో బియ్యం, పప్పులు, జిన్నింగ్, నూనె మిల్లులు కలిపి 3 వేల వరకు ఉన్నాయి. ఈ మిల్లుల యజమానుల్లో చాలామంది రేషన్ కార్డులు పొందారు. వైద్యులు, ఇంజనీర్లు, లాయర్లు.. తదితర వృత్తి నిపుణులు కూడా రేషన్ కార్డులు తీసుకున్న జాబితాలో ఉన్నారు. రాష్ట్రంలోని మొత్తం కార్డుల్లో కేంద్ర ప్రభుత్వం జారీచేసిన జాతీయ ఆహారభద్రత కార్డులు 56,27,285 ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనలను సడలించి, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా జారీ చేసే కార్డులతోనే లబ్ధిదారుల సంఖ్య పెరుగుతోంది. తద్వారా అనర్హులూ లబ్ధి పొందుతున్నారు.

సంక్షేమ పథకాలే లక్ష్యంగా..

పేదలకు ఆహార భద్రత కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ కార్డులు జారీచేస్తున్నాయి. అయితే వీటిని ఇతర సంక్షేమ పథకాలకు కూడా ప్రామాణికంగా తీసుకుంటుండడంతో రేషన్ కార్డులకు డిమాండ్ పెరిగింది. అధికారులను మచ్చిక చేసుకొని, రాజకీయ నాయకులతో పైరవీలు చేయించుకొని, అవసరమైతే ముడుపులు ముట్టజెప్పి అనర్హులు కూడా రేషన్ కార్డులు తీసుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ, గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీ, వృద్ధాప్య పింఛన్లు, వితంతు, వికలాంగులు, గీతకార్మికులు, బీడీ కార్మికులు, చేనేత కార్మికుల పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్.. తదితర సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నారు. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారు కూడా ఏదో ఒక ప్రభుత్వ పథకానికి ఉపయోగపడుతుందన్న ఆలోచనతో దొడ్డిదారిలో కార్డులు పొందుతున్నారు. ప్రతినెలా రేషన్ బియ్యం అవసరంలేని వారికి కూడా తెల్లకార్డులు ఉన్నాయి. ఇలా ఇబ్బడిముబ్బడిగా కార్డులు జారీచేయడంతో సంక్షేమ పథకాలు దుర్వినియోగం అవుతున్నాయి. ప్రభుత్వం కూడా ఈ పథకాలకు అధిక నిధులు కేటాయించాల్సి వస్తోంది.

పెట్టుబడుల కోసం ఢిల్లీకి!

నేడు పబ్లిక్ అఫైర్స్ ఫోరం వార్షిక సదస్సులో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడుల కోసం పలు ప్రముఖ సంస్థల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీలో భేటీ కానున్నారు. ఈ మేరకు ఆయన గురువారం సాయంత్రం ఢిల్లీకి వెళ్లారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం దాకా బిజీబిజీగా గడపనున్నారు. వివిధ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు, మీడియా, న్యాయ, ఇతర రంగాల సంస్థలు సభ్యులుగా ఉన్న 'పబ్లిక్ అఫైర్స్ ఫోరమ్ ఆఫ్ ఇండియా' 12వ వార్షిక సదస్సులో సీఎం రేవంత్ పాల్గొని ప్రసంగిస్తారు. కార్ల్స్‌బర్గ్, అమెజాన్, కార్గిల్, గోద్రెజ్, ఉబర్ తదితర సంస్థల ప్రతినిధులతో విడివిడిగా భేటీ అయి.. రాష్ట్రంలో పెట్టుబడులు, ప్లాంట్ల విస్తరణపై చర్చిస్తారు. సదస్సుకు ముందు తాజ్‌ప్యాలెస్ హోటల్‌లో అమెరికాలోని న్యూజెర్సీ గవర్నర్ ఫిలిప్ డి.మర్ఫీతో, తర్వాత ప్రపంచ ఆర్థిక సంస్థ (డబ్ల్యూఈఎఫ్) అధ్యక్షుడు బోర్గ్ బ్రెండేతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ ఏడాది జనవరిలో స్విట్జర్లాండ్‌లోని దవోస్‌లో జరిగిన డబ్ల్యూఈఎఫ్ సదస్సులో పాల్గొన్న సీఎం రేవంత్.. తెలంగాణకు భారీగా పెట్టుబడులు వచ్చేలా చూడాలని బోర్గ్ బ్రెండేను కోరారు. తాజాగా మళ్లీ ఆయనతో సీఎం భేటీకానుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను సీఎం రేవంత్ కలవనున్నారు. రాష్ట్రంలో పట్టణాభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్ర నిధులు, సహాయం కోరనున్నారు. కాగా, డెన్మార్క్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ మద్యం తయారీ సంస్థ కార్ల్స్‌బర్గ్ రాష్ట్రంలో పెట్టుబడులకు సిద్ధమైంది. సీఎంతో ఆ సంస్థ ప్రతినిధుల భేటీ అనంతరం దీనిపై ప్రకటన చేసే అవకాశం ఉంది.

మట్టి సేకరణకు అనుమతించాలి

» సీఎంకు కాంట్రాక్టర్లు, బిల్డర్స్ అసోసియేషన్ వినతి

రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, ప్రజారోగ్యం తదితర శాఖల్లో వివిధ రకాల పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు స్థానిక ప్రాంతాల్లోని చెరువులు, కుంటల నుంచి మట్టి సేకరణకు అనుమతించాలని పలువురు కాంట్రాక్టర్లు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆయా ప్రభుత్వశాఖల్లో చేస్తున్న పనుల అవసరాలకు భూమి, మట్టి వినియోగించే సందర్భంలో పలు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎన్ రెడ్డి సీఎంకు సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, ప్రజారోగ్యం తదితర శాఖల్లో చేసే పనుల అంచనాల్లో ప్రభుత్వం మట్టి వ్యయాన్ని చేర్చలేదని గుర్తు చేశారు. ఈ శాఖల్లో చేపడుతున్న పనులకు అవసరమైన మట్టికి స్థానిక చెరువులు, కుంటలపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. కొన్నిచోట్ల మట్టి తీసుకుంటున్నందుకు కాంట్రాక్టర్లపై కేసులు నమోదవుతున్నట్టు డీవీఎన్ రెడ్డి తెలిపారు. కాంట్రాక్టర్లు స్థానిక చెరువులు, ప్రభుత్వ భూముల నుంచి మట్టిని సులభంగా సేకరించేందుకు స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఒకేసారి 404 కేసుల
విచారణ సరికాదు

» రాష్ట్ర సమాచార కమిషన్ నోటీసును కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ ఒకేసారి 404 కేసులను విచారించడం సరికాదని హైకోర్టు పేర్కొంది. ఏయే కేసులను విచారిస్తున్నారో వాటి నంబర్లు కూడా తెలియజేయకపోవడాన్ని తప్పుపట్టింది. ఈ కేసులన్నింటిలో విచారణకు హాజరుకావాలంటూ కమిషన్ వడ్డం శ్యాం అనే సమాచార హక్కు కార్యకర్తకు ఇచ్చిన నోటీసును కొట్టేసింది. పౌరసమాచార అధికారులు, మొదటి అప్పిలేట్ అధికారులు తగిన సమాచారం ఇవ్వకపోవడంతో వడ్డే శ్యాం సెకండ్ అప్పిలేట్ అథారిటీ అయిన రాష్ట్ర సమాచార హక్కు కమిషన్‌లో 404 వేర్వేరు కేసులు దాఖలు చేశారు. వాటిని ఒకేసారి విచారించాలని నిర్ణయించిన కమిషన్.. వాదనలు వినిపించేందుకు రావాలని శ్యాంకు నోటీసు జారీ చేసింది. 404 కేసులను ఒకేసారి విచారించడం సరికాదని పేర్కొంటూ శ్యాం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం జస్టిస్ టీ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదోపవాదాలు విన్న ధర్మాసనం.. ఒకేసారి అన్ని కేసులు విచారిస్తే పిటిషనర్లకు కూడా ఇబ్బందేనని, కనీసం ఏయే కేసులు విచారిస్తున్నారో పిటిషన్ నంబర్లయినా ఉండాలని స్పష్టం చేసింది.

ముగ్గురి నుంచే
2,500 పిటిషన్లు

» వివరణ కోరిన రాష్ట్ర సమాచార కమిషన్

రాష్ట్ర సమాచార హక్కు కమిషన్... వందలకొద్దీ పిటిషన్లు దాఖలు చేసిన ముగ్గురిని గురువారం పిలిపించి వివరణలు కోరింది. ఈ మేరకు కమిషన్ ప్రధాన కమిషనర్‌తో పాటు మొత్తం ఐదుగురు కమిషనర్ల ఫుల్ బెంచ్ విచారణ నిర్వహించింది. కమిషన్ అభిప్రాయం ప్రకారం.. రాష్ట్రంలో ఏటా వివిధ అంశాలపై సమాచారం కోరుతూ సుమారు 1.2 లక్షల దరఖాస్తులు మొదటి సమాచార అధికారులకు అందుతున్నాయి. వాటిలో 90 శాతం వరకు దరఖాస్తులకు సమాధానాలు ఇస్తున్నారు. 8 శాతం మాత్రం రెండో అప్పీల్ రూపంలో కమిషన్ వద్దకు వస్తున్నాయి. అయితే, విచారణకు హాజరైన ముగ్గురు వ్యక్తులు మాత్రమే వేల సంఖ్యలో దరఖాస్తులు, వందల సంఖ్యలో అప్పీళ్లు వేయడంలో అంతరార్థం ఏమిటని కమిషన్ దృష్టి సారించింది. ఈ ముగ్గురి నుంచే సుమారు 2,500 సెకండ్ అప్పీళ్లు వచ్చినట్లు కమిషన్ గుర్తించింది. వారు ఎందుకు ముఖ్యంగా పాఠశాల విద్య, డీటీసీపీ వంటి కొన్ని శాఖలపైనే దృష్టి సారించారో సమీక్షించనుంది. శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి 2023 నుంచి బడ్జెట్ సంబంధిత అంశాలపై వేలకొద్దీ దరఖాస్తులు దాఖలు చేసినట్లు వెల్లడించింది. వడ్డే శ్యామ్ అనే వ్యక్తి చార్మినార్ జోన్‌లోని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్, డీటీసీపీ వంటి విభాగాలపై, యండీ అష్రఫ్ అనే మరో వ్యక్తి 20 జిల్లాల్లోని 20 విభాగాల మీద, అందునా పాఠశాల విద్య, రెవెన్యూ, గృహ విభాగం మీద సమాచారం కోసం ఎక్కువగా పిటిషన్లు దాఖలు చేశారని కమిషన్ తెలిపింది.

యాప్ డిజైన్ లీడర్‌గా హైదరాబాద్

ఏఐ టెక్నాలజీకి గ్లోబల్ సెంటర్‌గా రాష్ట్ర రాజధాని: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

» త్వరలో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ డిజైన్' ప్రారంభం: శ్రీధర్‌బాబు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను యాప్ డిజైన్ లీడర్‌గా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. యూఎంవో ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్‌లో 'యూఎక్స్ ఇండియా-25' పేరిట ఏర్పాటు చేసిన 21వ యూజర్ ఎక్స్‌పీరియన్స్ అండ్ ప్రొడక్ట్ డిజైన్ అంతర్జాతీయ సదస్సును పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం ఎలాంటి టెక్నాలజీనైనా అందిపుచ్చుకుని లీడర్‌గా ఎదుగుతుందని అన్నారు. ఏఐ టెక్నాలజీకి హైదరాబాద్‌ను గ్లోబల్ సెంటర్‌గా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం పట్టుదలతో కృషి చేస్తోందన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన ప్రతినిధులు హైదరాబాద్ సంస్కృతి, కళలు, ఆహారాన్ని ఆస్వాదించాలని కోరారు. రాష్ట్ర టెక్నాలజీ రంగంలో ప్రతినిధులు ప్రధానంగా గుర్తించిన అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హైదరాబాద్‌ను గ్లోబల్ డిజైన్ హబ్‌గా మార్చాలనే సంకల్పంతో త్వరలోనే 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ డిజైన్'ను ప్రారంభించనున్నట్లు చెప్పారు. టీ-హబ్, టీ-వర్క్స్, వీ-హబ్ వంటి సంస్థల ద్వారా రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ హబ్‌గా మార్చేందుకు తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయబోతున్న ఏఐ ఇన్నోవేషన్ హబ్‌లో డిజైనింగ్‌కు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. యూఎంవో డిజైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కళాధర్ బాపు మాట్లాడుతూ ప్రతి రంగంలోనూ డిజైనింగ్ అత్యంత కీలకంగా మారిందన్నారు. 2030 నాటికి 10 లక్షల మంది మహిళలకు డిజైనింగ్ పరిజ్ఞానంలో శిక్షణనివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సదస్సుకు 16 దేశాల నుంచి 1500 మందికి పైగా ప్రతినిధులు వచ్చారని, ఇందులో 40 శాతం మహిళలే కావడం విశేషమన్నారు.



యూఎక్స్ ఇండియా సదస్సులో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

మెట్రో భవిష్యత్తు ఎటో?

నివేదిక కోరిన ప్రభుత్వం.. తదుపరి చర్యలపై సర్వత్రా చర్చ

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎంఆర్ఎల్ (హైదరాబాద్ మెట్రో రైల్) ఎండీగా సుదీర్ఘ కాలంగా కొనసాగిన ఎన్వీఎస్ రెడ్డిని తప్పించడంతో.. మరోసారి మెట్రో వ్యవహారం చర్చనీయాంశమైంది. ఈ ప్రాజెక్టు నుంచి ఎల్ అండ్ టీ తప్పుకొంటుందని, ప్రభుత్వమే ఇక మెట్రో నిర్వహణ చేపడుతుందని, ప్రత్యేక కార్పొరేషన్(ఎస్పీవీ) ఏర్పాటు చేస్తుందని.. కార్పొరేట్ ఏజెన్సీలకు అప్పగిస్తుందని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తాయని.. ఇలా రకరకాల వాదనలు తెరమీదకు వచ్చాయి. ఆ వాదనల సంగతెలా ఉన్నా.. ఈ ప్రాజెక్టు నుంచి ఎల్ అండ్ టీ తప్పుకోవడం దాదాపు ఖరారైనట్టు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. ఈ వ్యవహారంపై నివేదిక ఇవ్వాలని మెట్రో ఎండీగా కొత్తగా నియమితులైన సర్ఫరాజ్ అహ్మద్‌ను ప్రభుత్వం కోరినట్టు సమాచారం. అయితే నిర్దిష్టంగా ఏ అంశంపై సర్కారు నివేదిక కోరిందీ వివరాలు తెలియరాలేదు. ఎల్ అండ్ టీ చెబుతున్నట్టు మెట్రో నిజంగా నష్టాల్లో ఉంటే ఆ నష్టాలకు కారణాలేమిటనే అంశంపై నివేదిక ఇస్తారా? లేక, రోజువారీ లావాదేవీల మీద, ఆదాయ, వ్యయాల మీద ఇస్తారా? మొత్తం మెట్రో నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నివేదిక కోరిందా అనే విషయాలు తెలియాల్సి ఉంది. నివేదిక అందిన అనంతరం మెట్రోపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే అంశంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది.



ఈసారి కేంద్రానికి కూడా

మెట్రో ఆదాయం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1108 కోట్లుగా ఉంది. మెట్రోకు కేటాయించిన భూములను సద్వినియోగం చేసుకుని ఉంటే మరింత ఆదాయం లభించేదని.. ఆర్థిక భారం నుంచి కొంత ఉపశమనం ఉండేదని అధికారులు చెబుతున్నారు. కాగా.. మెట్రో నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకొంటామంటూ గతంలో కూడా లేఖలు రాసిన ఎల్ అండ్ టీ ఈ దఫా కేంద్ర గృహనిర్మాణ శాఖ సంయుక్త కార్యదర్శికి లేఖ రాయడం చర్చనీయాంశం అయింది.

పూచీకత్తు ఇస్తేనే... ధాన్యం కేటాయింపులు

రైస్‌మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా బీజీ శాతం

డిఫాల్టర్లకు వద్ద కేటాయింపులు చేసేది లేదని నిర్ణయం

» ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ

హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల్లో ప్రారంభించబోయే వానాకాలం (2025- 26) సీజన్ ధాన్యం సేకరణ, కస్టమ్ మిల్లింగ్ కోసం ధాన్యం కేటాయింపులపై పౌర సరఫరాల శాఖ కసరత్తు ప్రారంభించింది. రైస్ మిల్లర్లకు ధాన్యం అప్పగించే క్రమంలో పూచీకత్తు తీసుకోవాల్సిందేనని నిర్ణయించింది. గడిచిన రెండు సీజన్లలో బ్యాంకు గ్యారెంటీ తీసుకునే ధాన్యం కేటాయింపులు చేయగా.. ఈసారి కూడా అదే పద్ధతిని అనుసరించాలని నిర్ణయించింది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తిగా డిఫాల్టర్ల జాబితాలో ఉన్న రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు చేయరు. ముందస్తుగా బ్యాంకు గ్యారెంటీ తీసుకోవాలని, అండర్ టేకింగ్‌పై వడ్లు కేటాయించవద్దని, బ్యాంకు గ్యారెంటీని భౌతికంగా పరిశీలించకుండా కేటాయింపులు చేయొద్దని ఆదేశాల్లో పేర్కొన్నారు. కాగా కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా జిల్లాస్థాయిలో కలెక్టర్లు (పౌరసరఫరాలు) మిల్లర్లకు నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర, జిల్లా రైస్ మిల్లర్ల సంఘాలకు కూడా నోటీసులు పంపించారు. ధాన్యం కొనుగోళ్లు కొన్ని జిల్లాల్లో ఈనెల 25వ తేదీ నుంచి, మిగిలిన జిల్లాల్లో అక్టోబరు ఒకటో తేదీ నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో.. ఆలోపే రైస్ మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీ/సెక్యూరిటీ డిపాజిట్ పత్రాలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది.

అమెరికాలో పోలీసు కాల్పులు.. పాలమూరు వాసి మృతి

- రూమ్‌మేట్స్ మధ్య గొడవ.. ఆయుధాలతో పరస్పర దాడులు
- పోలీసులు నిలువరించే యత్నం.. ఆపై కాల్పులు...15 రోజుల క్రితం ఘటన
- మృతుడు కాలిఫోర్నియాలోని గూగుల్‌లో ఉద్యోగి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉద్యోగం చేస్తున్న పాలమూరు వాసి.. రూమ్ మేట్స్ మధ్య గొడవ నేపథ్యంలో పోలీసులు జరిపిన కాల్పులకు బలయ్యాడు. పదిహేనురోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం ఉదయం తల్లిదండ్రులకు సమాచారం రావడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. మహబూబ్‌నగర్‌లోని రామయ్యబౌళిలో నివాసం ఉంటున్న అసునొద్దీన్ దంపతులిద్దరూ ఉపాధ్యాయురాలే. వారికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కాగా, 2016 డిసెంబరులో అమెరికాకు వెళ్లిన పెద్ద కుమారుడు నిజాముద్దీన్ (29).. కాలిఫోర్నియాలోని గూగుల్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే 15 రోజుల క్రితం రూమ్‌మేట్స్‌తో గొడవ జరిగింది. దీంతో అత్యవసర టెలిఫోన్ నం.911కు ఫోన్‌కాల్ వెళ్లింది. వెంటనే స్పందించిన షాంటాక్లారా పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. కానీ, రూమ్‌మేట్స్ ఆయుధాలతో దాడులు చేసుకుంటుండటంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నిజాముద్దీన్ మృతి చెందాడని చెబుతున్నట్లు తండ్రి అసునొద్దీన్ చెప్పారు. గురువారం కుమారుడి స్నేహితుడు తండ్రికి ఫోన్ చేసి ఈ సమాచారాన్ని అందించారు. ఎన్నో ఆశలతో అమెరికా వెళ్లి అక్కడ ఉద్యోగం చేస్తున్న కుమారుడి మరణవార్తతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తమ కుమారుడి మృతదేహాన్ని తీసుకువచ్చే ఏర్పాట్లు చేయాలని వారు కోరుతున్నారు. గత పదేళ్లలో నిజాముద్దీన్ ఒక్కసారి కూడా మహబూబ్‌నగర్‌కు రాలేదని, తమకు చివరి చూపు చూసుకునే అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు.

విశాఖ-హైదరాబాద్ విమానానికి తప్పిన ముప్పు

బయలుదేరాక కాసేపటికే ఢీకొన్న పక్షి...క్షేమంగా ల్యాండింగ్

విశాఖపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానానికి పెద్ద ముప్పు తప్పింది. మొత్తం 103 మంది ప్రయాణికులతో మధ్యాహ్నం 2.38 గంటలకు ఈ విమానం విశాఖ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. అయితే కేవలం తొమ్మిది నిమిషాల్లోనే... 2.47 గంటల సమయంలో తిరిగి వెనక్కి వస్తున్నట్టు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్(ఏటీసీ)కు పైలట్ సమాచారం అందించారు. సరిగ్గా మూడు గంటలకు సురక్షితంగా విమానాన్ని ల్యాండింగ్ చేశారు. గాల్లోకి ఎగిరిన కొద్దిసేపటికే ఓ పక్షి విమానంలో రెండో నంబరు ఇంజన్‌ను ఢీకొట్టిందని, దానివల్ల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉండడంతో విమానాన్ని వెనక్కి తీసుకువచ్చారని విమానాశ్రయం వర్గాలు తెలిపాయి. ప్రయాణికులు అందరినీ విమానం నుంచి దించేసి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.



సీఎంకు రూ.2 కోట్ల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు

వేడుక రద్దు.. ఆ సొమ్ము రైతు సంక్షేమానికి!

- కుమారుడి రిసెప్షన్ రద్దు చేసి.. రూ.2కోట్ల చెక్కును సీఎం రేవంత్‌కు అందజేసిన మిర్యాలగూడ ఎమ్మెల్యే

మిర్యాలగూడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకను రద్దు చేసుకొన్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.. ఆ సొమ్మును రైతుల సంక్షేమానికి వినియోగించాలని నిర్ణయించి, అందరికీ ఆదర్శంగా నిలిచారు. నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ నియోజకవర్గంలోని రైతుల సంక్షేమానికి రూ.2కోట్లు వెచ్చించాలని నిర్ణయించారు. రిసెప్షన్‌ను రద్దు చేసుకున్నందున ఆ ఖర్చును రైతుల కోసం వినియోగించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతూ రూ.2 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గత నెలలో తన పెద్ద కుమారుడు సాయిప్రసన్నకు వెన్నెలతో వివాహం అయిందని చెప్పారు. మిర్యాలగూడలో భారీ రిసెప్షన్ ఏర్పాటు చేసి.. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ముఖ్య నేతలను ఆహ్వానించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులను సంప్రదించి రిసెప్షన్‌ను రద్దు చేసుకొని, ఆ ఖర్చును రైతుల ప్రయోజనాలకు ఉపయోగించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే కుటుంబసభ్యులను సీఎం రేవంత్ అభినందించారు. గొప్ప నిర్ణయం తీసుకున్నారంటూ కొనియాడారు.

వామన్‌రావు దంపతుల హత్యపై సీబీఐ విచారణ షురూ

మంథని, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయవాది గట్టు వామన్‌రావు, వెంకట నాగమణి దంపతుల దారుణ హత్యపై సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని మారుతినగర్ సమీపంలో 2021 ఫిబ్రవరి 17న వామన్‌రావు దంపతులు దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసుపై సమగ్ర విచారణ చేపట్టి, నిందితులను గుర్తించాలని కోరుతూ వామన్‌రావు తండ్రి కిషన్‌రావు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు ముగ్గురితో కూడిన సీబీఐ అధికారుల బృందం గురువారం గోదావరిఖని ఏసీపీ మడత రమేష్‌తో కలిసి మంథని మండలం గుంజపడుగులోని వామన్‌రావు ఇంటికి వెళ్లారు. అనంతరం మంథని కోర్టుకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. మారుతినగర్ సమీపంలో వామన్‌రావు దంపతులు హత్యకు గురైన సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వామన్‌రావు తండ్రి కిషన్‌రావు మీడియాతో మాట్లాడుతూ వామన్‌రావు దంపతుల హత్య వెనుక నాటి పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు, ఆయన భార్య, పూదరి సత్యనారాయణ సహా కొందరు పెద్దలు ఉన్నారని ఆరోపించారు.

సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మపై మరో కేసు

రాయదుర్గం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మపై తాజాగా మరో కేసు నమోదయింది. రాంగోపాల్‌వర్మ తెరకెక్కించిన దహనం వెబ్ సిరీస్‌లో తన ప్రొఫైల్‌ను వాడారని ఆరోపిస్తూ ఓ విశ్రాంత మహిళా ఐపీఎస్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయనపై ఐపీసీ 509, 468, 469, 500, 120(బి) సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. దహనం వెబ్‌సిరీస్‌కు డైరెక్టర్‌గా, నిర్మాతగా వ్యవహరించిన రాంగోపాల్‌వర్మ ఫ్యూడలిస్టులు, నక్సలైట్లకు మధ్య జరిగే పోరాటం నేపథ్యంగా దానిని తెరక్కించారు.

విమానాశ్రయంలో 3.3కిలోల బంగారం స్వాధీనం

- ఐరన్ బాక్స్‌ల్లో దాచి తరలింపు.. ముగ్గురి అరెస్ట్

హైదరాబాద్,సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలో కువైట్ నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల నుంచి 3.38 కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.3.36 కోట్లు ఉంటుందని తెలిపారు. అక్రమంగా బంగారాన్ని తరలించిన ఇద్దరు ప్రయాణికులతో పాటు కువైట్‌లో వీరికి బంగారాన్ని అప్పగించిన హ్యాండ్లర్‌ను డీఆర్ఐ అధికారులు అరెస్టు చేశారు. నిందితులు ఎవరికీ అనుమానం రాకుండా ఐరన్ బాక్సు లోపల, బ్యాగు కవర్లలో బంగారాన్ని దాచి తీసుకువచ్చారు. అనంతరం వాటిని విమానాశ్రయంలో లగేజ్ కౌంటర్ వద్ద వదిలేశారు. ఏపీలోని అన్నమయ్య, కడప జిల్లాలకు చెందిన ఇద్దరు ప్రయాణికులను గుర్తించిన డీఆర్ఐ బృందాలు.. ఆయా జిల్లాలకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరికి కువైట్‌లో బంగారాన్ని ఇచ్చిన హ్యాండ్లర్ సమాచారం తెలుసుకుని, అతడు హైదరాబాద్ చేరుకోగానే అరెస్టు చేశారు.

నీళ్లలో బస్తీ



శ్రీరాంనగర్ బస్తీలో నిలిచిపోయిన నీళ్లు

శ్రీరాంనగర్ బస్తీలో ఐదు అడుగుల మేర నీళ్లు

- రూ.లక్ష చొప్పున నష్టం.. వరదలో మునిగిన 50 బైక్‌లు
- నాలా పైప్‌లైన్ మూసివేత వల్లే సమస్య
- పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్
- పైప్‌లైన్ పునరుద్ధరణకు ఆదేశాలు
- హైదరాబాద్‌లో పగలంతా ఎండ.. సాయంత్రానికి వర్షం
- మరో మూడు రోజుల పాటు వర్షాలు

రాంనగర్, అమీర్‌పేట, అఫ్జల్‌గంజ్, హైదరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బుధవారం రాత్రి భారీ వర్షానికి ఆ బస్తీని వరద ముంచెత్తింది. బస్తీలోని 200 ఇళ్లలో నాలుగైదు ఫీట్ల మేర వరద నీరు నిలిచింది. మోటార్లు పెట్టి అదేపనిగా తోడుతున్నా ఆ వరద తగ్గడం లేదు. ఇళ్లలో ఉండే పరిస్థితి లేదు.. లోపలి నుంచి బయట కాలు పెట్టే పరిస్థితీ లేదు. ఫలితంగా బస్తీవాసుల కష్టాలు అన్నీఇన్నీ కావు. బియ్యం, పప్పులు సహా నిత్యావసర సరుకులు పాడైపోవడంతో పస్తులుంటున్నారు. కనీసం తాగేందుకూ నీళ్లు లేక దాహంతో అలమటిస్తున్నారు. విద్యుత్తు సరఫరా లేక అక్కడి జనాలు చీకట్లలోనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గృహోపకరణాలూ పనికిరాకుండాపోయాయి. వంట సరుకులు పాడైపోవడం, గృహోపకరణాలు దెబ్బతినడంతో ఇంటికి రూ.లక్ష చొప్పున నష్టం జరిగింది. ఇదంతా రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని శ్రీరాంనగర్ బస్తీ పరిస్థితి! ఆ బస్తీ అంతా ఇప్పుడు చెరువును తలపిస్తోంది. ఇళ్లలో వృద్ధులు, చిన్నారుల పరిస్థితి దయనీయంగా మారింది. స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషన్ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ గురువారం తెల్లవారుజామున శ్రీరాంనగర్ బస్తీకి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. ప్రత్యేక మోటార్లను ఏర్పాటు చేసి నీటిని బయటకు పంప్ చేశారు. సాయంత్రం దాకా 20శాతం నీరు కూడా బయటకు పోలేదు. ఫలితంగా 24 గంటలు గడిచినా అక్కడి ప్రజలు వరదలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మరి.. బస్తీలో ఎందుకీ సమస్య ఉత్పన్నమైనట్లు? దీనిపైనే కమిషనర్ రంగనాథ్ ఆరాతీస్తే.. ఇదంతా ఓ ప్రైవేటు వ్యక్తి నిర్వాక ఫలితమని తేలింది. ఈ బస్తీది దాదాపు వందేళ్ల చరిత్ర. బస్తీలో వాన నీరు సమీపంలోని హుస్సేన్‌సాగర్ నాలాలోకి వెళ్లేందుకు 50 ఏళ్ల క్రితం ప్రత్యేక పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఆ స్థలం తనదంటూ ఓ వ్యక్తి ఆ పైప్‌లైన్‌ను బ్లాక్ చేశాడు. ఫలితంగా బయటకు వెళ్లే పరిస్థితి లేక వరద నీరంతా బస్తీలోనే జామ్ అవుతోంది. వర్షంపడ్డ ప్రతిసారి జీహెచ్ఎంసీ అధికారులు మోటార్ల ద్వారా నీటిని బయటకు పంపుతున్నారు. బస్తీ పరిస్థితిపై స్పందించిన రంగనాథ్, శ్రీరాంనగర్ నుంచి హుస్సేన్ సాగర్ నాలా వరకు ఉన్న పైప్‌లైన్ వ్యవస్థను వెంటనే పునరుద్ధరించాలని, తద్వారా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పైప్‌లైన్‌ను బ్లాక్ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందించిన ఇంజనీరింగ్ అధికారులు స్పందించి జేసీబీని రప్పించి పాత పైప్‌లైన్ వ్యవస్థ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. కాగా రంగనాథ్... నగరం వ్యాప్తంగా పలు ముంపు ప్రాంతాల్లోనూ పర్యటించి పరిస్థితులపై ఆరా తీశారు.

మళ్లీ వర్షం

హైదరాబాద్‌ను వాన వదలడం లేదు. గురువారం నగర వ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షం పడింది. మధ్యాహ్నం 3:30 వరకు ఎండ దంచికొట్టింది. ఆ తర్వాత మబ్బులు కమ్ముకున్నాయి. సాయంత్రం 4.30 నుంచి 5.15 వర్షం పడింది. పాతబస్తీలోని గౌలిపురా హనుమాన్‌నగర్‌లో, ఛత్రినాక శివగంగ నగర్‌లో, పంజాగుట్ట మోడల్ హౌస్‌వద్ద, పంజాగుట్ట మసీద్ వద్ద, ఖైరతాబాద్, అమీర్‌పేట్ మెట్రోస్టేషన్లు, బల్కంపేట్ సబ్‌వేలు నీట మునిగాయి బంజారాహిల్స్ రోడ్డు నంబరు-12 పోలీసు కమాండ్ కంట్రోల్ రూం వద్ద పెద్ద ఎత్తున నీరు నిలవడంతో ట్రాఫిక్‌ను మళ్లించారు. బహదూర్‌పురా మండలంలోని చందూలాల్ బారాదారిలో 8.6 సెం.మీ, దూద్‌బౌళిలో 8.3 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ గేట్లు మళ్లీ ఓపెన్ చేశారు. హిమాయత్‌సాగర్ నీటిమట్టం 1762 అడుగులకు, ఉస్మాన్‌సాగర్ నీటి మట్టం 1789 అడుగులకు చేరుకుంది. జంట జలాశయాల నుంచి నీళ్లను వదులుతుండటంతో అంబర్‌పేట్‌లోని ముసారాంబాగ్ బ్రిడ్జిపై ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో గురువారం భారీ వర్షం పడింది. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలో 9.4 సెం.మీ వర్షపాతం నమోదైంది. కాగా రానున్న రెండు, మూడు రోజులపాటు హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

విషాదాలు..

బల్కంపేట నుంచి బేగంపేటకు వెళ్లే మార్గంలో రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద వరద నీటిలో మునిగి మహ్మద్ షరీఫుద్దీన్ (27) అనే యువకుడు దుర్మరణం చెందాడు. అతడు ముషీరాబాద్ సమీపంలోని భోలక్‌పూర్‌లో ఉంటున్నాడు. కూకట్‌పల్లిలో కృత్రిమ అవయవాలు తయారుచేసే కర్మాగారంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 9:30కు కర్మాగరం నుంచి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. బల్కంపేట అండర్ బ్రిడ్జి కింద వరదలో బైక్ చిక్కుకుపోవడంతో బయటకు తీసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో వరద ఉధృతి పెరగడంతో అతడూ నీళ్లలో మునిగిపోతూ హాహాకారాలు చేశాడు. రక్షించేందుకు స్థానికులు విఫలయత్నం చేశారు. హైడ్రా సిబ్బంది వచ్చి.. చాలాసేపు ప్రయత్నించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య సల్మా, ఏడాది వయసున్న కూతురు ఉన్నారు. ఈనెల 14న హబీబ్‌నగర్ నాలాలో కొట్టుకుపోయిన ఇద్దరు మామా అల్లుళ్లలో ఒకరి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు నల్లగొండ జిల్లా వలిగొండ సమీపంలోని మూసీ వద్ద గురువారం అల్లుడు అర్జున్ మృతదేహం లభించింది. మృతుడికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నాడు.



అమీర్‌పేట-ఎల్లారెడ్డిగూడ రహదారిపై భారీగా ప్రవహిస్తున్న వరద



హైటెక్‌సిటీలో నిలిచిపోయిన వాహనాలు

కూతుర్ని చంపి తండ్రి ఆత్మహత్య

- ప్రమాదంలో వికలాంగురాలైన భార్య
- పెరిగిన అప్పులు.. దిక్కుతోచక ఆత్మహత్య



మృతులు అశోక్, దివ్య (ఫైల్)

పేట్ బషీరాబాద్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అధికమైన ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ తండ్రి.. కూతుర్ని చంపి, తాను ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బహదూర్‌పల్లి వాసి అశోక్ (50), భార్య సోని, కూతురు దివ్య (5)లతో కలిసి ఇందిరమ్మ కాలనీలో అద్దెకుంటూ వంట మనిషిగా జీవిస్తున్నాడు. మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొట్టడంతో భార్య సోనీ ఎడమ కాలు తీసేయడంతో ఇంట్లోనే ఉంటుండగా, అశోక్‌కూ ఏ పని దొరకక ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో జీవితంపై విరక్తితో 3 రోజుల క్రితం రాత్రి ఇంట్లో గ్యాస్ లీక్ చేసి.. కుటుంబ సభ్యులంతా చనిపోదామనుకున్నాడు. భార్య బయటికొచ్చి కేకలేయడంతో చుట్టుపక్కల వారి సాయంతో గ్యాస్ సిలిండర్‌ను ఆఫ్ చేశారు. మరునాడు కూతురు దివ్యతో కలిసి బయటకెళ్లిన అశోక్.. మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ కళాశాల వెనుక చెరువులో గురువారం శవాలై తేలారు. మృతులు ఇందిరమ్మ కాలనీ వాసులని స్థానికులు చెప్పడంతో అశోక్ భార్య సోనికి సమాచారమిచ్చారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. మృతదేహాలను పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

సంగారెడ్డి జైలులో సైకో ఖైదీలు

- గంజాయి మత్తు లభించక వీరంగం
- గాజు పెంకులు మింగుతామంటూ రభస
- సంగారెడ్డి, ఉస్మానియా, ఎర్రగడ్డ, గాంధీ ఆస్పత్రులకు జైలు అధికారుల పరుగులు

కంది, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జైలుకు రిమాండ్ ఖైదీలుగా వచ్చిన ఇద్దరు వ్యక్తులు కారాగారంలో వీరంగం సృష్టించారు. గంజాయికి బానిసలైన ఆ ఇద్దరు.. జైలులో గంజాయి మత్తు లభించక సైకోల్లా ప్రవర్తించారు. ఆత్మహత్యాయత్నాలు చేసి జైలు అధికారులను సంగారెడ్డి, ఉస్మానియా, ఎర్రగడ్డ, గాంధీ ఆస్పత్రులకు పరుగులు పెట్టించారు. మరీ ముఖ్యంగా ఉస్మానియా ఆస్పత్రిలో బీభత్సం సృష్టించిన ఆ ఖైదీలు.. గాజు పెంకులు మింగి ఆత్మహత్య చేసుకుంటామంటూ ఇటు పోలీసులు, అటు వైద్య సిబ్బందిని హడలెత్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఓ హత్యాయత్నం కేసులో ఇటీవల సంగారెడ్డి జైలుకు రిమాండ్ ఖైదీలుగా వచ్చిన ఇద్దరు ఖైదీలు సెప్టెంబరు 15న జైలులోని గోడ గడియారం బ్యాటరీ, పెన్ను మూతను మింగేశారు. అనంతరం గాజు పెంకులు మింగి ఆత్మహత్యకు యత్నించామని, కడుపులో నొప్పిగా ఉందని జైలు అధికారులకు చెప్పారు. దీంతో జైలు అధికారులు వారిని హుటాహుటిన సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఎక్స్‌రే తీసేందుకు వచ్చిన అక్కడి వైద్య సిబ్బంది, వైద్యులపై దూషణలకు పాల్పడిన వారిద్దరూ వింతగా ప్రవర్తిస్తూ వైద్యం చేయించుకునేందుకు నిరాకరించారు. దీంతో జైలు అధికారులు అఫ్జల్‌గంజ్ పోలీసుల సాయంతో ఆ ఖైదీలను హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఉస్మానియాలో మరింత రెచ్చిపోయిన ఆ ఖైదీలు.. పోలీసులను, వైద్యులను దూషిస్తూ వైద్యం చేయించుకోకుండా గట్టిగా కేకలు వేస్తూ వార్డులోని ఓ మంచాన్ని కూడా విరగొట్టారు. విరిగిన మంచంలోని ఓ ముక్కతో కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. ఆపై, ఆ గాజు పెంకులతో ఒళ్లంతా గాట్లు పెట్టుకున్నారు. అంతటితో ఆగకుండా గాజు పెంకులను నోట్లో పెట్టుకుని.. ఎవరైనా దగ్గరికొస్తే ఆ ముక్కలను మింగేస్తామంటూ వైద్య సిబ్బంది, పోలీసులను బెదిరించారు. అతికష్టం మీద వారిద్దరికీ సంకెళ్లు వేసిన పోలీసులు బలవంతంగా వైద్యం ప్రారంభించారు. కానీ, వైద్యులు ఇంజెక్షన్ చేసేటప్పుడు కూడా అటూఇటు ఊగిపోతూ ఎగురుతూ నర్సులపై తిరగబడుతూ నానా రభస చేశారు. దీంతో వీరి మానసిక పరిస్థితి బాగా లేదని ఎర్రగడ్డలోని మానసిక వైద్యశాలకు తరలించాలని ఉస్మానియా వైద్యులు సూచించారు. దీంతో జైలు అధికారులు, పోలీసులు ఆ ఖైదీలను ఎర్రగడ్డ ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు చేసిన అక్కడి వైద్యులు ఖైదీల మానసిక స్థితి బాగానే ఉందని, కావాలనే విపరీతంగా ప్రవర్తిస్తున్నారని నిర్ధారించారు. దాంతో ఖైదీలను గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ ఎలాగోలా వారికి ఎక్స్‌రేలు తీశారు. దాంతో ఆ ఖైదీలు గోడ గడియారం బ్యాటరీ, పెన్నుమూత మింగారని గాంధీ ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. మందులు ఇవ్వడంతో బ్యాటరీ, పెన్నుమూత బయటపడ్డాయి. అనంతరం ఆ ఖైదీలను డిశ్చార్జి చేయడంతో అటు పోలీసులు, ఇటు జైలు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, గంజాయికి బానిసలైన ఇద్దరు ఖైదీలు నిత్యం నేరాలకు పాల్పడుతుంటారని జైలు అధికారులు తెలిపారు. జైలులో నానాయాగీ చేస్తూ తమలా తయారవ్వాలని ఇతర ఖైదీలను కూడా ఒత్తిడి చేస్తున్నారని చెబుతున్నారు.



ఉస్మానియా ఆస్పత్రిలో గాజు పెంకులు మింగుతామంటూ బెదిరిస్తున్న ఖైదీలు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.